# ప్రజా కలం

epaper.prajakalam.in
www.prajakalam.in

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily
తెలుగు దినపత్రిక

శుక్రవారం | 01-05- 2026 | సంపుటి: 17, సంచిక: 29, | నిజామాబాద్, | పేజీలు: 12, | వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526


### వస్తువుల నాణ్యత విషయంలో

# రాజీపడొద్దు

## సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం**

**విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి - ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి**



హైదరాబాద్, ఏప్రిల్ 30 (ప్రజాకలం) : విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...



### దేశానికే ఆదర్శంగా తెలంగాణలో

# అక్రిడిటేషన్ల జారీ

**అక్రిడిటేషన్ల సంఖ్య తేలితే జర్నలిస్ట్‌లకు మరిన్ని సౌకర్యాల కల్పన**

**గతం కంటే ఇప్పుడు రెట్టింపు సంఖ్యలో అక్రిడిటేషన్ల మంజూరు**

**మే10లోగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ అక్రిడిటేషన్లు**

**మే1 అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ల పంపిణీకి కలెక్టర్లకు ఆదేశం**

**మే 15వరకు అందరికీ బస్సు పాస్‌ల పొడిగింపు : మంత్రి పొంగులేటి**

హైదరాబాద్, ఏప్రిల్ 30 : రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్ట్‌కు అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచన మేరకు పాత్రికేయులకు ఆరోగ్యంతోపాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. గురువారం నాడు సమాచార శాఖ ఆధ్వర్యాన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంత్రిగారు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డులను ఇంతవరకు పొడిగించామని, దేశంలో, ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న

తరువాయి 2వ పేజీలో...




# టీఆర్ఎస్ కవితదే!

- సీఈసీ నుంచి అధికారిక ఆమోదం
- పార్టీ పేరుపై అనుమానాలకు ముగింపు
- "తెలంగాణ రక్షణ సేన"గా కొత్త దిశ
- కార్యకర్తల్లో ఉత్సాహం వెల్లువ
- రాష్ట్రవ్యాప్తంగా విస్తరణకు ప్రణాళికలు
- ఎన్నికల లక్ష్యంతో వ్యూహరచన

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ప్రజాకలం) : తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు తిరిగింది. టీఆర్ఎస్ పార్టీ పేరుకు సంబంధించి నెలకొన్న సందిగ్ధతకు కేంద్ర ఎన్నికల సంఘం ముగింపు పలికింది. ఆ పేరును అధికారికంగా కల్వకుంట్ల కవితకు కేటాయిస్తూ సీఈసీ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 25న మేడ్చల్‌లో జరిగిన సమావేశంలో కవిత "తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)" పేరును ప్రకటించగా, తాజాగా ఆ పేరుకు అధికారిక గుర్తింపు లభించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. బంజారాహిల్స్‌లోని ఆమె నివాసానికి ఎన్నికల సంఘం అధికారులు చేరుకుని అనుమతి పత్రాన్ని అందజేశారు.

తరువాయి 2వ పేజీలో...

# కొత్త ట్విస్ట్!

**మైక్రో ఫైనాన్స్ మోసం ఆరోపణల్లో కీలక పరిణామం**

**శివ చౌహాన్ ఖాతాల్లోకి మూడు సార్లు నిధుల లావాదేవీలు**

**రమావత్ మధు బ్యాంకు ఖాతాలు జప్తు చేసిన పోలీసులు**

**పరస్పర ఫిర్యాదులతో మంగ్లీ, న్యాయవాది మధ్య వివాదం**

**పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు, దర్యాప్తు వేగం**



2లో

# వీహెచ్‌కు సలహాదారు పదవి

## - శివధర్‌రెడ్డికి భద్రతా బాధ్యతలు



- వీహెచ్‌కు నెలకు లక్ష, శివధర్‌రెడ్డికి 2.25లక్షల వేతనం.. ఇతర అలవెన్స్‌లు
- భద్రతాసలహాదారుగా మూడేళ్ల కాలపరిమితి
- ఉత్తర్వులు జారీచేసిన సీఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ ప్రభుత్వం కీలక నియామకాలు చేపట్టింది. మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావును బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా నియమించగా, సీనియర్ ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ శివధర్‌రెడ్డిను రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

బీసీ సంక్షేమ శాఖ సలహాదారుగా నియమితులైన వీ హనుమంతరావుకు మంత్రి హోదాతో నెలకు రూ.1 లక్ష వేతనం లభించనుంది. ప్రభుత్వ నివాసం లభించనిపక్షంలో రూ.50 వేల హౌస్‌రెంట్ అలవెన్స్, వాహన వినియోగానికి కన్వేయన్స్, ఇంధన ఖర్చులు కూడా ప్రభుత్వం భరిస్తుంది. అదనంగా డ్రైవర్‌తో కూడిన వాహనం, వైద్య రీయింబర్స్‌మెంట్ వంటి సౌకర్యాలు కల్పించ నున్నారు. ఆయన కార్యాలయ నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ కేటాయించింది. ఇక రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమితులైన శివధర్‌రెడ్డి మూడేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. పోలీసు వ్యవస్థ, శాంతిభద్రతలు, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, నార్కోటిక్స్ కంట్రోల్ వంటి అంశాలపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వనున్నారు. ఆయనకు నెలకు రూ.2.25 లక్షల వేతనం, అదనంగా నివాస, వాహన, టీఏ, డీఏ, మెడికల్ సౌకర్యాలు వర్తించనున్నాయి. హోంశాఖ ఆయనకు అవసరమైన సిబ్బందిని కేటాయించింది.



### జీతం మొత్తం పేద విద్యార్థులకు: వీహెచ్

ఇదిలా ఉండగా, వీ హనుమంతరావు ఆదర్శ నిర్ణయం తీసుకున్నారు. తనకు లభించే నెల జీతం మొత్తాన్ని రెండేళ్లపాటు పేద విద్యార్థుల చదువులకు వినియోగిస్తానని ప్రకటించారు. ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న వారికి ఆర్థిక సహాయం అందిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తనకు ఇచ్చిన అవకాశాన్ని బడుగు బలహీన వర్గాల సేవకు వినియోగిస్తానన్నా రు. అయితే తాను రాజ్యసభ సీటు ఆశించానని, ముఖ్యమంత్రి సూచన మేరకు ఈ పదవిని స్వీకరించినట్లు వీహెచ్ వెల్లడించారు.

# విద్యాభివృద్ధి దిశగా..

## రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన

**పేదలకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం**

**దేవరకొండకు ఆరోగ్యశ్రీ కింద రూ.10 కోట్ల మంజూరు**

**ఎల్వోసీ దరఖాస్తులకు 24 గంటల్లో వేగవంతమైన అనుమతులు**

**ఎస్ఎల్‌బీసీ సొరంగంతో సాగునీటి విస్తరణకు భారీ ప్రణాళిక**



నల్లగొండ ఏప్రిల్ 30 (ప్రజాకలం) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం కోల్ ముంతల్ పహాడ్‌లోని రైతు వేదిక వద్ద రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' భవన నిర్మాణానికి ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ, విద్య లేకుండా సమాజం ముందుకు సాగలేదని, ప్రతి కుటుంబంలో విద్య వెలుగులు విరజిమ్మాలనే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఉన్నతమైన విద్యను ఉచితంగా అందించేందుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

తరువాయి 2వ పేజీలో...




### మే చివరి నాటికి

# 2 బిహెచ్‌కె

**ఇండ్ల కేటాయింపు పూర్తి చేయాలి**

**ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ లేదు**

**ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో మంత్రి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ప్రజాకలం): రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు ఏస్థాయిలో కూడా ఉన్నా కూడా మే నెల చివరి నాటికి లబ్ధిదారులను గుర్తించి కేటాయించాలని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ

2లో

# యుద్ధానికి భారత్ సిద్ధం!

**అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధమని కేంద్ర రక్షణ మంత్రి స్పష్టం**

**ఆపరేషన్ సింధూర్‌ను వ్యూహాత్మకంగా నిలిపివేసినట్లు వెల్లడి**

- త్రివిధ దళాల సమన్వయం దేశ శక్తికి నిదర్శనం
- ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చగా వ్యాఖ్య
- పాకిస్తాన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన కేంద్ర మంత్రి
- అంతర్జాతీయ ఉగ్రవాద కేంద్రంగా పాక్‌పై ఆరోపణలు
- ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలన్న పిలుపు



న్యూఢిల్లీ :రాజ్ నాథ్ సింగ్ చేసిన కీలక వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. బహల్గా జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'ను భారత్ తన స్వంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని ఆయన స్పష్టం చేశారు.

2లో...

# కొత్త ట్విస్ట్!

**మైక్రో ఫైనాన్స్ మోసం ఆరోపణల్లో కీలక పరిణామం**

**శివ చౌహాన్ ఖాతాల్లోకి మూడు సార్లు నిధుల లావాదేవీలు**

**రమావత్ మధు బ్యాంకు ఖాతాలు జప్తు చేసిన పోలీసులు**

**పరస్పర ఫిర్యాదులతో మంగ్లీ, న్యాయవాది మధ్య వివాదం**

**పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు, దర్యాప్తు వేగం**



హైదరాబాద్, ఏప్రిల్ 30 (ప్రజాకలం) : హైదరాబాద్‌లో గాయని మంగ్లీతో ముడిపడి ఉన్న మైక్రో ఫైనాన్స్ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసులో భాగంగా మంగ్లీ సోదరుడు శివ చౌహాన్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాలను పోలీసులు సమగ్రంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి శివ చౌహాన్ ఖాతాకు మూడు సార్లు డబ్బులు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. ఈ పరిణామంతో కేసు దర్యాప్తు మరింత కీలక దశకు చేరుకుంది. ఇదే క్రమంలో రమావత్ మధు బ్యాంకు ఖాతా లను పోలీసులు జప్తు చేయగా, మధు, హిమ కాంత్ రెడ్డి, శివ చౌహాన్‌లకు సంబంధించిన పూర్తి బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాలని సంబంధిత బ్యాంకులకు లేఖలు పంపారు. మైక్రో ఫైనాన్స్ పథకాల పేరుతో అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి, మంగ్లీ మరియు ఆమె సోదరుడు సహా మరికొందరు కోట్ల రూపాయల మేర మోసం చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావు కీలక ఆరోపణలు చేశారు. బాధితులు తనను సంప్రదించడంతో విషయాన్ని తెలుసుకునేందుకు మంగ్లీని సంప్రదించగా, ఆమె బెదిరింపులకు పాల్పడినట్లు ఆయన పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మంగ్లీ, ఆమె సోదరుడు మరియు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే, ఈ ఆరోపణలను మంగ్లీ తీవ్రంగా ఖండించారు. తనపై దుష్ప్రచా రం చేసి ప్రజల్లో ప్రాచుర్యం పొందాలని న్యాయవాది సుబ్బారావు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపిస్తూ అదే పోలీస్ స్టేషన్‌లో ప్రతిఫి ర్యాదు చేశారు. ప్రస్తుతం పరస్పర ఆరోపణల మధ్య ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీసే పనిలో ఉన్నారు.

## వస్తువుల నాణ్యత విషయంలో

# రాజీపడొద్దు

మొదటి పేజీ తరువాయి...

విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, TGBCWRIES కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

**కార్మిక వర్గానికి అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు...** మే డే(మే 1వ తేదీ) సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి ప్రత్యేకంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. శ్రామికులే తమ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వామ్యులని... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ప్లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

# విమర్శలు కాదు... ఫలితాలే ప్రమాణం

హైదరాబాద్, ఏప్రిల్ 30 : రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు 2026 పదవ తరగతి ఫలితాల్లో 99.12 శాతం ఉత్తీర్ణత సాధించి చరిత్ర సృష్టించాయి. మొత్తం 17,071 మంది పరీక్షలకు హాజరుకాగా 16,921 మంది ఉత్తీర్ణులయ్యారని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఈ ఫలితాలు సాధించడం గురుకులాల విద్యా ప్రమాణాలను మరింత బలపరిచిందన్నారు. గురువారం డి ఎస్ ఎస్ భవన్ లోని TGSWREIS లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మాట్లాడుతూ... ఇది కేవలం ఫలితం కాదని, వ్యవస్థాత్మక మార్పులు, నిరంతర పర్యవేక్షణ, ప్రభుత్వ సంకల్పం, వ్యూహాత్మక సంస్కరణల సమిష్టి ఫలితమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గురుకులాలను నూతన దిశగా తీసుకెళ్తున్నామని వెల్లడించారు.

ఫలితాల్లో రికార్డు

235 ఇనిస్టిట్యూషన్లలో 163 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించాయి.

9 జిల్లాల్లో అన్ని గురుకులాల్లో 100% ఫలితాలు సాధించాయి.

ఇంటర్ II సంవత్సరంలో 88.22% ఉత్తీర్ణత, 41 కాలేజీల్లో 100%

ఇంటర్ × సంవత్సరంలో 77.79% ఉత్తీర్ణత, 12 కాలేజీల్లో 100%

JEE మెయిన్స్‌లో 441 మంది అర్హత, 35 మంది 90 పర్సెంటైల్ పైగాIIT, JEE, NEETలో కూడా మెరుగైన ఫలితాలు

స్టూడెంట్ సెంట్రిక్' విధానమే విజయ రహస్యమన్న మంత్రి

ఇందుకోసం ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ

రోజువారీ బోధనతో పాటు ప్రత్యేక స్టడీ అవర్స్

సాయంత్రం డౌట్ క్లారిఫికేషన్ సెషన్లు

వీక్లీ, మంత్లీ అసెస్మెంట్లు

సిలబస్ పూర్తయ్యాక ప్రత్యేక రివిజన్

ఫెయిల్యూర్ రిస్క్ ఉన్న విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్

"ఒక్క విద్యార్థి కూడా వెనుకబడకూడదు" అనే లక్ష్యంతో ట్రాకింగ్ వ్యవస్థ అమలు చేసినట్లు మంత్రి తెలిపారు.

అకడమిక్ సంస్కరణలు

డేటా ఆధారిత విధానం

"బేసిక్ టు అడ్వాన్స్డ్" లెర్నింగ్ మోడల్

సబ్జెక్ట్ వారీ మైక్రో ప్లానింగ్

స్టూడెంట్ ఒ టీచర్ వైజ్ అనాలిసిస్

పర్ఫార్మెన్స్ డ్యాష్‌బోర్డ్స్

వెంటనే కరెక్టివ్ యాక్షన్

ఉపాధ్యాయుల అంకితభావం

ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లలుగా చూసుకుంటూ 24 గంటలు అందుబాటులో ఉండి బోధన అందించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని మంత్రి ప్రశంసించారు. టీచర్లకు ట్రైనింగ్స్, వర్క్‌షాప్స్, ఫలితాల ఆధారంగా రివ్యూ సిస్టమ్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పోషకాహారం – ఫలితాల పునాది

విద్యార్థుల ఆరోగ్యం, మానసిక స్థైర్యం విద్యా ఫలితాల్లో కీలకమని గుర్తించి మెస్ ఛార్జీలను పెంచి ప్రోటీన్ రిచ్ డైట్ అందిస్తున్నామని తెలిపారు. హాజరు పెరగడం, ఆరోగ్య సమస్యలు తగ్గడం ఫలితాల్లో ప్రతిబింబించిందన్నారు.

కాస్మోటిక్ ఛార్జీలు – గౌరవప్రద జీవనం

విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మవిశ్వాసం పెంచేందుకు కాస్మోటిక్ ఛార్జీలు పెంచినట్లు చెప్పారు.

మౌలిక సదుపాయాల్లో మార్పులు

ఆధునిక హాస్టల్ సదుపాయాలు

డిజిటల్ క్లాస్‌రూమ్స్ సైన్స్, కంప్యూటర్ ల్యాబ్స్

లైబ్రరీలు, క్రీడా వసతులు

గురుకులాలను "మోడల్ ఎడ్యుకేషన్ క్యాంపసెస్"గా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

మానసిక స్థైర్యం – ప్రత్యేక శ్రద్ధ

ఎగ్జామ్ ముందు స్ట్రెస్ మేనేజ్‌మెంట్

కౌన్సెలింగ్, మోటివేషనల్ సెషన్లు

హాస్టల్ వాతావరణాన్ని ఫ్యామిలీలా మార్చడం ద్వారా ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు.

పరిపాలనలో పారదర్శకత

డైట్, కాస్మోటిక్ బిల్లులు మార్చి 31 నాటికి క్లియర్ చేయడం జరిగిందన్నారు.

## దేశానికే ఆదర్శంగా తెలంగాణలో

# అక్రిడిటేషన్ల జారీ

మొదటి పేజీ తరువాయి...

ఉత్తమ విధానాలను ఇక్కడ అనుసరించాలన్న ఆలోచన మేరకు పరిశీలన సాగిందని అందువల్లే ఈ కార్డుల జారీలో ఆలస్యం చోటుచేసుకుందన్నారు. గత ప్రభుత్వం 32,500 మందికి అక్రిడిటేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నా 23,352 కే పరిమితం చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు సుమారు 46 వేల మందికి పైగా అక్రిడిటేషన్లు ఇచ్చేలా మార్పులు చేసిందని తెలిపారు. ఇప్పటికే సుమారు 2800 వరకు కార్డులను ఆమోదించడం జరిగిందని వివరించారు.

జర్నలిస్టుల సూచనల మేరకు జీవోలలో మార్పులు చేర్పులు చేశామని, అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరులో వెనకడుగు ప్రసక్తే లేదని అన్నారు. మే 1వ తేదీన అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలంటూ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు.

ఈ ప్రక్రియలో మే 10 వతేదీని ఒక కటాఫ్ డేట్‌గా పెట్టుకొని దరఖాస్తులు చేసుకోవాలని, ఆ తేదీలోగా వచ్చే దరఖాస్తులను ఆమోదించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్లు సంఖ్య తేలితే జర్నలిస్టులకు ఆరోగ్యం ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చునని అన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఈ దిశగా పలు సూచనలు చేశారని వెల్లడించారు. అంతేగాక జర్నలిస్టులు వివిధ సంస్థలలో ఉద్యోగాలు మారినప్పటికీ అక్రిడిటేషన్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుందని ఈ విషయంలో ఎటువంటి సందేహాలు వద్దని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని త్వరలో పాత్రికేయ సంఘాలతో భేటీ అవుతామని తెలిపారు.

ఏప్రిల్ 30తో కొంతమంది జర్నలిస్టుల బస్సుపాస్‌ల గడువు ముగుస్తున్నందున మరో 15 రోజుల పాటు పొడిగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధానికి భారత్ సిద్ధం!

మొదటి పేజీ తరువాయి...

ఏ ఎన్ ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ టూ పాయింట్ ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ఈ ఆపరేషన్‌ను ఆపివేయడం సామర్థ్యం లోపం వల్ల కాదని, పూర్తిగా వ్యూహాత్మకంగా తీసుకున్న నిర్ణయం అని వెల్లడించారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత సాయుధ దళాల సమైక్యత ప్రపంచానికి స్పష్టమైందని ఆయన అన్నారు. త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేసి దేశ భద్రతను కాపాడడంలో తమ ప్రతిభను చాటుకున్నాయని పేర్కొన్నారు. దేశం తన సొంత నిబంధనలు, వ్యూహాలు అనుసరించి ఆపరేషన్‌ను ప్రారంభించి, సమయానుకూలంగా ముగించిందని వివరించారు. అవసరమైతే భారత్ సుదీర్ఘ యుద్ధానికి కూడా పూర్తిగా సిద్ధంగా ఉందని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఉగ్రవాదం గురించి మాట్లాడుతూ, అది కేవలం భద్రతకు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, మానవత్వానికి మాయని మచ్చ అని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడం అనేది కేవలం ఒక దేశ బాధ్యత కాకుండా, ప్రపంచ సమాజం మొత్తం కలిసి పోరాడాల్సిన అంశమని తెలిపారు. మానవ విలువలను కాపాడటానికి ఈ పోరాటం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ పై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. పాకిస్తాన్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రంగా అభివర్ణిస్తూ, ఆ దేశం నిరంతరం ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తోందని ఆరోపించారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంటే, పాక్ అంతర్జాతీయ టెర్రరిజానికి కేంద్ర బిందువుగా మారిందని ఎద్దేవా చేశారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళతో సహా పూర్తిగా పెకిలించి నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. దేశ భద్రతతో పాటు మానవత్వ పరిరక్షణ కోసం భారత్ ఈ పోరాటాన్ని మరింత దృఢంగా కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# టీఆర్ఎస్ కవితదే!

మొదటి పేజీ తరువాయి...

ఈ పరిణామంతో పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీ పేరుపై స్పష్టత రావడంతో రాష్ట్రవ్యాప్తంగా సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించేందుకు కవిత సిద్ధమవుతున్నట్లు సమాచారం. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలమైన నెట్‌వర్క్ ఏర్పాటుకు ప్రణాళికలు రచిస్తున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజల్లోకి వెళ్లేందుకు పార్టీ వ్యూహాలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా యువత, మహిళలు, రైతుల సమస్యలను అజెండాగా తీసుకుని ముందుకు సాగాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# విద్యాభివృద్ధి దిశగా..

మొదటి పేజీ తరువాయి...

ఆధునిక వసతులు, నాణ్యమైన బోధన, క్రీడలు మరియు సాంకేతిక విద్యతో ఈ పాఠశాలలు భవిష్యత్తు తరాలకు బలమైన పునాది వేస్తాయని ఆయన పేర్కొన్నారు. దేవరకొండ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, ఆరోగ్యశ్రీ పథకం కింద ఇప్పటికే రూ.10 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక భారాన్ని తగ్గించడంలో ఈ పథకం కీలకంగా మారిందన్నారు. అదే విధంగా ఎల్వోసీ విధానం ద్వారా అభివృద్ధి పనులకు వేగం పెంచుతున్నామని, దరఖాస్తు చేసిన 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామని మంత్రి వివరించారు. దీని ద్వారా పనులు ఆలస్యం కాకుండా త్వరితగతిన పూర్తి అవుతున్నాయని అన్నారు. ఇక సాగునీటి రంగంపై మాట్లాడుతూ, ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ) సొరంగ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తరువాత దేవరకొండ, మునుగోడు మండలాలకు సమృద్ధిగా సాగునీరు అంది, వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. రైతుల ఆదాయం పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తంగా విద్య, వైద్యం, సాగునీరు వంటి కీలక రంగాల్లో సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# మే చివరి నాటికి 2 బిహెచ్‌కె

మొదటి పేజీ తరువాయి...

మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు చివరి దశలో ఉన్న ఇండ్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అంసపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేయడానికి ఇంతవరకు ఖర్చు చేసిన మొత్తాన్ని మినహాయించి , తదుపరి అవసరమైన వ్యయాన్ని ఐదు లక్షల లోపు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందచేస్తామని వెల్లడించారు. అసంపూర్తిగా ఉన్న 2 బిహెచ్ కె లను పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో లబ్ధిదారులే నిర్మించుకునేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ ఇండ్ల నిర్మాణాలకు గ్రీన్ ఛానల్ లో నిధులు విడుదల చేస్తామన్నారు. గురువారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లతో హౌసింగ్ రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనరసింహ, కరీంనగర్ ఇన్ ఛార్జి మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, ఐటి-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు, ఎస్సీ ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీ హెచ్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేయాలని , విద్యుత్, మంచినీటి, డ్రైనేజి , రోడ్లు వంటి కనీస వసతులు కల్పించాలని చాలా ఇండ్లలో అనర్హులు ఉన్నారని, వారిని తొలగించి అర్హులకు ఇవ్వాలని సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై మంత్రిగారు స్పందిస్తూ తక్షణమే అనర్హులను తొలగించే చర్యలు చేపట్టాలని, అర్హులకు కేటాయించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందులో ఎమ్మెల్యేలను భాగస్వామ్యులను చేయాలని సూచించారు. 400 కోట్ల రూపాయలతో 2 బిహెచ్ కె కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు తీసుకుని అక్కడ నివసించని వారి ఇండ్లను రద్దు చేసి, అర్హులైన ఇతరులకు వాటిని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నారు

2 బిహెచ్ కె బిల్లుల చెల్లింపుల్లో, అక్రమాలకు పాల్పడితే సస్పెండ్ తో సరిపెట్టనని సర్వీసు నుంచి తొలగించడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. గౌరవముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా పేదవారి సొంత ఇంటి కలను నిజం చేసేలా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదే అని, ఎల్-1, ఎల్-2, ఎల్-3 దరఖాస్తు ఇప్పుడు చేశారు, అప్పుడు చేశారనేది ముఖ్యం కాదనీ పేదరికమే అర్హతని, అర్హులైన వారికి ఇండ్లను ఇవ్వడమే కలెక్టర్ల బాధ్యత అని అన్నారు. మొదటి విడతలో వివిధ కారణాలతో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోని వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు.

పేదవాడికి సహాయం అందించాలన్న సదుద్దేశ్యంతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఇంటి నిర్మాణానికి అవసరమైన 40 టన్నుల ఇసుకను ఉచితంగా అందచేస్తున్నారని తెలిపారు. అయితే లబ్ధిదారుల ముసుగులో అక్కడక్కడా దుర్వినియోగం అవుతున్నదన్న సమాచారం ఉన్నదని , ఈ నేపథ్యంలో అర్హులకు ఇసుక అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్రమాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఆచరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై ఒక పాలసీని రూపొందించాలని సూచించారు నగరానికి దూరంగా 2బిహెచ్ కె కాలనీలను నిర్మించడం వల్ల లబ్ధిదారులు అక్కడ నివసించడానికి ఇష్ట పడటం లేదని, అక్కడ నివసిస్తే తమ జీవనోపాధికి ఇబ్బందికి కలుగుతుందని లబ్ధిదారులు వెళ్లడం లేదు. తీసుకున్న ఇండ్లను అద్దెకి ఇచ్చి నగరంలోనే ఉంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి, వారి స్థానంలో, ఆయా కాలనీలకు సమీపంలో నివసించే వారికి కేటాయించలన్న ఆలోచన చేస్తున్నాము. దీనిపై ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టాము.

ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ లేదు

ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి పడబోమని మంత్రిగారు స్పష్టం చేశారు. భూములను ఆక్రమణలను కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. రెవెన్యూ, ఫారెస్టు భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని మంత్రి గారు పేర్కొన్నారు. ఇందుకోసం రెవెన్యూ, ఫారెస్టు విభాగాలు జాయింట్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ సర్వేలను శాస్త్రీయ పద్ధతుల్లో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిర్వహించి భూముల స్పష్టమైన సరిహద్దులను గుర్తించాలని సూచించారు. దీనిద్వారా భవిష్యత్తుల్లో వివాదాలకు తెరపడుతుందన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్ మెంట్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. భూ రికార్డుల్లో పాదర్శకత, ఖచ్చితత్వం తీసుకుని రావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొత్తగా రెవెన్యూ డివిజన్లను మండలాలను ఏర్పాటు చేసే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఎక్కడా కలపడం కానీ, తీసివేయడం గానీ లేదని తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో నియోజకవర్గ కేంద్రాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని, అలాగే ఎమ్మార్వో ఆర్డీవో కార్యాలయాలు కూడా నిర్మిస్తున్నామని వీటికి అవసరమైన ప్రతిపాదనలను పంపాలని కలెక్టర్లకు సూచించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలా ప్రతిష్టాత్మకమైనది, ఈ పథకం చాలా అద్భుతంగా అమలు అవుతున్నది దీనిపై కలెక్టర్లు మరింత ఫోకస్ పెట్టాలని సూచించారు. మంజూరైన ప్రతి ఇల్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలన్నీ పరిష్కారమయ్యే విధంగా క్షేత్ర స్థాయిలో అధికారులు కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి శ్రీ డిఎస్ లోకేష్ కుమార్, హౌసింగ్ కార్యదర్శి శ్రీ విపి గౌతం తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సీఎం సహాయనిధి చెక్కులను
# పంపిణీ చేసిన సుజిత్ రావు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజా కలం) టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు నివాసంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు సుజిత్ రావు చేతుల మీద పంపిణీ చేశారు. 42 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు అందచేశారు. అనంతరం సుజిత్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అండగా భారీ మొత్తంలో నిధులు కేటాయిస్తూ పేదలకు అండగా ఉంటూ చేదోడు వాదోడుగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కిసాన్ సెల్ స్టేట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, స్టేట్ ఫిషరేస్ జెనరల్ సెక్రెటరీ రుత్త నారాయణ, మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్ముల చిన్నారెడ్డి, ఏలేటి వినోద్ రెడ్డి మాజీ ఎంపీటీసీ అశోక్, యూత్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు సాగర్, కోరుట్ల నియోజకవర్గం యూత్ వైస్ ప్రెసిడెంట్ దీపక్, మామిడి శేఖర్ రెడ్డి, కల్లెడ గంగాధర్, మహేష్, సమీర్, రాజు తదితరులు పాల్గొన్నారు

## మెట్ పల్లి నూతన జడ్జిగా వి. మాధవి



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజా కలం)

నూతన జూనియర్ సివిల్ జడ్జి గా వినుకొండ మాధవి పదవీ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న నారం అరుణ్ కుమార్ రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు బదిలీ కాగా, ఖమ్మం జిల్లా మధిర అదనపు కోర్టు మెజిస్ట్రేట్ గా పనిచేస్తున్న మాధవి మెట్ పల్లి కోర్టుకి బదిలీ పై వచ్చారు. గురువారం వారు పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి పూల మొక్క అందించి వారికి స్వాగత శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, క్రీడా కార్యదర్శి నీరటి రమణ, జూనియర్ ఈసీ మెంబెర్ మాలేపు సంధ్య రాణి, న్యాయవాదులు కోటగిరి వెంకట స్వామి, చైతన్య, సత్యనారాయణ, మన్నె గంగాధర్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

### - వైద్య బృందాన్ని అభినందించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి,ఏప్రిల్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సంక్లిష్టమైన శస్త్రచికిత్సలకు నిలయంగా మారుతూ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందిస్తోంది.ఇటీవల మంథని పట్టణానికి చెందిన ఒక 29 ఏళ్ల యువకుడు రాత్రి వేళ బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టడంతో అతని కుడి చేయి తీవ్రంగా గాయపడి, భారీగా



రక్తస్రావమైంది.ప్రాణాపాయ స్థితిలో ఉన్న సదరు యువకుడు వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్‌కు సమాచారం అందించగా,ఆయన తక్షణమే స్పందించి బాధితుడిని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అత్యవసర పరిస్థితిని గమనించిన సూపరింటెండెంట్, జనరల్ సర్జన్ డాక్టర్ విష్ణు చంద్రికను పిలిపించి వెంటనే శస్త్రచికిత్స ప్రారంభించి రక్తస్రావాన్ని అరికట్టారు.అనంతరం సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ కంది శ్రీనివాస్ రెడ్డి,డాక్టర్ వినయ్ మరియు మత్తు వైద్యురాలు డాక్టర్ భవానిలతో కూడిన బృందం సుమారు 3 గంటల పాటు శ్రమించి అత్యంత నైపుణ్యంతో బాధితుడి కండరాలు,నరాలు మరియు రక్తనాళాలను సరిచేసి విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేశారు.వైద్యుల పర్యవేక్షణలో పూర్తిగా కోలుకున్న యువకుడిని నిన్న ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేశారు.ప్రభుత్వఆసుపత్రిలోఇంతటి క్లిష్టమైన చికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందించారు.

## పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ఘన సన్మానం

మెట్‌పల్లి,రూరల్ ఏప్రిల్ 30:(ప్రజా కలం):మెట్ పల్లి మండలం కోనరావుపేటస్థానిక ZPHS హై స్కూల్ లో పదో తరగతి పరీక్షల్లో 556 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఏనుగందుల వనజను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పాఠశాల ఈ విద్యా సంవత్సరంలో 100



శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల బోధన ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారు గంగారెడ్డి, ఉపసర్పంచ్ జక్కని పరంధాములు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ మారు సాయిరెడ్డి పాల్గొని విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వనజతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిన్న గల్లీలో భారీ వాహనాలు

### - సామాన్యుల ఇబ్బందులు పట్టించుకోని వ్యాపారులు

మెట్‌పల్లి:(కోరుట్ల)ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజా కలం)

జాతీయ రహదారి నుండి పట్టణం లోకి వెళ్ళవలసిన రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలుపుతూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తాజాగా, ప్రధాన రహదారి పక్కనే ఉన్న సర్వీస్ (గల్లి) రోడ్డును కొందరు వ్యాపారులు తమ సొంత ఆస్తిగా భావిస్తూ ట్రాన్స్‌పోర్ట్ లారీలను గంటల తరబడి నిలిపివేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రోడ్డుకు అడ్డంగా లారీని ఆపి సామాన్లు దించుతున్న క్రమంలో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దారి లేక వాహనదారులు నిలిచిపోవడంతో, "రోడ్డుపై లారీ ఆపితే మేము ఎలా వెళ్లాలి?" అని ప్రశ్నించినందుకు సదరు దుకాణ యజమాని అత్యంత దురుసుగా ప్రవర్తించడం గమనార్హం. మా సామాన్లు దిగే వరకు ఆగాలి, లేదంటే వేరే దారి చూసుకో అంటూ ప్రయాణికులపై విరుచుకుపడటంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ట్రాఫిక్ నిబంధనలను తుంగలో




తొక్కి రోడ్లను ఆక్రమిస్తున్న ఇలాంటి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సామాన్యులను ఇబ్బంది పెడుతూ, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్న దుకాణదారుల తీరుపై పోలీసులు మరియు మున్సిపల్ అధికారులు దృష్టి సారించి, ట్రాఫిక్ క్లియర్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అన్నదాతకు అండగా రేవంత్ సర్కార్

### కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు - ప్రభుత్వ విప్ విజయరమణ రావు



పెద్దపల్లి,ఏప్రిల్ 30:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా రైతు పక్షపాతి అని, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి తరుగు లేకుండా మద్దతు ధర కల్పించడమే తమ లక్ష్యమని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు.గురువారం ఎలిగేడు మండలంలోని భుర్హనిమియాపేట, సుల్తాన్పూర్,ముప్పిరితోట, ర్యాకలదేవుపల్లి గ్రామాల్లో సింగిల్ విండో మరియు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన రైతులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విజయరమణ రావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద అష్టకష్టాలు పడ్డారని విమర్శించారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నదాతలకు ఏ చిన్న ఇబ్బంది కలగకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నామని,ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను రైతులు గమనించాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని,అందులో భాగంగానే పెద్దపల్లి నియోజకవర్గంలో ధాన్యానికి గింజ కటింగ్ లేకుండా రైతులకు పూర్తి న్యాయం జరిగేలా తాను నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు,ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మాజీప్రజాప్రతి నిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్సి ఫలితాల్లో ఐపీఎస్
# పాఠశాల విద్యార్థుల అద్భుత ప్రతిభ

### - విద్యార్థుల అభినందించిన చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్,ప్రిన్సిపల్ కృష్ణప్రియ




సుల్తానాబాద్,ఏప్రిల్ 30:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

బుధవారం విడుదలైన ఎస్ఎస్సి ఫలితాల్లో ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్,ప్రిన్సిపల్ కృష్ణప్రియ హర్షం వ్యక్తం చేశారు.మొత్తం 78 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించడం విశేషం.వీరిలో 70 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించడం పాఠశాల ప్రతిష్టను మరింత పెంచింది. విద్యార్థుల్లో ఎ.సహస్ర 580 మార్కులతో ప్రథమ స్థానం,శ్రీవల్లి 578 మార్కులతో ద్వితీయ స్థానం,బ్లేస్సి 576 మార్కులతో తృతీయ స్థానం సాధించి ప్రతిభ చాటారు.ఈ విజయానికి ఉపాధ్యాయుల అంకితభావం,విద్యార్థుల కృషి ప్రధాన కారణమని చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ తెలిపారు.ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ పాఠశాలలో నాణ్యమైన బోధన,క్రమశిక్షణతో కూడిన విద్యా విధానం అమలు చేయడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానం సాధించిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందించారు.విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.అలాగే పాఠశాల విద్యా ప్రమాణాలను మరింత పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్,ఆరీఫ్,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా రూపకల్పనలో బిఎల్ఏ లదే కీలక పాత్ర

### - మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి,ఏప్రిల్ 30:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఓటర్ల జాబితా ఖచ్చితత్వాన్ని పెంపొందించడంలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై గురువారం పెద్దపల్లిలో బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు,డూప్లికేట్ మరియు అనర్హుల పేర్లను తొలగించడం,చిరునామా మార్పులు వంటి బాధ్యతలను బిఎల్ఏలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ శిక్షణలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6,పేర్ల తొలగింపుకు.ఫారం-7, వివరాల సవరణలకు ఫారం-



8 వినియోగించే విధానంపై సమగ్ర అవగాహన కల్పించారు.అలాగే ఓటరు జాబితాలో మార్పులు-చేర్పులు,క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల దాఖలు విధానం,డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగంపై ఏజెంట్లకు శిక్షణ ఇచ్చారు.ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించాలని, ముఖ్యంగా యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు.రాబోయే సర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శకాలను ఈ శిబిరం ద్వారా అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు,మాజీ మండల అధ్యక్షులు,పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు,బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన పార్టీకి ఈసీ ఆమోదం

### - బండారి శ్రీనివాస్ గౌడ్ హర్షం

పెద్దపల్లి,ఏప్రిల్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)తెలంగాణ రక్షణ సేన పార్టీగా రూపాంతరం చెందడంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలపడం పట్ల పార్టీ నాయకులు బండారి శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.ఏప్రిల్ 25న కల్వకుంట్ల కవిత ప్రారంభించిన ఈ పార్టీకి తక్షణమే గుర్తింపు లభించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ,ఇది తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపు అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బండారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ



రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న రైతుల ఇబ్బందులు,నిరుద్యోగ సమస్య,సామాజిక అసమానతలు మరియు సంక్షేమ పథకాల్లోని లోపాలపై టిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.ముఖ్యంగా రైతు సంక్షేమం,యువతకు ఉపాధి కల్పన మరియు సామాజిక న్యాయమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని వెల్లడించారు.కవిత నాయకత్వంలో ప్రజల ఆశయాలను నెరవేరుస్తూ,రాష్ట్ర అభివృద్ధి కోసం బలమైన ఉద్యమాన్ని కొనసాగిస్తామని,ప్రజల హక్కుల పరిరక్షణే తమ ప్రథమ ప్రాధాన్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల
# అవగాహన సదస్సు

### - సదస్సు నిర్వహించిన పొలాస పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ స్పందన బట్

### - యూరియా వాడకం, పంటల మార్పిడి, ప్రకృతి వ్యవసాయం, పచ్చి రొట్టె పంటల సాగు, నేల ఆరోగ్యం



ఎండపల్లి, ఏప్రిల్ 30 : (ప్రజాకలం ప్రతినిధి) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గొడిశెలపేట గ్రామ రైతు వేదిక లో రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు కార్యక్రమాన్ని గొడిశెలపేట రైతు వేదిక ఎండపల్లి మండలం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ స్పందన బట్ మాట్లాడుతూ తక్కువ యూరియా వాడకం, పంటల మార్పిడి, ప్రకృతి వ్యవ సాయం, పచ్చిరొట్ట పంటల సాగు, నేల ఆరోగ్యం, అలాగే వరి పంట కోసిన తర్వాత పంట అవశేషాలు కాల్చకుండా నేలలో కలియ దున్నటం వంటి వివిధ అంశాల పై రైతులకు అవగాహన కల్పించటం జరిగింది. శాస్త్రవేత్త డాక్టర్ సుమలత వివిద పంటల లో చీడపీడల నివారణ, రసాయన మందులు ఎలా వాడాలో తెలియచేశారు. అలాగే మండల వ్యవసాయధికారి కమల్ల మహేష్ మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్న వరి రకాల అయిన బీపీటీ 5204, ఆర్ ఎన్ ఆర్ 15048, కే ఎన్ ఎం 1638, జేజిఎల్ 1798 జై శ్రీరామ్, హెచ్ఎంటి వంగడాలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఉద్యానవన అధికారి అర్చన, వ్యవసాయ విస్తరణ అధికారి బలిజపెల్లి సందీప్, ఉద్యానవన విస్తరణ అధికారి వంశీ, అభిగ్న (టీచింగ్ అసోసియేట్), గోడిశెలపేట గ్రామ సర్పంచ్ కందికట్ల అమృత-రాజేశం, సానబండ సర్పంచ్, గాధం భాస్కర్, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - జిల్లా యువజన అధికారి గోలి తిరుపతి రెడ్డి

పెద్దపల్లి,ఏప్రిల్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

నిరుద్యోగ యువతకు ప్రముఖ కార్పొరేట్ కంపెనీలలో శిక్షణతో పాటు ఆర్థిక భరోసా కల్పించేందుకు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం-2026 ను యువత సద్వినియోగం చేసుకోవాలని మేరా యువ భారత్ కరీంనగర్ జిల్లా యువజన అధికారి గోలి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, ప్రస్తుతం ఎటువంటి చదువు లేదా ఉద్యోగం చేయని యువత ఈ పథకానికి అర్హులని ఆయన పేర్కొన్నారు. 10వ తరగతి,ఇంటర్,ఐటిఐ, డిప్లొమా,గ్రాడ్యుయేషన్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ఈ పథకం కింద ఎంపికైన వారికి 6 నుండి 9 నెలల పాటు శిక్షణ ఉంటుందని, వారికి నెలకు రూ. 9వేల స్టైపెండ్‌తో పాటు,ప్రారంభంలో ఒకేసారి రూ. 6వేల జాయినింగ్ గ్రాంట్‌ను ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు.శిక్షణ ద్వారా యువతకు వాస్తవ వ్యాపార వాతావరణంపై అవగాహన పెరుగుతుందని,ఇది వారి భవిష్యత్తు ఉపాధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు మేరా యువ భారత్ అధికారిక పోర్టల్ (హ్ట్జూం:// ఎఎఎస్త్రుతీఫ్.స్త్రశీజ.ఐఅ/) ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు సమయంలో అభ్యర్థులు తమకు నచ్చిన రంగం మరియు ప్రాంతాన్ని ఉదాహరణకు పెద్దపల్లి జిల్లా ఎంచుకునే అవకాశం ఉందని,అర్హులైన పెద్దపల్లి జిల్లా యువత అందరూ ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



ప్రజా కలం
శుక్రవారం, మే 1, 2026

# బ్యాలెట్ బాక్సుల్లో భవితవ్యం

ప్రజాస్వామ్య భారత్‌లో ఎన్నికలు అంటే కేవలం ఓట్లు వేయడం మాత్రమే కాదు. ఆ ఓటు ఫలితం ఏంటో తెలుసుకోవాలని ఉత్సుకత ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే ప్రజల నాడిని పట్టుకోవాలని ప్రయత్నించే చర్య సర్వేలు. ప్రస్తుతం 2026లో ఐదు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ కూడా వచ్చాయి. అయితే ఈ సర్వేలు ఎలా చేస్తారు. వీటికి ఉండే చట్టబద్ధత ఏంటీ అనే విషయాలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒపీనియర్ పోల్ లేదా అభిప్రాయ సేకరణ అనేది ఎన్నికలు ప్రారంభంకావడానికి ముందే నిర్వహించే సర్వే. నామినేషన్ల ప్రక్రియకు ముందు లేదా ప్రచారం జరుగుతున్న సమయంలో వీటిని చేపడతారు. ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు, వారి ప్రధాన సమస్యలు ఏంటీ, ప్రచార పద్ధతులు ఓటర్లను ఎంత వరకు ప్రభావితం చేస్తున్నాయి అనేది తెలుసుకోవడానికి సర్వేలు చేస్తారు. శాంపిల్ సైజ్ నుంచి సమాచారాన్ని సేకరిస్తారు. ఎన్నికల ప్రచారం సాగుతున్న కొద్దీ ప్రజల అభిప్రాయాలు మారే ఛాన్స్ ఉంది. అందుకే ఒపీనియన్ పోల్ ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎగ్జిట్ పోల్ అనేది ఓటు వేసిన తర్వాత బయటకు వచ్చిన ఓటరు అభిప్రాయాన్ని నేరుగా సేకరించే ప్రక్రియ. ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే పోలింగ్ కేంద్రం వెలుపల ఈ సర్వే చేస్తారు. సర్వే చేసే వ్యక్తులు పోలింగ్ బూత్ బయట వేచి ఉండి, ఓటు వేసి వస్తున్న వారిని మీరు ఎవరికి ఓటు వేశారు అని అడిగి తెలుసుకుంటారు. ఓటరు తన నిర్ణయాన్ని అమలు చేసిన తర్వాత చెప్పే మాటలు కాబట్టి ఇవి ఒపీనియన్ పోల్స్ కంటే కాస్త కచ్చితత్వానికి దగ్గరగా ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమే. అధికారిక ఫలితాలు కావు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగడానికి కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని రూల్స్ ఫ్రేమ్ చేసింది. ముఖ్యంగా ఎగ్జిట్ పోల్స్ ప్రసారంపై ఆంక్షలు విధించింది. ఎన్నికలు ఒకటి కంటే ఎక్కువ దశల్లో జరుగుతున్నప్పుడు అన్ని దశల పోలింగ్ పూర్తి అయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించకూడదు. ఇవాళ కూడా దీన్ని అమలు చేసింది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై ఆరు గంటలకు ముగిసింది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఆరున్న తర్వాత వెల్లడించారు. ఈ రూల్స్ అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ ఉంటాయి. మీడియా సంస్థలు, పరిశోధన ఏజెన్సీలు, పోలింగ్ సంస్థలు వివిధ పద్ధతుల ద్వారా డేటాను సేకరిస్తాయి. క్షేత్రస్థాయిలో ఓటర్లతో మాట్లాడటం ద్వారా, టెలిఫోన్ ద్వారా ఓటర్ల అభిప్రాయం తెలుసుకుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో టీంలను పంపించి సమాచారాన్ని సేకరిస్తారు. మరో వైపు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు అన్ని సర్వేలు డీఎంకే కూటమిదే మళ్లీ అధికారమని అంచనా వేశాయి. కానీ, ఒక్క సంస్థ మాత్రం దళపతి విజయ్ పార్టీ టీవీకే మెజార్టీ స్థానాల్లో గెలిచి, అధికారం చేపడుతుందని తెలిపింది. యాక్సిస్ మై ఇండియా సర్వే విజయ్ పార్టీ సునామీ తథ్యమని జోస్యం చెప్పింది. ఆ సంస్థ అంచనా ప్రకారం టీవీకే 98 నుంచి 120 స్థానాలు, డీఎంకే కూటమి 92 నుంచి 110, అన్నాడీఎంకే కూటమి 22 నుంచి 30 సీట్లలో గెలుస్తుందని పేర్కొంది. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడులో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలు. ఆ సర్వే అంచనా నిజమైతే విజయ్ ముఖ్యమంత్రి అవుతారు. అయితే, తుది ఫలితాలు అంచనాలకు దగ్గరగా ఉంటాయా? లేదా? అనేది మే 4న తేలిపోనుంది. అంతేకాదు, అంచనాలు తారుమారై డీఎంకే కూటమి మెజార్టీ మార్క్‌కు దగ్గరగా ఆగిపోతే విజయ్ మద్దతు కీలకమవుతుంది. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.అయితే, గతంలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో యాక్సిస్ మై ఇండియా సర్వేలు నిజమయ్యాయి. గతంలో ఐదు సందర్భాల్లో మిగతా సంస్థలకు భిన్నంగా దీని అంచనాలు, ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి 359 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఈ అంచనాలకు అనుగుణంగా ఫలితాలు వచ్చాయి. 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, గతేడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలోనూ ఖచ్చితంగా అంచనా వేసింది. మధ్యప్రదేశ్‌లో అన్ని సర్వేలూ కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే.. యాక్సిస్ మై ఇండియా మాత్రం 140- 162 సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. అన్నట్టుగానే బీజేపీ 163 సీట్లతో మళ్లీ అధికారం నిలబెట్టుకుంది.ఎగ్జిట్ పోల్స్ ఎప్పుడూ ఓట్ల లెక్కింపు రోజున వాస్తవ ఫలితాలుగా మారనప్పటికీ, అవి ప్రజా చర్చను ప్రభావితం చేస్తూ, తుది తీర్పుపై ఉత్కంఠను పెంచుతాయి. ఇక బెంగాల్ విషయానికి వస్తే పీపుల్స్ పల్స్ సర్వే టీఎంసీకి 177 నుంచి 187, బీజేపీకి 95-110 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. మ్యాట్రిజ్ సర్వే టీఎంసీ 125 నుంచి 140, బీజేపీ 146-161 చోట్ల విజయం సాధిస్తుందని పేర్కొంది. అయితే, పీ-మార్క్ సర్వే మాత్రం టీఎంసీ 118-138, బీజేపీ 150-175 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. చాణక్య స్ట్రాటజీస్ కూడా బీజేపీకి ఛాన్స్ ఉందని వెల్లడించింది. బీజేపీకి 150-160 స్థానాలు, తృణమూల్ కాంగ్రెస్‌కు 130-140 స్థానాలు వచ్చే ఛాన్స్ ఉందని తెలిపింది. పోల్ డెయిరీ కూడా కమలం వికసిస్తుందని అంచనా వేసింది. టీఎంసీకి 99 నుంచి 127, బీజేపీకి 142 నుంచి 171, కాంగ్రెస్ 3 నుంచి 5 స్థానాల్లో విజయం సాధిస్తాయని చెప్పింది. జన్మత్ 195 నుంచి 205 స్థానాలు టీఎంసీకి, 80 నుంచి 90 స్థానాలు బీజేపీకి వస్తాయని అంచనా వేసింది. అలాగే, ఎన్డీటీవీ అంచనాలు కూడా టీఎంసీ 146, బీజేపీ 140, ఇతరులు 6 చోట్ల విజయం సాధించే అవకాశం ఉన్నాయని తెలిపాయి.మరి ఈసారి కూడా ఈ సంస్థ అంచనాలు నిజమవుతాయా? అనేది మే 4న తెలుస్తుంది. తమిళనాడు ఎన్నికల్లో తొలిసారి పోటీచేసిన విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. ఈ సర్వే అంచనా వేసినట్టు ఫలితాలు ఉంటే.. విజయ్ చరిత్రను తిరగరాయనున్నారు.ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్న సంస్థలు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఓటింగ్ సరళిని అంచనా వేయడానికి ఈ పద్ధతులను అనుసరించాయి. ఎగ్జిట్ పోల్స్ అనేవి కేవలం సంకేతాలు మాత్రమే ఇవి ఎప్పుడూ కచ్చితంగా ఉంటాయని చెప్పలేం. అనేక సందర్భాల్లో ఎగ్జిట్‌పోల్ అంచనాలు లెక్క తప్పుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో ఒకటిరెండు మినహా మిగతా సర్వే సంస్థల లెక్కలు తప్పాయి.






## హనియ ను సన్మానించిన పాషా...

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజా కలం) రెండు రోజుల క్రితం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 550 మార్కులు సాధించిన పట్టణానికి చెందిన వివేకానంద హైస్కూల్ విద్యార్థిని, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజీమ్ కూతురు హనియ హోరిన్ ను కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముజీబ్, రహిమోద్దీన్, షారు, మజార్, అనష్, అబూజర్ తదితరులు పాల్గొన్నారు.



## మొక్కజొన్న పంటలను మార్క్ పెడ్ ద్వారా కొనుగోలు చేయాలని తహసిల్దార్ కు వినతి



ఎండపల్లి, ఏప్రిల్ 30 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండల కేంద్రం లో బీజేపి మండల పార్టీ ఆధ్వర్యం లో ఎండపల్లి మండల తహసిల్దార్ ఎడ్ల అనిల్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు.

మండల పార్టీ అధ్యక్షులు రావు హనుమంత రావు మాట్లాడుతూ మార్క్ పేడ్ ద్వారా కొనుగోలు చేసే ధర మొక్కజొన్న పంట క్వింటాల్ కు 2400 రూపాయలు ఉండగా రైతులకు దళారులు ఇచ్చే మొక్కజొన్న క్వింటాల్ కు ధర 1700 రూపాయల చొప్పున రైతులకు ఇవ్వడంతో రైతులు దాదాపు 700 రూపాయలు రైతులు నష్టపోతున్నారని అలాగే ఎండపల్లి నుండి గొల్లపెల్లి కి ట్రాక్టర్ కిరాయి 3000 రూపాయలు ఉందని అలాగే ఎండపల్లి నుండి వెల్గటూర్ ట్రాక్టర్ కిరాయి ధర 2500 రూపాయలు ఉంటుందని అలాగే ఎండపల్లి నుండి ధర్మారం మార్కెట్ వరకు ట్రాక్టర్ కిరాయి 1000 రూపాయ లు ఉంటుందని జిల్లా చేంజ్ కావడంతో జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఎండపల్లికి ధర్మారం అందుబాటులో ఉంటుంది కాబట్టి ట్రాక్టర్లకి రాయి తక్కువగా ఉంటుందని రైతులు నష్టపో కుండా ఉంటారని రావు హనుమంత రావు వినతి పత్రం లో తెలియజేశారు ఈ కార్యక్రమం లో ఎండపల్లి మండల బీజేపి పార్టీ అధ్యక్షులు రావు హనుమంత రావు, నాయకులు తిరుమల ప్రమోద్, వెనేంక మహేందర్, సబ్బు సంతోష్, ఏలేటి భాస్కర్ రెడ్డి, దుర్గం రమేష్, దాసరి మల్లేష్, మామిడిపల్లి రమేష్, బోగా సురేష్, పార్వతి మధు పాల్గొన్నట్లు బీజేపి మండల పార్టీ అధ్యక్షులు రావు హనుమంత రావు తెలిపారు.

## క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి

గొల్లపల్లి ఏప్రిల్ 30 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండలంలోని భీంరాజుపల్లి గ్రామంలో భీం రాజుపల్లి క్రికెట్ టోర్నమెంట్ గురువారం బి.బి. కే ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి ఎస్సై మాట్లాడుతూ, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. యువత తప్పుడు మార్గాల్లో, చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని ఇలాంటి క్రీడా మైదానాల్లో గడిపే సమయం మిమ్మల్ని ఆరోగ్యవంతులుగా, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తీర్చిదిద్దుతుందనీ అన్నారు.చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని సూచించారు. తొలి మ్యాచ్‌లో లక్ష్మీపూర్, దమ్మన్నపేట జట్లు తలపడ్డాయి. ఫైనల్ గెలుపొందిన టీమ్ కు విన్నర్ ప్రైజ్ 10,016/- సర్పంచ్ కొలగాని శ్రీలత గంగ చారి రన్నర్ ప్రైజ్ 5,116/- , బి.బి.కె ఫౌండేషన్ కుమార్ లు అందజేయనున్నారు
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొలగాని శ్రీలత, బి బి కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మన కుమార్, సర్పంచ్ లు దాసరి తిరుపతి గౌడ్, కాసం రాజశేఖర్, ఉప సర్పంచ్ బొమ్మెన రాజమ్మ,లావణ్య తిరుపతి, మహేష్,వార్డు సభ్యులు దీవెన,బాబు, రేవల్లే కొమురయ్య, రెవెల్ల సాగర్, తిరుపతి రెడ్డి,నాయకులు సింగారపు లచ్చయ్య, మహేష్, జనార్ధన్ క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి నూతన సీఐ సురేష్‌బాబుకు సన్మానం




మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 30(ప్రజా కలం) సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సురేశ్ బాబును జగిత్యాల జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎశమేని గణేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా ఏఐటీయూసీ నాయకుడు ఎండి ఉస్మాన్‌తో పాటు హమాలి సంఘం నాయకులు కాశీపాక శంకర్, జి సంతోష్, పెయింటింగ్ సంఘం ఉపాధ్యక్షులు కాతా వినయ్, ఓడల రాకేష్‌లు పాల్గొన్నారు.నూతన బాధ్యతలు స్వీకరించిన సీఐ సురేష్‌బాబు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో విజయవంతం కావాలని నాయకులు ఆకాంక్షించారు.

## సూరారం గ్రామంలో వడదెబ్బతో వ్యక్తి మృతి

### - పంచనామ నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ హసుపత్రికి తరలింపు

ఎండపల్లి, ఏప్రిల్ 30 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం సూరారం గ్రామం లో వడదెబ్బతో వ్యక్తి మృతి సూరారం గ్రామానికి చెందిన జాడీ లచ్చయ్య తండ్రి బుచ్చయ్య వయస్సు 62 సంవత్సరాలు మాదిగ కులం అను ఆతడు తేదీ 29.4.2026 బుధవారం రోజున వ్యవసాయ పనుల నిమిత్తం తమ పొలానికి వెళ్ళి పంట కోయిస్తుండగా వడదెబ్బ తగిలి స్పృహ తప్పి క్రింద పడిపోగా అది గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ఇంటికి తీసుకపోయి చికిస్తా నిమిత్తం తరలించడానికి 108 అంబులెన్స్ కి ఫోన్ చేయగా అంబులెన్స్ సిబ్బంది వచ్చి అతన్ని పరీక్షించ గా అప్పటికే మరణించినట్లు 108 వైద్యులు చెప్పినారు. మృతుడు వడదెబ్బ తగిలి మరణించినడాని అతని భార్య జాడీ రాజమ్మ ఇచ్చిన ఫిర్యాధు మేరకు వెల్గటూర్ పోలీస్ వారు కేసు నమోదు చేసి, పంచనామా నిర్వహించినారు. ఆ తర్వాత మృతుడి శవ కు పోస్ట్ మార్టం నిమ్మితం ప్రభుత్వ ఆసుపత్రి, జగిత్యాల కు తంలించి తద నంతరం మృతుడి అంత్యక్రియల నిమిత్తం మృతుడి శవంను బంధువులకు అప్పజేప్పినట్లు వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ తెలిపారు.



## జిల్లాలో 10 వేల ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశానికి సిద్ధం చేయాలి

### వేగంగా ఇళ్ల నిర్మాణ పనులు జరిగేలా చర్యలు చేపట్టాలి

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ఖమ్మం, ఏప్రిల్ 30(ప్రజా కలం న్యూస్ )

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, పూర్తయిన ఇండ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని ప్రజ్ఞ మిటింగ్ హాల్ నందు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీజ తో కలిసి హౌజింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 10 వేల ఇండ్లు గృహప్రవేశాలకు లక్ష్యంగా కార్యాచరణ చేసినట్లు తెలిపారు. అధికారులు లబ్ధిదారులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందించి, లక్ష్యసాధనకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 9199 ఇందిరమ్మ ఇండ్లు స్లాబ్ లు వేసినట్లు, 2018 ఫీనిషింగ్ పూర్తయినట్లు కలెక్టర్ అన్నారు. జిల్లాలో మొదటి విడతగా 16497 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ అన్నారు. 2520 ఇండ్ల నిర్మాణాలు పూర్తయి, గృహ ప్రవేశాలు జరగగా, మిగతా ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులకు కావాల్సిన అన్ని సహాయ సహకారాలు అందించాలని, క్షేత్ర అధికారులు




క్రియాశీలకంగా ఉంటూ, పనుల్లో రోజువారీ ప్రగతి ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు నిరంతర సమీక్షలు చేస్తూ, పనుల పురోగతిపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం తీసుకుందని, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అన్ని మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు స్లాబ్ దశలో ఉన్న ఇళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష లో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లాలోని హౌజింగ్ ఇంజనీర్లు, హౌసింగ్ ఏఈ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో కోరుట్ల మైనారిటీ గురుకులం వందశాతం ఉత్తీర్ణత

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజా కలం) తెలంగాణ రాష్ట్ర పదవ తరగతి ఫలితాలు-2026లో కోరుట్ల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాయ్స్-1) విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ సంవత్సరం పరీక్షలకు హాజరైన విద్యార్థులందరూ వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాల కీర్తిని చాటినట్లు ప్రిన్సిపాల్ జె. రాములు తెలిపారు. పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో టాప్ గ్రేడ్ సాధించగా, మరికొందరు డిస్టింక్షన్, ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థుల కష్టం, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్య, హాస్టల్ సదుపాయాలు, డిజిటల్ తరగతులు విద్యార్థుల ప్రగతికి తోడ్పడ్డాయని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులను కోఆర్డినేటర్ షరీన్ ఫాతిమా, ఉపాధ్యాయుడు ఖాజా మొహియుద్దీన్ తదితరులు అభినందించారు. టాపర్లను త్వరలో పాఠశాలలో ప్రత్యేకంగా సత్కరించనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది.
టాప్ అచీవర్స్ జాబితా: అఖిల్ - 563/600, విగ్నేష్ - 539/600, షార్యానందన్ - 535/600. ఉమేష్ - 522/600, అభిరాం - 518/600 ఆర్యన్ - 517/600. హర్షిత్ -515/600 భువనేశ్ - 505/600



## మండల పరిధిలో పెట్రోలు బంకులను తనిఖీ చేసిన కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్



మల్హర్ ఏప్రిల్ 29 ప్రజాకలం ప్రతినిధి కోయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి పెట్రోల్ బంకులను చెక్ చేసి, పెట్రోల్ బంక్ యజమానులను కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్ హెచ్చరించడం జరిగింది, ఎవరైనా డీజిల్ గాని పెట్రోల్ కానీ స్టాక్ ఉంచుకొని స్టాక్ లేదని బోర్డు పెట్టి కృత్రిమ ఇంధనం కొరతను సృష్టిస్తే వారిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి, బంకును సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఇప్పుడు మండలంలో ఇప్పుడు ఎలాంటి పెట్రోలు, డీజిల్, గ్యాస్ కొరత లేదని ప్రజలు ఎలాంటి గందరగోళానికి గురికావాల్సిన అవసరం లేదని ఎస్ఐ తెలిపారు.

## సూపరింటెండెంట్ గంటి శ్రీరామ్మూర్తి పదవీ విరమణ

### పాల్గొన్న సర్పంచులు కొండ రాజమ్మ, జంగిడి శ్రీనివాస్



మల్హర్, ఏప్రిల్ 30 ప్రజాకలం ప్రతినిధి : మల్హర్ రావు మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ గంటి శ్రీరామ్మూర్తి పదవీ విరమణ మహోత్సవం గురువారం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్, కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ, పెద్దతూండ్ల సర్పంచ్ బండారి నర్సింగం పాల్గొని శ్రీరామ్మూర్తి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. శ్రీరామ్మూర్తి తన పదవీ కాలంలో మండలాభివృద్ధికి ఎంతో అంకితభావంతో పనిచేశారని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆయనకు వీడ్కోలు పలుకుతూ శేష జీవితం సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పలు కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్



( వరంగల్/ పర్వతగిరి) ఏప్రిల్ 30, ప్రజాకలం ప్రతినిధి.

వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండల మాజీ జెడ్పీటీసీ లునావత్ పంతులు తండ్రి ధన్ సింగ్ ఇటీవల మరణించగా గురువారం వారి నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి నివాళులర్పించి, అనంతరం కల్లెడ గ్రామానికి చెందిన అదొండ మల్లేష్ తండ్రి రాములు దశ దినకర్మ కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, ఫ్యాక్స్ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్, సర్పంచులు ఏర్పుల శ్రీనివాస్, చిన్నపాక శ్రీనివాస్, మాజీ సర్పంచులు భానోత్ వెంకన్న, లూనావత్ గణేష్ నాయక్, వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ డైరెక్టర్లు పట్టాపురం పట్టాపురం ఏకాంతం గౌడ్, జితేందర్ రెడ్డి, బోయినపల్లి యుగేందర్, మైనారిటీ అధ్యక్షుడు షబ్బీర్, బిఆర్ఎస్ నాయకులు బొట్ల మధు, వార్డు సభ్యులు, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో ఎడ్లపల్లి మోడల్ స్కూల్ ప్రభంజనం

### - టాపర్లను సన్మానించిన సర్పంచ్ జంగిడి శ్రీనివాస్

మల్హర్, ఏప్రిల్ 30 ప్రజాకలం ప్రతినిధి ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మల్హర్ మండలం ఎడ్లపల్లి పిఎంశ్రీ మోడల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. 536 మార్కులతో బి. మనస్వి స్కూల్ టాపర్‌గా నిలవగా, ఏ. నిషిత (535), బి. నిఖిల్ (526) తర్వాతి స్థానాల్లో నిలిచి పాఠశాల పేరును నిలబెట్టారు. 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం పాఠశాల ఆవరణలో సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించడం గర్వకారణమని కొనియాడారు. ప్రిన్సిపాల్ పూర్ణచందర్ మాట్లాడుతూ విద్యార్థుల కఠోర శ్రమ, ఉపాధ్యాయుల ప్రత్యేక కృషితోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## కాల్వొడ్డు తీగలవంతెన నిర్మాణ పనులు

# వేగవంతంగా విస్తరించాలి

### - జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

- మున్నేరు రిటైనింగ్ వాల్ ఇరువైపులా నిర్మాణం సకాలంలో నాణ్యతతో పనులు జరగాలి
- మున్నేరు భూ నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఔట్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- మున్నేరు కేబుల్ బ్రిడ్జ్, రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి, భూ నిర్వాసితులకు కేటాయించే వెంచర్ అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, ఏప్రిల్ 30(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం నగరంలోని మున్నేరు నది పై చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయడం పట్ల అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు. గురువారం ఖమ్మం కేంద్రంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, కాల్వొడ్డు తీగల వంతెన పనులు, మున్నేరు భూ నిర్వసితుల కోసం ఏర్పాటు చేస్తున్న లేఔట్ వెంచర్ పురోగతి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్నేరు నది పై ఉన్న రాజీవ్ గృహకల్ప, రంగనాయక గుట్ట, ప్రకాష్ నగర్ చెక్ డ్యాం లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ, నిపుణుల కమిటీ చేసిన డిజైన్ ల ప్రకారం మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం పక్కాగా జరగాలని, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద సేకరించిన భూములను అభివృద్ధి చేసి మున్నేరు నది రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించేలా రైతులతో చర్చలు జరపాలని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి స్థాయిలో నిర్మించాలని, రెండు వైపుల నుంచి ప్రణాళికాబద్ధంగా పనులు జరగాలని అన్నారు. బైపాస్ నుంచి తీగల వంతెన వరకు మున్నేరు రిటైనింగ్ వాల్ ఎడమ, కుడి వైపుల పనులు పూర్తవ్వాలని, చిన్న, చిన్న గ్యాప్ లు కూడా ఉండకూడదని స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రాధాన్యతతో పూర్తి చేయాలని, .మున్నేరు నదీ



రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ నిమిత్తం రైతులకు, నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఔట్ వెంచర్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, వెంచర్ కు ప్రధాన రహదారి, అంతర్గత రోడ్డు, నగరంకు సులుభతరం చేసే విధమంగా ఓవర్ నిర్మాణం, ప్రత్యేకంగా కల్పించే వసతులతో ప్రత్యేక వెంచర్ తో భూ విలువ పెరిగి చుట్టు ప్రక్కల విస్తృతంగా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఖమ్మం నగరంలో మున్నేరు పై నిర్మించే కేబుల్ బ్రిడ్జి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, నిర్ణీత గడుపులోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే నిర్మాణపనులు వేగంగా విస్తరించాలని అన్నారు. తీగలవంతెన నిర్మాణం వల్ల ఎవరు కూడా నష్ట పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్‌డబీ ఎస్ఇ యాకుబ్, ఇరిగేషన్ డిఇ రమేష్ రెడ్డి, మిషన్ భగీరథ అధికారులు వాణి, పుష్పలత, ఆర్డీఓ శ్రీనివాస్, ఖమ్మం అర్బన్, రూరల్ మండల తహసీల్దార్లు జయచందర్, వినయేందర్ రెడ్డి, టి.ఎన్.ఓ.ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్

# వినోద్ రావుకు ఘన సన్మానం

నిర్మల్, ఏప్రిల్ 30(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): నిర్మల్ జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న వినోద్ రావు పదవీకాలం నేటితో ముగిసింది, ఈ సందర్భంగా జిల్లా పోలీసులు, న్యాయవాదులు కలిసి ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు,ఈ కార్యక్రమంలో పోలీసులు వినోద్ రావు కి శాలువాకప్పి,పుష్పగుచ్ఛాలు అందజేసిఆయన సేవలను ప్రశంసించారు, న్యాయ రంగంలో ఆయన చేసిన సేవలు ఆదర్శప్రాయమని పలువురు అభిప్రాయపడ్డారు,వినోద్ రావు తన పదవీకాలంలో న్యాయపరమైన విధులను క్రమశిక్షణతో నిర్వహించి, అనేక కేసుల్లో న్యాయం సాధించడంలో కీలక పాత్ర పోషించినట్లు అధికారులు తెలిపారు, ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



# తహసిల్దార్ కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలి



### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ ఏప్రిల్ 30 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) తహసిల్దార్ కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం పట్టణంలోని, అర్బన్ తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయానికి సంబంధించిన అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రతీ రిజిస్టరు, రికార్డును పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు ఆయా పౌర సేవల ధ్రువీకరణ పత్రాలకు చేసుకున్న దరఖాస్తులు వెంట వెంటనే మంజూరు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ పౌర సేవల ధ్రువీకరణ పత్రాల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులంతా ప్రతి రోజు కేంద్ర కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, తహసిల్దార్ రాజు, కార్యాలయ అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## తానూర్ జూనియర్ కళాశాల జూనియర్ అసిస్టెంట్‌గా బి. రమేష్

తానూర్, ఏప్రిల్ 30 (ప్రజా కలం):
నిర్మల్ జిల్లా తానూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన జూనియర్ అసిస్టెంట్‌గా బి. రమేష్ నియమితులయ్యారు, ఇప్పటి వరకు మామడ మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన, ఇటీవల జరిగిన పదోన్నతుల ప్రక్రియలో జూనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందారు,సోమవారం నిర్వహించిన కౌన్సిలింగ్‌లో రమేష్ స్వచ్ఛందంగా తానూర్ కళాశాలను ఎంచుకున్నారు, ఈ సందర్భంగా మామడ నుండి బదిలీపై వచ్చిన ఆయనకు తానూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె. రవికిరణ్, అధ్యాపక బృందం మరియు కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



## నేలకొండపల్లి పైనంపల్లిలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ..

### - మచ్చ నాగరాజు దంపతుల ఆధ్వర్యంలో!



పాలేరు ఏప్రిల్ 30(ప్రజా కలం న్యూస్ ) నేలకొండపల్లి మండలం పరిధిలోనే గురువారం పైనంపల్లి గ్రామంలో ఒకటో తరగతి నుండి ఐదవ తరగతి వరకు గల విద్యార్థినీ, విద్యార్థులకు సూర్యాపేట జిల్లా గరిడేపల్లి కి చెందిన మచ్చ నాగరాజు, గాయత్రి ల ఐదవ వివాహ వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులకు సమ్మర్ వేకేషన్ క్లాసులకు ఉపయోగపడే విదంగా వారి ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, షార్పనర్స్, ఎరైసర్ లు పంపిణీ చేసారు. నాగరాజు హైదరాబాద్ లోని డీపెన్ ఏఐ సాఫ్ట్వేర్ కంపెనీ లో సాఫ్ట్వేర్ ఉద్యోగి గా పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మచ్చ నాగరాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే "ఉజ్వల భవిష్యత్" ఉంటుందని చదువుతో విద్యార్థులు ఎల్లలు దాటవచ్చని చిన్నవయసు నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని తెలియజేసారు. ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుక్కల నరేష్, బీజేపీ మండల నాయకులు సూరేపల్లి జ్ఞానరత్నం, ది రిహాబిలిటేషన్ ఆఫ్ గౌతమ్ బుద్ధ చక్రవర్తి సొసైటీ ఫౌండర్ అండ్ చైర్మన్ కట్టెకోల వెంకటేశ్వరరావు గౌడ్, ఉత్తమ విద్యాసేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు, బొడ్డు ఉషా, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి చొరవతో ముష్టికుంట్ల వాసికి రూ. 2.25 లక్షల ఎల్ఓసీ మంజూరు

### క్యాంప్ కార్యాలయంలో అందజేసిన కాంగ్రెస్ నాయకులు



ఖమ్మం ఏప్రిల్ 30(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం నగరంలోనే గురువారం ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి.. ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్ ) ద్వారా అండగా నిలిచారు. బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన ఖాసీం సాహెబ్ భార్య షేక్.అమీరున్ దీర్ఘకాలిక కీళ్ళ వ్యాధితో బాధపడుతూ.. మెరుగైన వైద్యం కోసం సాయం చేయాల్సిందిగా ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డిని గతంలో కలిసి విన్నవించుకుంది. వెంటనే స్పందించిన ఎంపీ సిఫారసు చేయగా.. నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్ )లో మెరుగైన చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ ( ఎల్ ఓ సి ) ద్వారా రూ. 2,25,000 మంజూరయ్యాయి. ఈ మంజూరు పత్రాన్ని గురువారం ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ధరావత్ రామ్మూర్తి నాయక్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, మచ్చా రామారావు, సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ బోనకల్ మండల నాయకులు బోయినపల్లి మురళి తదితరులు అందజేశారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి ప్రత్యేక చొరవ తీసుకున్న ఎంపీ రఘురాం రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పాలేరు మాజీ ఎమ్మెల్యేకందాల ఉపేందర్ రెడ్డి



పాలేరు ఏప్రిల్ 30(ప్రజా కలం న్యూస్ )

కూసుమంచి మండలం పరిధిలోని గురువారం కిష్టాపురం గ్రామం చిన్నం నాగలక్ష్మి– శ్రీనివాసరావు,కుమారుడు ఉదయ్ – ప్రవళిక ను అక్షింతలు వేసి ఆశీర్వదించిన పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి.

ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు, గ్రామస్తులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

## జీళ్లచెరువులో మొక్కజొన్న పంట అవశేషాల తగలబెట్టడానికి హెచ్చరిక: ఏవో రామడుగు వాణి

పాలేరు ఏప్రిల్ 30(ప్రజా కలం న్యూస్ )కూసుమంచి మండలం పరిధిలోనే గురువారం జీళ్లచెరువు గ్రామంలో మొక్కజొన్న పంట అవశేషాలను తగలబెడుతున్న క్షేత్రాలను సందర్శించిన అధికారులు రైతులకు పంట అవశేషాల తగలబెట్టడం వలన



కలిగే అనర్థాలను వివరించారు.పంట అవశేషాలు భూమిలో కలియకూడదని, తగలబెట్టడం వల్ల భూమిలోని మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని, భూసారం దెబ్బతింటుందని వారు తెలిపారు. అంతేకాకుండా, ఇది వాయు కాలుష్యం, పర్యావరణ కాలుష్యానికి కారణమవుతుందని హెచ్చరించారు. రైతులు పంట అవశేషాలను భూమిలో కలిపి వేసుకోవడం ద్వారా మట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు.

# వాటర్ బాటిల్సే దిక్కు..

## - దాహాన్ని దోపిడీగా మార్చుకుంటున్న వ్యాపారులు



నల్గొండ : హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, చిన్నచిన్న దుకాణాలు ఎన్నో కుటుంబాల జీవనోపాధికి ఆధారంగా నిలుస్తున్నాయి. అయితే ఇదే అవకాశాన్ని కొంతమంది వ్యాపారులు దుర్వినియోగం చేస్తూ ప్రయాణికులను బలవంతపు దోపిడీకి గురిచేస్తున్నారు. పలుచోట్ల బస్టాండ్లు, రహదారుల పక్కన ఉన్న హోటళ్లు, షాపుల్లో ఎంఆర్పీ ధర కంటే అధికంగా చార్జీలు వసూలు చేస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. పిల్లలు తినే బిస్కెట్ ప్యాకెట్లు, చిప్స్, నీటి బాటిల్స్ వంటి సాధారణ వస్తువులకే అధిక ధరలు చెప్పడంసాధారణమైపోయింది. పిల్లలు మారం చేయడంతో తల్లిదండ్రులు ఎలాంటి వాదనలు చేయలేక తప్పనిసరై కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్ర యాణికులు వాపోతున్నారు. అలాగే టిఫిన్ సెంటర్లలో కూడా మామూలు ధరల కంటే ఎక్కువ మొత్తాన్ని వసూలు చేయడం ప్రయాణికులకు తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. జాతీయ రహదారులలో ఉన్న హోటల్స్ లో, బస్టాండ్ లలో, దుకాణాలలో వేలాది మంది ప్రయాణికులు రోజు ఒకే సమస్యను ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కన ఉన్న కొంత మంది వ్యాపారులు ఎమ్మా ర్పీ ధరల కంటే అధిక ధరలకు వస్తువులను విక్రయించడం సర్వసాధారణంగా మారింది. దీనివల్ల సాధారణ ప్రజలు ముఖ్యంగా బస్సు ప్రయాణికులు కుటుంబాలతో ప్రయాణించే వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలంలో తాగునీటి అవసరం పెరగడంతో వ్యాపారులు ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారని వారు చెబుతున్నారు. ఎంఆర్పీ ధరపై అదనంగా రూ.5 నుంచి రూ 10 వరకు వసూలు చేస్తున్నారు. బిల్లులు ఇవ్వకుండా నగదు మాత్రమే తీసుకోవడం. ఇక్కడ రేట్లు ఇలానే ఉంటాయి అంటూ వినియోగదారులను బెదిరించడం సాధారణమైపోయింది. రాత్రి సమయాల్లో ఎక్కువ ధరలు వసూలు చేయడం. రహదారుల వెంట ఉన్న వ్యాపారులు కొంతమంది ఈ రకమైన అక్రమాలకు పాల్పడుతుండగా, బస్టాండ్లలో ఉన్నటువంటి దుకాణదారులు వాటర్ బాటిల్స్ పై, బిస్కెట్ ప్యాకెట్ చీప్ మొదలైన వాటిపై 5 నుండి 10 రూపాయల వరకు అదనంగా వసుళ్ళకు పాల్పడుతున్నారు. ప్రశ్నించిన ప్రయాణికులకు మా షాప్ లో రేటు ఇంతే ఇష్టమైతే కొనండి లేదంటే వెళ్ళండి అని సమాధానం ఇస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికులు చెబుతున్నదేమిటంటే, దూర ప్రయాణాల్లో తప్పనిసరిగా ఆగాల్సి రావడం వల్ల ఈ దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. అప్పుడు వ్యాపారులు ఇదే అవకాశంగా తీసుకుని అధిక ధరలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. నీటి బాటిల్ మీద ఎంఆర్పీ రూ. 20 ఉంటే రూ. 25 తీసుకుంటున్నారు. అడిగితే ఇష్టం లేకపోతే కొనొద్దంటున్నారు అని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల రక్షణచట్టం ప్రకారం ఎంఆర్పీ కంటే ఎక్కువ ధర వసూలు చేయడం చట్ట విరుద్ధం. ప్రతి వస్తువుపై ముద్రించిన గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ) కంటే అధికంగా తీసుకోవడం నేరం. అయినప్పటికీ పర్యవేక్షణ లోపంతో ఇలాంటి అక్రమాలు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో పర్యవేక్షణ తక్కువగా ఉండటం, తనిఖీలు సరిగా జరగకపోవడం వల్ల వ్యాపారులు నిర్భయంగా అక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడూ తనిఖీలుచేసినా, కఠిన చర్యలు లేకపోవడం వల్ల పరిస్థితి మారడం లేదని అంటున్నారు. బస్టాండ్లు, హైవే హోటళ్లపై ఆకస్మిక తనిఖీలు చేయాలి. ఎంఆర్పీకి మించి వసూలు చేసే వారిపై జరిమానాలు విధించాలి. ప్రతి షాపులో ధరల జాబితా తప్పనిసరిగా ప్రదర్శించాలి. వినియోగదారుల ఫిర్యాదులకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నేషనల్ హెల్ప్లైన్ నెంబర్లకు 1800-11-4000, 1915 సమాచారం అందించినట్లయితే అధికారులు చర్యలు తీసుకుంటారు. జాతీయ రహదారులు ఉపాధి మార్గాలు మాత్రమే కాదు, ప్రజలకు సేవలు అందించే కేంద్రాలు కూడా. ఈ సేవలను దోపిడీగా మార్చే కొందరు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటేనే వినియోగదారులకు న్యాయం జరుగుతుందని, అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ధర దోపిడీపై సంబంధిత అధికారులు వెంటనే నిర్లక్ష్యం వీడి స్పందించి కట్టడి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది అని పలువురు వాపోతున్నారు.

# అందుబాటులోకి రాని స్విమ్మింగ్ పూల్స్

కరీంనగర్ : ప్రతి ఏటా వేసవిలో ప్రజల సౌకర్యార్థం కరీంనగర్ లో దాదాపు 6 చోట్ల ఈత కొలనుల నిర్వహణ చేపడుతున్నది. గడిచిన రెండు, మూడు రోజుల నుంచి వరుసగా ఈత కొలనులను ప్రారంభిస్తున్నరు. కరీంనగర్ అంబెడ్కర్ స్టేడియం లో ఇప్పటికి 600 మంది వరకు పేరు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ పరంగా ఈ స్విమ్మింగ్ ఫూల్ ఉన్నా సామాన్యుని కి అందుబాటులో లేదు. వైరవిలు చేసుకున్న వారికి ప్రవేశం కల్పిస్తున్నా రు. పిల్లలకు 1300, పెద్దలకు 1600 రూపాయలు వసూలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం నాలుగు బ్యాచ్ లు బ్యాచ్ కు 40 మంది చొప్పున శిక్షణ ఇస్తున్నారు. కరీంనగర్ క్లబ్ తో పాటు సేంట్ జాన్స్ స్కూల్ తో పాటు మరో మూడు చోట్ల ఉన్న ఒక్కరికి 1500 నుండి 2000 రూపాయలు వసూలు చేస్తున్నారు. పాఠశాలలకు సెలవు లు ఇవ్వడంతో, పట్టణంలో ఈత శిక్షణ శిబిరాలు సందడిగా మారుతున్నాయి. తల్లిదం డ్రులు తమ పిల్లలతో కలిసి ఈ శిబిరాలకు తరలివస్తుండటంతో ఈ సందడి నెలకొందిజిల్లా యంత్రాంగంతో పాటు, ప్రైవేట్ పాఠ శాలలు మరియు వ్యక్తులు కూడా పిల్లలకు క్రీడలు, ఆటలు, చిత్రలేఖనం, చదరంగం, నృత్యం మరియు ఇతర ఈవెంట్లలో శిక్షణ ఇవ్వడానికి వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఇతర క్రీడాంశాలలో, ఈతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుండటంతో ఇవి ఇటు క్రీడల శాఖకు, ప్రైవేట్ సంస్థలకు ఆదాయ వనరులగా మారి సామాన్య, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు అందని ద్రా క్షగా మారింది. అంబేడ్కర్ స్టేడియంలోని ఈత కొలనునురూ. 35 లక్షలు ఖర్చు చేసి పునరుద్ధరించింది. పెయింటింగ్తో పాటు, విద్యుత్ వైరింగ్, ఫిల్ట్రేషన్ పనులు చేపట్టారు. స్నానాల గదులు, దుస్తులు మార్చుకునే గదులు, షవర్లు, వాష్రూమ్లను కూడా పునరుద్ధరించారు. ఈ నిధులను ఈత కోసం వచ్చే వారినుండి గుంజే ప్రయత్నమే 500 ఉన్న రేటును మూడింతలు చేశారని కరీంనగర్ వాసులు అంటున్నారు. ప్రతి సంవత్సరం వేసవిలో నగరపాలక సంస్థ ఉచిత వేసవి క్రీడా



శిక్షణా శిబిరాలను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తుంది. 2017 నుంచి ఆరుసార్లు వేసవి శిక్షణ శిబిరాలను నగరపాలక సంస్థ నిర్వహించింది. ఈ సంవత్సరం విద్యార్థులకు వేసవి సెలవులు ప్రారంభమైనప్పటికీ నగరపాలక సంస్థ నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో క్రీడా శిక్షణ శిబిరాలు ఉన్నట్టా... లేనట్టా.. అనే సందేహం కలుగుతోంది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 2017 నుంచి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను జిల్లా క్రీడా శాఖ సహకారంతో నిర్వహిస్తోంది. వేసవి సెలవుల్లో ఇంటిపట్టునే ఉంటున్న చిన్నారులకు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉచిత శిక్షణను ఇచ్చారు. నగరపాలక సంస్థ ఇంతవరకు ఈ సంవత్సరం ఎలాంటి ఉచిత క్రీడా శిబిరాల నిర్వహణ ప్రకటన చేయలేదు. కొన్ని సంవత్సరాలుగా శిక్షణ శిబిరాలను విజయవంతంగా నిర్వహించిన బల్దియ ఈ సంవత్సరం ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విద్యార్థులకు నిర్వహించకపోవడం తో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ శిబిరాల నిర్వహణకు వెచ్చించాల్సిన వ్యయం పెరుగుతుండ డంతో నగరపాలక సంస్థ వెనకడుగు వేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# ఆగస్టులోనే పరిషత్ ఎన్నికలు

హైదరాబాద్ : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని వేచి చూస్తున్న ఆశావహులకు మరో బిగ్ షాక్ తగిలేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆలస్యమైన ఈ ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. మరికొన్ని రోజుల పాటు ఈ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యేలా లేవు. జనగణన, ఉద్యోగుల బదిలీలతో పాలనపరమైన నిర్ణయాల నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించడం ఇప్పట్లో ఉండదని రాజకీయ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. దీంతో ప్రత్యేక అధికారులే పాలన సాగించనున్నారు. తెలంగాణలో గత కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జులై నెల చివరి వరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ లేనట్లేనా అనే సందేహాలు కలుగుతున్నాయి. దీంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్న ఆశావహ అభ్యర్థులంతా మరికొంత కాలం వేచి చూడాల్సిన పరిస్థితి తప్పదనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రెండు నెలల పాటు జనగణన ప్రక్రియ నిర్వహించడంతో పాటు.. ఉద్యోగుల బదిలీలు కూడా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు తమ



విధుల్లో బిజీగా ఉండనున్నారు. దీంతో ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పాలనాపరమైన ప్రక్రియలతోపాటు.. విద్యా సంవత్సరం మారనున్న నేపథ్యంలో జులై నెల చివరి వరకు స్థానిక ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని అర్థం అవుతోంది. మే, జూన్ నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణలో జనగణన ప్రక్రియను చేపట్టనుండగా.. ఈ ప్రక్రియలోనే మొత్తం అధికార యంత్రాంగం నిమగ్నం కానుంది. మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు తెలంగాణలో ఇంటింటి సర్వే నిర్వహించనుండటంతో జనగణన విధుల్లోనే అధికారులందరూ ఉండనున్నారు. మరోవైపు.. ఇప్పటికే మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎత్తివేసింది. ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగుల బదిలీల ప్రక్రియ మొత్తం మే నెల అంతా కొనసాగనుంది. ఆ తర్వాత మళ్లీ జూన్ 1వ తేదీ నుంచి ఉద్యోగుల బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. అయితే ఆ లోపు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ అసాధ్యమని స్పష్టం అవుతోంది. అదే సమయంలో జూన్ నెలలో రాష్ట్రంలో స్కూళ్లు తిరిగి ప్రారంభం కానున్నాయి. అడ్మిషన్ల పెంపు, స్కూళ్లను మరింత బాగు చేయడం వంటి కార్యక్రమాలపై రాష్ట్ర విద్యా శాఖ ప్రత్యేక దృష్టి పెట్టనుంది. ఇక ఉపాధ్యాయులు కూడా అడ్మిషన్ పనుల్లో బిజీగా ఉండటం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిబ్బంది కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు.. ఇప్పటికే ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికలు పూర్తి అయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం జరిగింది. దీంతో ఆశావహుల్లో ఉత్సాహం పెరిగింది. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు కులగణన లేదా తాజా జనగణన లెక్కలను ప్రామాణికంగా తీసుకోవాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ జనగణన ప్రక్రియ ముగియకుండా ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలా వద్దా అని రాష్ట్ర ప్రభుత్వం అయోమయంలో పడింది. రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్న వివరాల ప్రకారం.. జూలై నెల చివరి నాటికి రాష్ట్రంలో జనగణన సర్వేతో పాటు ఉద్యోగుల ట్రాన్స్ఫర్ల

# ఓయూ క్యాంపస్‌లో తీవ్ర విషాదం

హైదరాబాద్ : విద్యాకుసుమాలు వికసించాల్సిన ఓయూ క్యాంపస్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రేమించిన యువతి దూరం పెట్టిందన్న మనస్థాపంతో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాంధీ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి చికిత్స పొందుతూ చివరకు ప్రాణాలు విడిచాడు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన 19 ఏళ్ల యువకుడు ఉస్మానియా యూనివర్సిటీలో మైనింగ్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ సమీపంలో ఒక్కసారిగా ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఇది గమనించిన తోటి విద్యార్థులు, సిబ్బంది వెంటనే మంటలను ఆర్పి గాంధీ ఆసుపత్రికి తరలించారు. సుమారు 70 శాతం పైగా కాలిన గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడు, వైద్యులు శ్రమించినప్పటికీ మృతి చెందాడు.

సూసైడ్ నోట్‌లో సంచలన విషయాలు

ఘటనా స్థలంలో పోలీసులకు లభించిన సూసైడ్ నోట్ ఈ ఆత్మహత్యకు గల కారణాలను వెల్లడించింది. తాను సాహితి అనే యువతిని గాఢంగా ప్రేమించానని, అయితే ఆమె తనను మోసం చేసిందని బాధితుడు లేఖలో ఆవేదన వ్యక్తం చేశాడు. తన ప్రియురాలికి ఒక అబ్బాయిని పరిచయం చేయగా, ఆ అబ్బాయి తన గురించి చెడుగా చెప్పడంతో ఆమె బ్రేకప్ చెప్పిందని అందులో రాశాడు. గతంలోనే ఒకసారి ఆత్మహత్యాయత్నం చేసిన ఈ యువకుడు, తిరిగి హైదరాబాద్ వచ్చిన తర్వాత ఆ యువతి వేరే వ్యక్తితో ప్రేమలో ఉన్నట్లు తెలుసుకున్నాడు. ఇదే విషయంపై ఆమెను నిలదీయగా.. "నిన్ను టైంపాస్ కోసం ప్రేమించాను" అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో తీవ్ర డిప్రెషన్‌కు లోనైనట్లు లేఖలో వివరించాడు. ఉన్నత చదువులు చదివి ప్రయోజకుడవుతాడని ఆశించిన కొడుకు, ప్రేమ పేరుతో ఇలా తనువు చాలించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒక చిన్న మాటకో లేదా ప్రేమ విఫలమైందన్న కారణంతోనో ఇలాంటి క్షణికావేశ నిర్ణయాలు తీసుకోవద్దని పోలీసులు మరియు కౌన్సిలింగ్ నిపుణులువిద్యార్థులకు సూచిస్తున్నారు. ఈ ఘటనపై ఓయూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వికసిత భారత్ కు గూగల్ సెంటర్ ప్లస్ అవుతుంది

విశాఖపట్టణం : విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్, 2047 నాటి వికసిత్ భారత్ లక్ష్యానికి ఒక పునాది రాయి లాంటిదని గూగుల్ క్లౌడ్ గ్లోబల్ ఇన్ ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే అన్నారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏఐ యుగంలో ఈ డేటా సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని, భారత డిజిటల్ పరివర్తనలో ఇది అత్యంత ముఖ్యమైనదని వివరించారు. ఈ ప్రాజెక్టుతో విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా పరుగులు పెడతాయని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటివరకు అంతర్జాతీయ సబ్ సీ గేట్ వేలుగా ఉన్న ముంబై, చెన్నైల సరసన ఇప్పుడు విశాఖ కూడా నిలుస్తుందని స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఫైబర్ ఆప్టిక్ కేబుల్ లైన్లు విశాఖను ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తాయని, దీనివల్ల సంప్రదాయ నౌకాయాన మార్గాలు ఇకపై డిజిటల్ ట్రేడ్ రూట్లుగా మారతాయని పేర్కొన్నారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటులో భాగస్వామ్యం వహిస్తున్న అదానీ కనెక్స్, ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఎదుగుతున్న విశాఖకు ఈ డేటా సెంటర్ టెక్నాలజీ భవిష్యత్తును అందిస్తుందని కోలే అన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, వారికి అడ్వాన్స్‌డ్ క్లౌడ్, ఏఐ టెక్నాలజీలపై శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. దాదాపు 10 వేల మందికి పైగా మహిళలు మైక్రో ఎంటర్‌ప్రైజ్‌లు స్థాపించేందుకు గూగుల్ సహకారం అందిస్తుందని వెల్లడించారు. ఈ ప్రాంతానికి ఇంధన భద్రత కల్పించేలా కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, ఎనర్జీ స్టోరేజి వ్యవస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు, ఈ ప్రాంతానికి ఆర్థిక స్థిరత్వం కల్పించేలా ఈ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నామని బికాస్ కోలే వివరించారు.

**భూమి పూజ చేసిన అశ్విన్ వైష్ణవ్...** ఏపీలో టెక్నాలజీ రంగంలో మరో భారీ పెట్టుబడికి అడుగుపడింది. విశాఖపట్నంలో గూగుల్ ఏర్పాటు చేయనున్న క్లౌడ్ ఏఐ హబ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శంకుస్థాపన చేశారు. అదానీ కనెక్స్, ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రా భాగస్వామ్యంతో గూగుల్ సుమారు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టును చేపడుతోంది. విశాఖ జిల్లా తర్లువాడలో 1 గిగావాట్ సామర్థ్యంతో ఈ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించనున్నారు. ఈ మెగా ప్రాజెక్ట్ కోసం తర్లువాడ, రాంబిల్లి, అడవివరం ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 600 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గూగుల్ ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించి అక్కడి టెక్నాలజీలను పరిశీలించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇంఛార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ భరత్ పాల్గొన్నారు. గూగుల్ గ్లోబల్‌న్ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే, భారతీ ఎంటర్‌ప్రైజెస్ వైస్ చైర్మన్ రాకేష్ మిట్టల్, అదానీ గ్రూప్ ప్రతినిధి జీత్ అదానీ, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, గూగుల్ ఇండియా ప్రతినిధి ప్రీతి లొబానా తదితరులు హాజరయ్యారు. ఈ ప్రాజెక్టుతో విశాఖ నగరం గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో కీలక స్థానం సంపాదించనుంది.

# అప్పుడు సైబరాబాద్.. ఇప్పుడు గూగుల్ రాకతో విశాఖ

విశాఖపట్టణం : ప్రపంచమంతా గూగుల్‌లో సెర్చ్ చేస్తుంటే.. గూగుల్ మాత్రం ఏపీని ఎంచుకుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ చరిత్రలో కొత్త టెక్ శకానికి శ్రీకారం చుట్టిన రోజు ఇది. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో టెక్నాలజీ రంగంలో ఏపీ తలెత్తుకుని నిలుస్తుందన్నారు.. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఇదేనని.. దేశానికి ఏఐ డేటా గేట్ వేగా ఏపీ నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో భారత చరిత్రలో 2026 ఏప్రిల్ 28వ తేదీ శాశ్వతంగా నిలిచిపోతుంది. విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ, ఈ ప్రాజెక్టు కేవలం విశాఖకే కాకుండా మొత్తం రాష్ట్రానికే ఒక గేమ్ ఛేంజర్ అని పేర్కొన్నారు. 1997లో తాను హైటెక్ సిటీని ప్రారంభించి సైబరాబాద్ నగరాన్ని నిర్మించానని, ఇప్పుడు గూగుల్ రాకతో ఏపీ టెక్నాలజీ ప్రపంచంలో సగర్వంగా తలెత్తుకుని నిలబడుతుందని ధీమా వ్యక్తం చేశారు. సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్, ఇప్పుడు భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మారబోతోందని, ఒక గిగావాట్ సామర్థ్యంతో పనిచేసే ఈ డేటా సెంటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ డేటా గేట్‌వేగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు వెనుక మంత్రి నారా లోకేష్ కృషిని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా కొనియాడారు. లోకేష్ అమెరికాలోని గూగుల్ క్యాంపస్‌కు వెళ్లి వారిని ఏపీకి ఆహ్వానించారని, ఏ పని అప్పగించినా పట్టుదలతో పూర్తి చేస్తారని ప్రశంసించారు. అదానీ, ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ సంస్థలతో కలిసి గూగుల్ ఇక్కడ పెట్టుబడులు పెట్టడం శుభపరిణామమని, ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. 2028 సెప్టెంబర్ నాటికి ఈ డేటా సెంటర్ పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అవసరమైతే రెండు, మూడు నెలలు ముందుగానే పూర్తి చేసేందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కేవలం ఎంఓయూలకే పరిమితం కాకుండా, పనుల ప్రారంభంలోనూ ఏపీ ముందుంటుందని నిరూపించామన్నారు. రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కూడా చంద్రబాబు పలు కీలక ప్రకటనలు చేశారు. జూలై నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేస్తామన్నారు. కేంద్ర మంత్రులతో చర్చించిన మేరకు రాబోయే ఏడెనిమిదేళ్లలో అమరావతి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలను కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు వస్తాయని, అలాగే జూన్ 1న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభమవుతుందని తెలిపారు. మిగిలిన నగరాలతో పోలిస్తే ఏపీలో వ్యాపార నిర్వహణ ఖర్చు చాలా తక్కువగా ఉంటుందని, పెట్టుబడిదారులు ఏపీని తమ గమ్యస్థానంగా మార్చుకోవాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర దశ మార్చిన గూగుల్.. దేశంలోనే ఏపీ నెంబర్ వన్

విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిపై కీలక ప్రకటనలు చేశారు. జూన్ 1వ తేదీ నుంచి సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌కు అధికారిక నోటిఫికేషన్ ఇస్తున్నందుకు కేంద్ర రైల్వే మంత్రికి ధన్యవాదాలు తెలిపిన ఆయన, ఈస్ట్ వెస్ట్ కారిడార్ అనుసంధానంతో ఈ ప్రాంతం లాజిస్టిక్స్ హబ్‌గా మారుతుందని పేర్కొన్నారు. దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే రావడం విశేషమని, కేవలం ఒప్పందాలకే కాకుండా ప్రాజెక్టుల గ్రౌండింగ్‌లోనూ ఏపీ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని సీఎం స్పష్టం చేశారు.

మరో రంగారెడ్డి జిల్లాగా అనకాపల్లి జిల్లా..

ఉత్తరాంధ్ర భవిష్యత్తుపై ధీమా వ్యక్తం చేస్తూ, గతంలో వలసలకు నిలయమైన ఈ ప్రాంతం ఇకపై ఉద్యోగాలకు చిరునామాగా మారుతుందని, 'ట్యాలెంట్ మైగ్రేషన్'కు కాలం చెల్లిందని చంద్రబాబు అన్నారు. జూలైలో ప్రధాని మోదీ చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించబోతున్నామని, 2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఒప్పందాలు, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ విస్తరణతో అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా అభివృద్ధికి కేంద్రబిందువు అవుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాఖపట్టణం.. ఇక ఏఐ పట్టణం

గతంలో విజనరీ లీడర్ చంద్రబాబు నిర్మించిన హైదరాబాద్ సైబర్ టవర్స్ ఐటీ రంగానికి ఎలాగైతే ఐకానిక్‌గా నిలిచిందో, ఇప్పుడు గూగుల్ ఏఐ డేటా సెంటర్‌తో విశాఖపట్నం ప్రపంచవ్యాప్తంగా 'ఏఐ పట్నం'గా మారుతుందని కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కొనియాడారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల ఉమ్మడి విజన్‌కు తాను సెల్యూట్ చేస్తున్నానని పేర్కొన్నారు. సాగర నగరం విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ ఏపీ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఏరోస్పేస్ వంటి రంగాల్లో ఏఐ విప్లవం రాబోతోందని, గూగుల్ క్లౌడ్ హబ్ ద్వారా విశేషమైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత్ ఐటీ సేవల రంగంలో అగ్రగామిగా ఎదిగిందని, అయితే గతంలో ఉత్పత్తి రంగంలో వెనుకబడ్డామని అశ్వినీ వైష్ణవ్ గుర్తు చేశారు. ప్రధాని మోదీ చొరవతో ఇప్పుడు మొబైల్ తయారీలో ముందడుగు వేశామని, దేశీయ అవసరాల్లో 50 శాతం ఎలక్ట్రానిక్ పరికరాలను మనమే తయారు చేసుకుంటున్నామని తెలిపారు. సెమీకండక్టర్ మిషన్ ద్వారా ఇప్పటికే వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైందని, ఇకపై డేటా సెంటర్లకు అవసరమైన సర్వర్లు, జీపీయూ చిప్‌లను కూడా గూగుల్ (ఉనీనీణశ్రీవ) వంటి సంస్థలు ఇక్కడే ఉత్పత్తి చేయాలని సూచించారు. ఈ విషయాన్ని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు తెలియజేయాలని విన్నవించారు. అలాగే, ఆస్ట్రేలియా, అమెరికా, యూరప్ దేశాలకు కనెక్టివిటీ ఇచ్చేలా విశాఖ నుంచి 3 సబ్ సీ కేబుల్స్ వేస్తున్నందుకు గూగుల్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీ రైల్వే అభివృద్ధిపై మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్ర విభజన హామీ అయిన 'సౌత్ కోస్ట్ రైల్వే జోన్'ను 2026 జూన్ 1వ తేదీన అధికారికంగా నోటిఫై చేయబోతున్నట్లు ప్రకటించారు. గతంలో ఉమ్మడి ఏపీకి కేవలం రూ. 886 కోట్లుగా ఉన్న రైల్వే బడ్జెట్‌ను, ప్రస్తుతం 'డబుల్ ఇంజన్' సర్కార్ కృషితో ఏకంగా రూ. 10,134 కోట్లకు పెంచామని వెల్లడించారు. రాష్ట్రంలో రూ. 1.06 లక్షల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని, 74 స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. ఏపీ ఇప్పటికే 100 శాతం రైల్వే ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేసుకుందని, 16 వందే భారత్ రైళ్లు ఇక్కడ నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఏపీ నుంచి 22 అమృత్ భారత్ సర్వీసులు నడుస్తున్నాయని, రైళ్ల డిజైన్, ఉత్పత్తిలో చాలా జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే మరో భారీ ప్రాజెక్టు బులెట్ ట్రైన్ గురించి మంత్రి ప్రస్తావించారు.

# ఆకివీడు రామాలయం అడుగులు

ఏలూరు : పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులోని పెదపేటలో శ్రీరామ నవమి కూటమి నేతలు, రామభక్తులపై దాడి ఘటన కలకలం రేపింది. మార్చి 8న పెదపేటలో రామాలయం పునరుద్ధరణ చేయాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రకటించడంతో స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. కొందరు స్థానికులు మార్చి 17న కొంతమంది గొంతెనమ్మ ఆలయం పేరుతో ఫ్లెక్సీ కట్టారు. ఆ తర్వాత మార్చి 27న శ్రీరామనవమి రోజు రఘురామ పూజల కోసం వెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కూటమి నేతలతో పాటుగా మరికొందరిపై దాడులు జరిగాయి.. ఈ కేసులో 58మందిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో నిందితుడిగా ఉన్న భీమవరానికి చెందిన మీసాల జయరాజు జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యారు. తాజాగా ఆకివీడు పెదపేట ఘటనకు సంబంధించి సంచలన విషయాలను వెల్లడించారు. పెదపేటలో వివాదం, గొడవల వెనుక పాస్టర్ ఇస్మాయిల్ పాత్ర ఉందంటూ చెప్పుకొచ్చారు.ఆకివీడులో శ్రీరామనవమి రోజు జరిగిన ఘటనలో తనపై కూడా కేసు నమోదైందని జయరాజు చెప్పుకొచ్చారు. తనపై కూడా ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేయడంతో జైలకు వెళ్లి బెయిల్‌పై వచ్చినట్లు తెలిపారు. పెదపేటలో చర్చిలు కూల్చివేసి దళితులపై దాడిచేసి ఇళ్లు కూల్చి వేస్తున్నారని పాస్టర్ ఇస్మాయిల్ తనకు ఫోన్ చేశారని.. శాంతియుత ర్యాలీ చేయాలని చెప్పడంతో ఒక దళిత నాయకుడిగా తాను అక్కడికి వెళ్లానన్నారు. ఆ రోజే ఇస్మాయిల్ అనే వ్యక్తి మొదటిసారి పరిచయం అయ్యారని చెప్పుకొచ్చారు.శాంతియుత ర్యాలీ అని చెప్పి ఉన్నట్టుండి పాస్టర్ ఇస్మాయిల్ పక్కనే ఉన్న టవర్ ఎక్కారని.. శాంతియుత ర్యాలీ అని చెప్పి ఇలా చేయడం సరికాదని ఆయనకు నచ్చజెప్పానని జయరాజు తెలిపారు.ఇస్మాయిల్ టవరెక్కడంతో.. ఆయన పాస్టర్ కాబట్టి.. పెదపేటలో కూలగొట్టినట్లు చెబుతున్న చర్చిల్లో ఈయన చర్చి కూడా ఉందనే బాధతో ఇలా టవర్ ఎక్కాడని తాను భావించానన్నారు జయరాజు. కానీ ఆ తర్వాత స్థానికుల్ని అడిగి ఇస్మాయిల్ గురించి తెలుసుకుంటే.. కూలగొట్టినట్లు చెబుతున్న వాటిలో పాస్టర్ చర్చి కూల్చలేదని తెలిసిందన్నారు. కొద్దిసేపటి తర్వాత ఇస్మాయిల్ కిందకు వచ్చారని.. తాను అక్కడి నుంచి వెళ్లిపోయానన్నారు. అనంతరం చర్చిలు కూల్చివేతలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లామని.. కానీ పాస్టర్ ఇస్మాయిల్ మాత్రం అక్కడికి రాలేదన్నారు. ఆయన్ను హౌస్ అరెస్ట్ చేసినట్లు తనకు తెలిసిందని.. ఇంలో పోలీసులు ఇస్మాయిల్‌ను కొట్టినట్లు తనకు సమాచారం వచ్చిందన్నారు. తీరా తాను వెళ్లి ఆరా తీస్తే ఆయన్ను పోలీసులు కొట్టలేదని తనకు తెలిసిందన్నారు. పాస్టర్ ఇస్మాయిల్ మాత్రం పోలీసులు తనపై దాడిచేసినట్లు ఆరోపించారని.. డిప్యూటీ స్పీకర్ రఘురామపై విమర్శలు చేశారన్నారు.'ఇస్మాయిల్ గురించి నిజాలు తెలిసిన తర్వాత ఆకివీడు పెదపేటలో స్థానికుల్ని పిలిచి అన్ని విషయాల గురించి వారితో చెప్పాను. పాస్టర్ ఇస్మాయిల్ అంతటితో ఆగకుండా చర్చిల్ని



కూల్చివేస్తున్నారంటూ తన యూట్యూబ్ ఛానల్‌లో వీడియోను అప్‌లోడ్ చేయడంతో వైరల్ అయ్యింది. ఆ తర్వాత చుట్టపక్కల పాస్టర్లు ఆయన్ను పరామర్శించడానికి వచ్చారు, సన్మానం చేశారు. అప్పుడు ఇస్మాయిల్ గురించి ఆరా తీస్తే పూర్తి వివరాలు తెలిశాయి. ఇస్మాయిల్ ఆర్థికంగా స్థిరపడటానికి, రాజకీయ ఎదుగుదల కోసం ఇస్మాయిల్ ఇలా చేశారని తెలిసింది. తన సొంత ప్రయోజనాల కోసం ఇస్మాయిల్ దళితుల్ని పావులుగా వాడుకుంటున్నారు. నేను ఎక్కడా డిప్యూటీ స్పీకర్ రఘురామ గురించి ఎమ్మెల్యే గురించి మాట్లాడలేదు' అన్నారు.'పెదపేటలో అమ్మవారి గుడి కావాలి, రామాలయం వద్దని చెబుతున్నారు. ఆ విషయాన్ని పక్కన పెట్టి సొంత ప్రయోజనాల కోసం ఇస్మాయిల్ ఏదేదో మాట్లాడారు. ఈ క్రమంలోనే డిప్యూటీ స్పీకర్ రఘురామ మమ్మల్ని తప్పుగా అనుకున్నారు. నేను గత ఎన్నికల్లో కూటమి పార్టీల కోసం పనిచేశాను.. యువగళం సమయంలో నారా లోకేష్‌పై రాళ్లు వేసిన సమయంలో, పవన్ కళ్యాణ్ వచ్చిన సమయంలో ఆయనకు వ్యతిరేకగా జరిగిన ఘటనల్ని నేను ఖండించాను.. మా నాన్న, చిన్నాన్న టీడీపీలో ఉన్నారు. నేను ఏదైనా తప్పు జరిగితే.. ఇది తప్పు అని నేను రియాక్ట్ అవుతాను. ఆకివీడు పెదపేటలో జరిగిన ఘటనకు నాకు ఎలాంటి సంబంధం లేదు.. ఆ గొడవలో నన్ను ఇరికించారు. కానీ నా వాదనను ఎవరూ పట్టించుకోలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.'ఇస్మాయిల్ అనే వ్యక్తి స్వలాభం కోసం చేసిన పనితో నేను ఈ కేసులో ఇరుక్కున్నాను. ఈ కేసు నమోదు చేసిన తర్వాత నేను జైలుకు వెళ్లాను.. బెయిల్‌పై వచ్చాను. ఇస్మాయిల్ ఎమ్మెల్యేను విమర్శిస్తే లక్షల రూపాయలు వస్తున్నాయి. ఈ ఘటనలో ఇంకా చాలామంది జైల్లో ఉన్నారు కానీ ఇస్మాయిల్ కనీసం వాళ్లను పరామర్శించలేదు. ఇస్మాయిల్ ఈ ఘటన తర్వాత కొంతమంది దగ్గర డబ్బులు వసూళ్లు కూడా చేశారు.. ఈ ఘటనలో వాస్తవాలు తెలియాలనే నేను ఈ విషయాలను చెబుతున్నాను. ఇస్మాయిల్ చేసిన తప్పులకు సంబంధించి నా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయి. త్వరలోనే అన్ని వివరాలు చెబుతాను' అని చెప్పుకొచ్చారు జయరాజు.

# పాత బస్సులకు కొత్త రంగులు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుస్థిర విద్యుత్ వాహన పాలసీ 4.0 కింద ఆర్టీసీలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో డీజిల్ ఖర్చు తగ్గించి కాలుష్యాన్ని నివారించేందుకు విద్యుత్ బస్సుల్ని తీసుకొస్తోంది. కేంద్రం నుంచి 1050 బస్సులు కేటాయించగా.. మరో 1450 బస్సుల్ని తీసుకురావాలని నిర్ణయించింది. అంతేకాదు కాలం చెల్లిన పాత బస్సుల్ని రీమోడల్ చేసి విద్యుత్ బస్సులుగా మార్చేస్తోంది. పాత డీజిల్ బస్సును విద్యుత్ బస్సుగా మార్చేశారు. ఈ మేరకు ట్రయల్ రన్ నిర్వహించారు.ఆర్టీసీలో పాత బస్సులు కొన్ని లక్షల కిలోమీటర్లు తిరిగి ఉంటాయి.. ఈ కాలం చెల్లిన బస్సును ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ కింద రెట్రోఫిట్‌మెంట్ చేసి, విద్యుత్‌తో నడిచే ఏసీ బస్సుగా మార్చేశారు. పాత సూపర్ లగ్జరీ బస్సును కళ్యాణీ ట్రాన్స్ సంస్థ (భారత్ ఫోర్జ్) ప్రయోగాత్మకంగా విద్యుత్ ఏసీ బస్సు (ఇంద్ర సర్వీస్)గా మార్చేసింది. ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సును విజయవాడ ఆర్టీసీ హౌస్‌కు తీసుకురాగా అధికారులు పరిశీలించారు. ఈ బస్సును కొంతకాలం ట్రయల్ రన్ కోసం ఏదైనా రూట్‌లో నడపాలని నిర్ణయించారు. ఈ బస్సుకు ఎంతసేపు ఛార్జింగ్ చేస్తే ఎన్ని కిలోమీటర్లు మైలేజ్ వస్తుందో పరిశీలించనున్నారు. పాత బస్సుల్ని ఇదే తరహాలో రెట్రోఫిట్‌మెంట్ చేస్తే ఎంత ఖర్చవుతుంది?.. కొత్త విద్యుత్ ఏసీ బస్సులు తీసుకోవడం కంటే.. ఇలా పాత వాటిని మార్పు చేస్తే ఎంత ఖర్చవుతుంది? వంటి అంశాలను పరిశీలించనున్నారు. ఇప్పటికే చిత్తూరు ఆర్టీసీ డిపోలో డీజిల్ బస్సును సీఎన్జీ బస్సుగా మార్చేశారు.. ఇప్పటికే ఈ బస్సు ట్రయల్ రన్ కూడా పూర్తి చేశారు. ఇప్పుడు పాత బస్సుల్ని విద్యుత్ బస్సులుగా మార్చేస్తున్నారు.మరోవైపు ఏపీఎస్ఆర్టీసీకి ఎలాంటి డీజిల్ కొరత లేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 11 వేల బస్సులకు రోజుకు 7.5 లక్షల లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది.. అయితే ప్రస్తుతం అన్ని బస్సు సర్వీసులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నడుస్తున్నాయని చెప్పారు. ఆర్టీసీ బస్సులకు సంబంధించిన డీజిల్ విషయంలో ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని అధికారులు తెలిపారు

# మారని తమ్ముళ్లు...

విజయవాడ : ఒకరి తర్వాత మరొకరు. ఒక ఇష్యూ తర్వాత మరో రచ్చ. ఎమ్మెల్యేలే కాంట్రవర్సీకి తెరలేపుతున్నారో..లేక వివాదాలే వాళ్లను వెతుక్కుంటూ వస్తున్నాయో తెలియదు కాని.. ప్రతి నెల రోజులకో ఎమ్మెల్యే తీరు ఇష్యూ అవుతోంది. టీడీపీ అధినేతకు హెడెక్ అవుతోంది. పర్సనల్ లైఫ్ వేరు. పబ్లిక్ లైఫ్ చాలా సున్నితమైంది. ప్రజా జీవితంలో ఉన్న నేతలు..వారి చుట్టున్న వాళ్లు చిన్న మిస్టేక్ చేసిన పెద్ద రచ్చ అవుతోంది. పొలిటికల్ లైఫే తలకిందులైన సందర్భాలు ఉన్నాయి. అందుకే చేసే ప్రతీ..మాట్లాడే ప్రతీ మాట ఎంతో ముఖ్యం. రాజకీయ నాయకులు అయితే ఎంత జాగ్రత్తగా ఉంటే అంత బెటర్. ఎంత ఆచితూచి వ్యవహరిస్తే అంత మంచిది. దూకుడే పేరు తెచ్చి పెట్టినా..ఆ దూకుడు స్వభావమే నట్టేట ముంచొచ్చు. సింపుల్ లివింగ్, లో ప్రొఫైల్..హై థింకింగ్‌కు అలవాటు పడిన వారికే బెటర్ పొలిటికల్ ఫ్యూచర్ ఉంటుందన్నది..సీనియర్ లీడర్లను చూస్తే అర్థమవుతోంది. ఎమ్మెల్యేలు సరిగ్గా ఉంటే సరిపోదు..వారి కుటుంబ సభ్యులు, అనుచరులు, సిబ్బంది అందరి ప్రవర్తన లెక్కలోకి వస్తుంది. చివరకు ఎమ్మెల్యేతో ఫోటో దిగిన వ్యక్తి ఏదైనా తప్పు చేసి దొరికినా..అది ఆ ప్రజాప్రతినిధి మెడకు చుట్టుకోవడం ..ఆయన సమాధానం చెప్పుకునే పరిస్థితులకు దారితీస్తుంది.ఏ పొలిటికల్ లీడర్ అయినా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే..తాము చేసే ప్రతి పనిని ప్రజలు గమనిస్తున్నారని. అది పబ్లిక్ మీటింగ్‌లో కావొచ్చు. రోడ్డు మీద కావొచ్చు. ఎక్కడైనా ప్రవర్తన చాలా ముఖ్యం. ఎప్పుడూ ఏ రూపంలో వివాదంలో చిక్కుకోవాల్సి వస్తుందో చెప్పలేమ్. ఏ మాత్రం టంగ్ స్లిప్ అయినా..ఎక్కడ తమ బిహేవియర్ డిఫరెంట్‌గా కనిపించినా..మీడియా, సోషల్ మీడియా చెడుగుడు ఆడేస్తుంది. ఆ తర్వాత ఎన్ని వివరణలు ఇచ్చుకున్నా..ఎన్ని కవర్ డ్రైవ్‌లు చేసినా డ్యామేజ్ కంట్రోల్ అవడం కష్టం. ఒక ఎమ్మెల్యే చేసే మిస్టేక్ ఆయనకే పరిమితం కాదు. ఓవరాల్ పార్టీకి బ్యాడ్‌నేమ్ తెస్తున్న పరిస్థితి.టీడీపీ ఎమ్మెల్యేల విషయంలో సీన్ మరోలా ఉంది. ఎప్పుడూ ఎవరో ఒక ఎమ్మెల్యే వివాదాల్లో చిక్కుకోవడం..సీఎం చంద్రబాబు సీరియస్ అవడం కామన్ అయిపోయింది. అందరిదీ ఒక కథ అయితే..కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎపిసోడ్ సమ్‌థింగ్ డిఫరెంట్. ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే అయిన సురేంద్రబాబుకు నియోజకవర్గంలో మంచి పేరే ఉందంటున్నారు తెలుగు తమ్ముళ్లు. ఆయన ఎలాంటి కాంట్రవర్సీలు, అనవసర విషయాలకు జోలికి వెళ్లరని చెప్తున్నారు. కానీ టోల్ ప్లాజా ఎపిసోడ్‌లో ఆయన అనుచరులు చేసిన వీరంగం పెద్ద రచ్చ అయింది. చివరకు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు రియాక్ట్ అయి కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించే వరకు వచ్చింది.టోల్ గేట్ దగ్గర ఏం జరిగింది.. తప్పు ఎవరిదన్న విషయం పక్కన పెడితే జరగాల్సిన ఇష్యూ జరిగింది. టీడీపీ, కూటమి ప్రభుత్వంపై విమర్శలు రావడం..డ్యామేజ్ కంట్రోల్ కోసం చర్యలు తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. అయినా చర్చకు, విమర్శకు అవకాశం ఇచ్చినట్లు అయింది. ఇక్కడ ఎమ్మెల్యే విషయంలో ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేకున్నా..ఆయన ముందే టోల్ గేట్ సిబ్బందిపై అనుచరులు దాడి చేశారన్న వార్తలు తీవ్ర విమర్శలకు దారితీశాయి.సీఎం చంద్రబాబు పదేపదే ఎమ్మెల్యేలకు సూచిస్తున్నది ఇదే. పబ్లిక్ లైఫ్‌లో ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

చిన్న ఇష్యూనే కదా ఏం కాదు అనుకుంటే కుదరదు అంటూ పదే పదే హెచ్చరిస్తూ వస్తున్నారు. ప్రజాప్రతినిధుల బిహేవియర్ చాలా ఇంపార్టెంట్. జనం మన ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటారన్న విషయం గుర్తు చేస్తూనే ఉన్నారు. అయినా అక్కడక్కడ ఎమ్మెల్యేలు.. పొరపాటుగానో..కావాలనో రచ్చకెక్కడం, ఇష్యూకు తెరలేపడం రెగ్యులర్ అయిపోయింది. అనవసర విషయాలు, కాంట్రవర్సీల్లో వేలు పెడుతున్న ఎమ్మెల్యేల విషయంలో ఇప్పటికే పలుసార్లు సీరియస్ అయిన సీఎం చంద్రబాబు..ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు నాటికి కఠినంగా వ్యవహరించాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.

# కాపు వర్గం మారుతోందా?

కాకినాడ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వచ్చినట్లే కలలు కంటోంది. ఎంతగా అంటే వచ్చే ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తమన్నంతగా. ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో తాము సులువుగా గెలుస్తామన్న గుడ్డినమ్మకంతో ఆ పార్టీ నేతలు ఉన్నట్లు కనిపిస్తుంది. అందుకే నేతలు ఎక్కడిక్కడకక్కడ ఈ సమయంలోనూ తమ నియోజకవర్గంలో వ్యాపారాలు దెబ్బతినకుండా టీడీపీ నేతలతో కుమ్మక్కువుతున్నారన్న ఆరోపణలున్నాయి. రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాల్లో టీడీపీ, వైసీపీ మిలాఖత్ అయి మద్యం, ఇసుక వంటి వ్యాపారాలు చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. అయితే ఇవి లోపాయికారిగా జరిగినప్పటికీ బాహ్య ప్రపంచానికి మాత్రం సులువుగానే తెలుస్తోంది.అందుకే ప్రజలు రెండు పార్టీలను ఒకే గాటిన కట్టే అవకాశముంది. ముఖ్యంగా వైసీపీకి పట్టున్న కొన్ని జిల్లాల్లోనూ టీడీపీ నేతలతో వ్యాపార సంబంధాలను నెరుపుతూ గుట్టుగా పది రూపాయలు సంపాదించుకునే పనిలో ఉన్నారు. అందుకే స్థానిక ఎమ్మెల్యేలపై విమర్శలు చేయడం లేదు. టీడీపీ ఎమ్మెల్యేలు కూడా తమపై వ్యక్తిగత ఆరోపణలు చేయకుండా వారిని తమలో ఒకరిగా చేర్చుకుని కొత్త స్ట్రాటజీకి తెరదించారు. ఈ విషయాలను వైసీపీ కార్యకర్తలే సోషల్ మీడియా ద్వారా బయటకు చెబుతున్నారు. ఉదాహరణకు నెల్లూరు జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో కొందరు వైసీపీ నేతలు టీడీపీ నేతలతో కలసి రహస్యంగా వ్యాపార భాగస్వాములుగా ఉన్నారు.అయితే వైసీపీ కేంద్ర నాయకత్వం వీటిని పెద్దగా పట్టించుకోవడం లేదు.

లైట్ గానే తీసుకుంటుంది. అంతెందుకు వైఎస్ జగన్ సొంత జిల్లా కడపలోనూ అనేక మంది వైసీపీ నేతలకు టీడీపీ నేతలతో లోపాయికారీ ఒప్పందాలున్నట్లు చెబుతున్నారు. ఇవి కార్యకర్తలకు తెలుసు.

కానీ వైసీపీ నాయకత్వం మాత్రం వారిపై చర్యలకు తీసుకోవడానికి మాత్రం సిద్ధంగా లేదు. ఇలాగే కొనసాగితే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కానీ, తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో కానీ వైసీపీ నేతలు అధికార పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అవకాశం లేదన్నది వాస్తవం. ఇప్పటికైనా నాయకత్వం జాగ్రత్త పడకపోతే నష్టం స్థాయి అంచనా వేయలేని స్థితిలో ఉండనుంది.

## నాటి చంద్రబాబు కాదా...

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెతక వైఖరిని అవలంబిస్తున్నారు. గతంలో అధికారుల విషయంలో కఠినంగా వ్యవహరిం చేవారు. పార్టీ నేతలు కూడా క్రమశిక్షణ తో మెలిగేవారు. కానీ ఎందుకో.. ఏమో..తెలియదు కానీ చంద్రబాబులో చాలా మార్పు కనిపిస్తుంది. పార్టీ నేతల సంగతి పక్కన పెడితే అధికారులపై కూడా అజమాయిషీ లేకుండా పోయింది. సమీక్షల్లో సీరియస్ అనే మాటలను వినటమే కానీ.. కనీసం సమస్యకు కారణమయిన వారిపై ఎలాం టి చర్యలకు దిగకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తనలో 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తానని ప్రకటించారు. 1995 నాటి ముఖ్యమంత్రి మాటేమో కానీ, కనీసం 2014 నాటి ముఖ్యమంత్రి కూడా కనిపించడం లేదన్న కామెంట్స్ ఇప్పుడు కార్యకర్తల్లో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఎందుకంటే గత వారం రోజుల నుంచి ఆంధ్రప్రదేశ్ లో పెట్రోలు, డీజిల్ కొరత సమస్య ఉందని తెలిసినప్పటికీ అధికారుల ఉదాసీన వైఖరిని ఆయన ప్రశ్నించలేకపోతున్నారు. అదే సమయం లో రియల్ టైమ్ గవర్నెన్స్ అంటూ నిత్యం పరితపించే చంద్రబాబు ఇంత జరుగుతున్నా అది ఏం చేస్తుందన్న దానిపై కూడా నాయుడు పెదవి విప్పకపోవడం చర్చనీయాంశమైంది. నిజానికి చంద్రబాబు అధికారులను అలా ఊరికే వదిలేసే రకం కాదు. ఇరవై నాలుగు గంటలు వెంటపడి పనులు చేయించుకుంటారన్న పేరు ఆయనకు గతంలో ఉండేది.కానీ 2024 తర్వాత మాత్రం చంద్రబాబు నాయుడు పూర్తిగా మారిపోయారు. ఎంతగా మారిపోయా రంటే.. ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టడం వంటి వాటికే సరిపెట్టారు. అందులో ఎక్కువగా తన విజన్ తో పాటు తన పూర్వ విషయాలను చెప్పుకోవడమే సరిపోతుంది. అంతేతప్ప క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలు సరిదిద్దలేకపోవడం, సక్రమంగా హెచ్చరికలు జారీ చేయకపోవడం వల్లనే ఇటువంటి పరిస్థితులు తలెత్తాయని అంటున్నారు. చంద్రబాబుకు కూడా పెట్రోలు, డీజిల్ కొరత సమస్యను చెప్పకుండా దాచి పెట్టారంటే చంద్రబాబు ఇచ్చిన అలుసు మాత్రమేనని చెప్పాలి.

## కౌలు కార్డులపై రైతులకు అవగాహన కార్యక్రమం




మద్దికేర: మద్దికేర మండలంలోని పరిధిలోని గల బసనేపల్లి, హంప రెవెన్యూ గ్రామాల్లో కౌలు రైతుల కార్డుపై మంగళవారం రోజున వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి రవి మాట్లాడుతూ కౌలు రైతు కార్డు పొందడం వలన సాగుదారులకు ప్రభుత్వం నుండి వచ్చే అన్ని ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలియజేశారు.ఈ కార్డుల వలన భూ యజమానులకు ఎటువంటి నష్టం వాటిల్లదని రైతులకు ఆయన భరోసా కల్పించారు.అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పీఎండిఎస్ విధానంలో విత్తనాలను వెదజల్లుకోవడం వలన తొలకరిలో కురిసే వర్షాలకు పంటలు మొలకెత్తి రైతులకు కావలసిన మేత,భూమి భూసారం పెరుగుతుందని ఆయన తెలియజేశారు.ఈ సంవత్సరం ఎల్నినో ప్రభావం వలన తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, కనుక రైతులందరూ వర్షభావ పరిస్థితులు ఎదుర్కొనే విధంగా తక్కువ తేమ అవసరం అయ్యే పంటలు మరియు రకాలు సాగు చేయాలని ఆయన రైతులకు సూచించారు. వేసవిలో సాగుచేసిన పంటలను ఈ క్రాప్ లో నమోదు చేసుకోవాలని రైతులకు ఆయన తెలియజేశారు. అదేవిధంగా ఏపీ ఎఫ్ఆర్ రైతు రిజిస్ట్రీ సంఖ్య ప్రతి రైతు పొందాలని,దీని కొరకు స్థానిక రైతు సేవ కేంద్ర ఇన్చార్జిని సంప్రదించాలని రైతులకు తెలియజేశారు.ఇప్పటి నుండి ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి పథకానికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడి తప్పనిసరి అని, అదేవిధంగా ఏపీ ఏఐఎంఎస్ యాప్ను అందరూ రైతులు తమ చరవాణిలో ఇన్స్టాల్ చేసుకోవాలని ఆయన రైతులకు తెలియజేశారు.దీనివలన రైతులకు ముందస్తుగా పంట సమాచారం,అదేవిధంగా పంట యాజమాన్య పద్ధతులు మార్కెటింగ్ వంటి అంశాలు తెలుస్తాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ హనుమన్న,వీఏఏ ఇంద్రజ, విహెచ్ఏ అశురఫ్ భాష,ఎంపిఈఓ శ్రీకాంత్ మరియు బసనేపల్లి,హంప రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ నిర్మాణం కొరకు దాతలు సహకరించండి

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామంలో గత నెల 28వ తేదీన శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయ నిర్మాణం కొరకు ఘనంగా శంకుస్థాపన (భూమి పూజ) కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణం కొరకు నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానం నిర్మాణం కొరకు కోనంకి గ్రామానికి చెందిన పలువురు దాతలు తమ సహాయ సహకారాలు అందించినట్టు నూతన కమిటీ తెలిపింది. దేవాలయ నిర్మాణం పూర్తి అయ్యేంతవరకు దాతలు తమ వంతు సహకారం అందించవలసిందిగా కోరుతూ కరపత్రాలను విడుదల చేయడం జరిగిందని కమిటీ తెలిపింది. దాతలు ధన రూపేనా, ధాన్య రూపేనా, కనక, వస్తువు రూపేణా సహకారాలు అందించి ఈ బృహత్తర కార్యక్రమంలో మీ వంతు భాగస్తులు కావలసిందిగా నూతన కమిటీ కోరుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఈ ఆలయ నిర్మాణం కొరకు 1, స్థలదాత – బోణనీ చిన వెంకటరెడ్డికుమారుడు శ్రీనివాస రెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు సీతారామరెడ్డి ఏర్పాటు చేశారు. 2, ఫౌండేషన్ వర్క్ – నందిపాటి స్వరాజ్యం ( జ్ఞాపకార్థనీ ) కుమారుడు శ్రీనివాసరెడ్డి పూర్తి చేశారు. 3, బోరు ఒ మోటర్ కుందూరు వెంకటేశ్వర రెడ్డి కుమారుడు కుందురు చిన నర్సిరెడ్డి వేయించారు. 4, వెండి గ్లాస్ – నందిపాటి కృష్ణారెడ్డి కుమారుడు నందిపాటి శేఖర్ రెడ్డి బహుకరించారు. 5, విగ్రహ దాత – పుణ్యాల వీరారెడ్డి కుమారుడు అంజిరెడ్డి ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. 1, నందిపాటి సైదులు రెడ్డి. 2, కుందురు చైనా నర్సిరెడ్డి. 3, అన్నపరెడ్డి హనీమిరెడ్డి. 4, నందిపాటి శివారెడ్డి. 5, నందిపాటి కృష్ణారెడ్డి. 6, అనంత ఆంజనేయులు. 7, కుందురు పెద్ద నర్సిరెడ్డి. 8, నందిపాటి చిన్న అంజయ్య రెడ్డి9,

# తీరనున్న కనిగిరి ప్రాంత వాసుల కల

ఒంగోలు : పశ్చిమ ప్రకాశం, మార్కాపురం జిల్లావాసులు.. ముఖ్యంగా కనిగిరి ప్రాంత ప్రజల కలనెరవేరనుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైలు సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుంది. గుంటూరు నుంచి కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు రైల్వే అధికారులకు ప్రతిపాదనలు పంపారు. వారంలో ఆరు రోజుల పాటూ రైలును నడిపేలా ప్రతిపాదించారు. రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని.. త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రం సహకారంతో రైల్వే ప్రాజెక్టుల పనులు వేగవంతం అవుతున్నాయి. పాత ప్రాజెక్టులతో పాటుగా కొత్త ప్రాజెక్టులు కూడా ఒక్కొక్కటిగా పట్టాలెక్కుతున్నాయి. రాష్ట్రంలో కీలకమైన నడికుడి–శ్రీకాళ హస్తి రైల్వే లైన్ పనులు వేగవంతం చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లా, ప్రస్తుతం మార్కాపురం జిల్లా కనిగిరి వరకు పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పామూరు వైపుగా పనులు ముమ్మరం గా సాగుతున్నాయి. కనిగిరి వరకు రైల్వే లైన్ పనులు పూర్తికావడంతో అక్కడి వరకు రైళ్లు నడపాలని ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులతో పాటుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నా రు.. రైల్వేశాఖకు విన్నవించారు.కనిగిరివాసుల ఎన్నో ఏళ్ల కలను నిజం చేసే దిశగా ఓ ముందడుగు పడింది. నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. గుంటూరు నుంచి గుండ్లకమ్మ మీదుగా కనిగిరి వరకు ఈ రైలును నడిపేందుకు గుంటూరు రైల్వే డివిజన్ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఈ నెల 24న ఆ వివరాలు అధికారుల దగ్గరకు చేరాయి. తాజా ప్రతిపాదనల ప్రకారం వారంలో ఆరు రోజుల పాటూ గుంటూరు నుంచి కనిగిరి వరకు ఈ కొత్త సర్వీస్‌ను నడపాలని ప్రతిపాదించారు. ఈ ప్యాసింజర్ రైలు గుంటూరులో ఉదయం 8.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1 గంటకు కనిగిరి చేరుకునేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2 గంటలకు కనిగిరి నుంచి బయల్దేరి రాత్రి 7 గంటలకు గుంటూరు చేరుకునేలా ప్లాన్ చేశారు. అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే పూర్తి షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు రైలును నడపాలని గతంలోనే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రైల్వే అధికారులకు విన్నవించారు. ఇటీవల రైల్వే అధికారుతో మాట్లాడటంతో సానుకూలంగా స్పందిం చారు. కనిగిరి రైల్వే స్టేషన్ పనులు పూర్తికావడం, ప్రయాణికుల కు అవసరమైన అన్ని సౌకర్యాలు అందబాటులోకి రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేవు అంటున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా పూర్తి చేయడంతో.. కొత్తగా ప్యాసింజర్ రైలును కనిగిరి వరకు నడిపేందుకు దాదాపుగా లైన్ క్లియర్ అయినట్లేనని చెబుతున్నారు. కనిగిరి నుంచి ప్యాసింజర్ రైలు ప్రారంభమైతే ఆ ప్రాంతం నుంచి రాజధాని ప్రాంతమైన గుంటూరుకు కనెక్టివిటీ కూడా పెరుగుతుందంటున్నారు. కనిగిరి మాత్రమే కాదు పొదిలి, దర్శి ప్రాంతాల ప్రజలకు కూడా ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

# రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మాడు పగలగొడుతున్నాయి.. రాష్ట్రంలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫిబ్రవరి నెల నుంచే ఎండల తీవ్రత కనిపించింది.. ముందు 35 డిగ్రీల నుంచి మొదలై 40 డిగ్రీల వరకు చేరింది. మార్చి నెల నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగాయి.. 42 డిగ్రీల నుంచి 45 వరకు ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతులు 45 డిగ్రీలు కూడా దాటి 46 డిగ్రీల వరకు నమోదవుతోంది. ఎండలకు తోడు వేడిగాలులు, ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇవాళ అధిక ఉష్ణోగ్రతలతో పాటుగా 19 మండలాల్లో తీవ్రమైన వేడిగాలులు, 21 మండలాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉందన్నారు. విజయనగరం జిల్లాలోని బాడంగి, బొబ్బిలి, రామభద్రాపురం, తెర్లాం, వంగర మండలాల్లో.. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, సీతానగరం, వీరఘట్టం మండలాల్లో తీవ్ర వేడిగాలుల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. మార్కాపురం జిల్లా కంభంలో 45.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డైంది. నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 45.1 డిగ్రీలు, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 44.8 డిగ్రీలు, అమరావతిలో 44.2 డిగ్రీలు, తిరుపతి జిల్లా బెస్తపల్లిలో 44.2 డిగ్రీలు, కడప జిల్లా వీరబల్లిలో 44.2 డిగ్రీలు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తం 28 జిల్లాలకు గాను 20 జిల్లాల పరిధిలోని 227మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.ఏపీలో ఎండలు, వేడిగాలులు, ఉక్కపోత ప్రభావం కనిపిస్తోంది.

# అదాశర్మకు 'ది కేరళ స్టోరి' రేంజు మళ్లీ ఎప్పుడు?



భారతీయ చిత్ర పరిశ్రమలో ది కేరళ స్టోరీ సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఆ సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అదా శర్మ.. నటిగా తనలోని సత్తాను నిరూపించుకుంది. ఆ బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ట్యాలెంటెడ్ బ్యూటీకి భారీ మైలేజ్ లభించినా.. కెరీర్ పరంగా ఆశించిన స్థాయిలో తదుపరి విజయాలు నమోదు కాలేదు. ఇటీవల ఓ మూడు ప్రాజెక్టుల్లో నటించినా ది కేరళ స్టోరి రేంజులో ప్రభావం చూపకపవడం నిరాశపరిచింది. అదాలో ప్రతిభకు కొదవలేకపోయినా.. సరైన ప్రాజెక్టులు పడక రేసులో వెనుకబడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న తరుణంలో.. తాజాగా ఒక ఆసక్తికర ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. జాతీయ ఉత్తమ నటుడు మనోజ్ బాజ్‌పాయ్‌తో కలిసి అదా శర్మ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ గవర్నర్: ది సైలెంట్ సేవియర్. ఈ చిత్రానికి సంబంధించిన సరికొత్త క్యారెక్టర్ పోస్టర్లను చిత్ర యూనిట్ ఇటీవల విడుదల చేసింది. మనోజ్ బాజ్‌పాయ్ వంటి అగ్ర నటుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదా శర్మకు కెరీర్ పరంగా గొప్ప అవకాశమని చెప్పాలి. ఈ చిత్రం 12 జూన్ 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా కథాంశం భారతదేశ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో సాగే ఒక తీవ్రమైన పోరాటంగా కనిపిస్తోంది. ఇది ఒక యుద్ధం.. సైన్యాలు లేని యుద్ధం. దేశాన్ని పతనం కాకుండా కాపాడిన ఒకే ఒక్క వ్యక్తి కథ అంటూ విడుదల చేసిన ట్యాగ్ లైన్లు సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. నేను విఫలమైతే.. భారతదేశం విఫలమవుతుంది వంటి సంభాషణలు ఈ చిత్రం ఎంతటి ఉత్కంఠభరితమైన డ్రామాతో సాగుతుందో అర్థమయ్యేలా చెబుతోంది. భారతదేశం దివాళా తీసే స్థితిలో ఉన్నప్పుడు ఒక వ్యక్తి దాన్ని ఎలా కాపాడారనేదే ఈ చిత్ర ప్రధానాంశం. ఈ చిత్రానికి అమిత్ త్రివేది సంగీతాన్ని అందిస్తుండగా.. దిగ్గజ రచయిత జావేద్ అక్తర్ సాహిత్యాన్ని సమకూరుస్తున్నారు. చిన్మయ్ మాండ్లేకర్ దర్శకత్వంలో విపుల్ అమృత్‌లాల్ షా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ది కేరళ స్టోరీ తర్వాత అదా శర్మకు మళ్ళీ అలాంటి ఘనవిజయాన్ని అందించగల సత్తా ఉన్న టీమ్ ఈ సినిమా వెనుక ఉంది. మనోజ్ బాజ్‌పాయ్ నటన.. బలమైన స్క్రీన్ ప్లే తోడైతే అదా శర్మకు ఇది మరో మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. ప్రస్తుతం మనోజ్ బాజ్‌పాయ్ ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 3 విజయంతో జోరు మీదున్నారు. అటు అదా శర్మ కూడా ఈ గవర్నర్ ప్రాజెక్టుపై భారీ ఆశలే పెట్టుకుంది. విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్న అదా శర్మకు.. 2026 జూన్ నెలలో విడుదలయ్యే ఈ చిత్రం ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి. ఒకవేళ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ చేస్తే... అదా శర్మ కెరీర్ మళ్ళీ మునుపటి వేగాన్ని పుంజుకోవడం ఖాయం చారిత్రక లేదా వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందే చిత్రాలు నటీనటులకు కమర్షియల్ సినిమాల కంటే ఎక్కువ గుర్తింపును, గౌరవాన్ని తెచ్చిపెడుతున్నాయనేది వాస్తవం. కమర్షియల్ సినిమాలు కేవలం వినోదాన్ని అందించి బాక్సాఫీస్ వద్ద విజయం సాధించవచ్చు.. కానీ యదార్థ గాథలు నటీనటులకు తమలోని అసలైన నటనా ప్రతిభను నిరూపించుకునే గొప్ప అవకాశాన్ని ఇస్తాయి. ఇటువంటి పాత్రల కోసం తారలు ప్రయత్నించే శారీరక మార్పులు.. హావభావాల రీసెర్చ్.. భావోద్వేగపూరిత ప్రదర్శనలు ప్రేక్షకులలో బలమైన ముద్ర వేయడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలను .. ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డులను కూడా సంపాదించిపెడతాయి. అందుకే కేవలం స్టార్ ఇమేజ్ కోసం కాకుండా..ఒక నటిగా చరిత్రలో నిలిచిపోవాలని ఆశించే వారు తరచుగా ఇలాంటి వాస్తవిక కథాంశాలనే ఎంచుకుంటారు.

# తరతరాల భారానికి ముగింపు..



తల్లిదండ్రుల పెంపకం, పిల్లలపై ఉండే అంచనాలు.. భావోద్వేగ వారసత్వంపై నటి రష్మిక మందన్న ఇటీవల చేసిన వ్యాఖ్యలు సమాజంలో కొత్త చర్చకు దారితీశాయి. పిల్లలు పుట్టడం అనేది ఒక బాధ్యత మాత్రమే కాదు... అది మనం తీసుకునే ఒక స్వార్థపూరిత నిర్ణయం అని ఆమె పేర్కొన్నారు. మన వారసత్వాన్ని కొనసాగించడం కోసం మనం పిల్లలకు జన్మనిస్తామని..అంతేకానీ మన అంచనాలను వారిపై రుద్ది వారిని మానసిక ఒత్తిడికి (ట్రామా) గురిచేయకూడదని అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు కేవలం సెలబ్రిటీ మాటలుగా కాకుండా.. ప్రతి ఇంట్లో కనిపించే పెను ఉత్పాతాన్ని ప్రశ్నించడంగానే చూడాలి. చాలా సందర్భాల్లో పిల్లలు తమ తల్లిదండ్రుల నెరవేరని కలలకు ప్రతిరూపాలుగా మారుతుంటారు. తల్లిదండ్రులు తాము సాధించలేని విషయాలను పిల్లల ద్వారా సాధించాలని చూడటం లేదా తమకు ఎదురైన కష్టాలను పిల్లలు కూడా అర్థం చేసుకోవాలని ఆశించడం సహజమైపోయింది. అయితే రష్మిక చెప్పినట్లుగా పిల్లలు తల్లిదండ్రుల భావోద్వేగ భారాలను మోయడానికి పుట్టరు. వారు ఒక స్వతంత్ర వ్యక్తిత్వంతో పెరుగుతారని..వారిని ఒక సాధించే వస్తువుగా చూడకూడదనే స్పృహ నేటి తరంలో పెరుగుతోంది. ప్రెగ్నెన్సీ లో కూడా సత్తా చాటుతున్న బ్యూటీస్! సాంప్రదాయ పెంపకంలో పిల్లలకు విలువల పేరుతో తరచుగా తమ ఇష్టాయిష్టాలను త్యాగం చేయాలని బోధిస్తారు. కానీ.. ఈ ప్రక్రియలో తల్లిదండ్రులు ఎదుర్కొన్న గత కాలపు బాధలు.. అభద్రతాభావాలు తెలియకుండానే పిల్లలకు బదిలీ అవుతుంటాయి. దీనినే జనరేషనల్ ట్రామా అంటారు. అంటే ఒక తరం అనుభవించిన బాధలను పరిష్కరించుకోకుండా అలాగే ఉంచితే.. అవి తర్వాతి తరానికి భారంగా మారుతాయి. రష్మిక మాటలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. మనం మన గాయాలను నయం చేసుకున్న తర్వాతే.. పిల్లలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని ఇవ్వాలనేది రష్మిక ఉద్దేశం. పితృత్వం లేదా మాతృత్వాన్ని కేవలం ఒక బాధ్యతగా కాకుండా ఒక ఎంపికగా చూడాలని రష్మిక వాదించారు. పిల్లలు పుట్టమని అడగరు.. మనమే వారిని ఈ లోకంలోకి తీసుకువస్తాము అన్న మాట నిజానికి తల్లిదండ్రులపై ఉండే జవాబుదారీతనాన్ని గుర్తుచేస్తోంది. పిల్లలను తమ సొంత ఆశయాలు లక్ష్యాల పొడిగింపుగా కాకుండా.. వారి ఇండివిడ్యువాలిటీని గౌరవించినప్పుడే ఒక ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుంది. ప్రేమ అనేది విజయాల ద్వారా పొందే బహుమతి కాకూడదు.. అది సహజంగా లభించే హక్కు కావాలి అని రష్మిక సూచించారు. రష్మిక మందన్న వ్యక్తం చేసిన అభిప్రాయం సమాజానికి ఒక హెచ్చరిక లాంటిది. పిల్లలను కనడం అనేది కేవలం వంశాభివృద్ధి మాత్రమే కాదు.. అది ఒక కొత్త జీవితానికి ఇచ్చే స్వేచ్ఛ కావాలి.

# టాలెంటెడ్ పార్ట్‌నర్‌పై ప్రశంసల జల్లు!



బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడి కెరీర్ ఉత్తరాదిన దేదీప్య మానంగా సాగిపోతుంది. ఓవైపు కమర్షియల్ చిత్రాల్లో నటిస్తూనే సోలోగానూ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. కథల విషయంలోనూ అంతే సెలక్టివ్ గా ఉంటుంది. బలమైన పాత్రలైతేనే కమిట్ అవుతుంది. అలాగే వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు పంచుకోవడంలోనూ నిర్మొహమాటంగా వ్యవహరిస్తుంది. తాజాగా అమ్మడు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చేసిన ఓ పోస్ట్ తో నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. ప్రియుడు రాహుల్ మోడీ తెరకెక్కించిన ఓ వీడియోను షేర్ చేస్తూ అతడి ప్రతిభను ఆకాశానికెత్తేసింది. ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం గురించి సోషల్ మీడియాలో చాలా కాలంగా చర్చ జరుగుతోన్న నేపథ్యంలో తాజా పోస్ట్ దానికి మరింత బలాన్ని చేకూర్చింది. రాహుల్ మోడీ దర్శకత్వం వహించిన ప్రకటనలో నటి అనీత్ పద్దా నటించారు. ఈ వీడియోను చూసిన శ్రద్ధా కపూర్, రాహుల్ సృజనాత్మకతకు ఫిదా అయింది. -టాలెంటెడ్- అనే క్యాప్షన్‌తో పాటు హార్ట్ ఎమోజీని జోడించి ఆనందాన్ని పంచుకున్నారు. యాడ్ లో నటించిన అనీత్ పద్దా పనితీరును కూడా ప్రత్యేకంగా మెచ్చుకుంది. శ్రద్ధా ఇలా బహిరంగంగా తన పార్ట్‌నర్‌కు మద్దతు పలకడంతో ఇద్దరి మధ్య ప్రేమ పరుగులు పెడుతుందంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. ప్రెగ్నెన్సీ లో కూడా సత్తా చాటుతున్న బ్యూటీస్! గతంలో ఇద్దరు జంటగా వెకేషన్లకు వెళ్లిన ఫోటోలు, అనంత్ అంబానీ వివాహ వేడుకల్లో కలిసి కనిపించిన దృశ్యాలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. అయితే శ్రద్ధా ఈ రిలేషన్ షిప్ గురించి ఎక్కడా స్పందించింది లేదు. కానీ సమయం వచ్చిన ప్రతీ సదర్భంలోనూ ఇలాంటి చిన్న చిన్న సంకేతాల ద్వారా అభిమానులకు హిట్ ఇస్తూనే ఉంది. రాహుల్ పనిని గౌరవించడం తో వారి మధ్య ఉన్న బలమైన బంధానికి ఇదో నిదర్శనంగా నిలుస్తుంది. రాహుల్ మోడీ చిత్ర పరిశ్రమలో రచయితగా, దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. లఘు చిత్రాలకు రూ.15 లక్షల బహుమానం శ్రద్ధా కపూర్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్లలో ఒకటిగా నిలిచిన తూ ఝూతీ మే మక్కార్ చిత్రానికి కథా రచయితగా పనిచేశారు. ఆ సినిమా షూటింగ్ సమయంలోనే ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఆ పరిచయమే ప్రేమగా మారిందంటారు. అప్పటి నుంచి వృత్తిపరంగా ఒకరికొకరు సహకరించుకుంటూనే వ్యక్తిగత జీవితంలో కూడా ఒకరి విజయాలను మరొకరు సెలబ్రేట్ చేసుకోవడం హైలైట్ గా మారింది. శ్రద్ధా కపూర్ సినిమాల విషయానికి వస్తే చివరిగా స్త్రీ 2 తో భారీ విజయం అందుకుంది.రెండేళ్ల క్రితం రిలీజ్‌అయిన చిత్రమిది. అప్పటినుంచి మరో సినిమాకు కమిట్ అవ్వలేదు.

# వయసు కేవలం సంఖ్యే..

## 56లో ఫిట్‌నెస్‌తో అదరగొట్టిన జెన్నిఫర్ లోపెజ్



: హాలీవుడ్ పాప్ స్టార్ జెన్నిఫర్ లోపెజ్ మరోసారి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. 56 ఏళ్ల వయసులో కూడా ఆమె తన పర్ఫెక్ట్ ఫిజిక్ మరియు సిక్స్ ప్యాక్ అబ్స్‌తో ఫిట్‌నెస్‌కు కొత్త అర్థం చెబుతున్నారు. జిమ్‌లో తీసుకున్న ఆమె లేటెస్ట్ మిర్రర్ సెల్ఫీలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వయసు పెరుగుతున్నా తన క్రేజ్ మరియు ఫిట్‌నెస్ ఏమాత్రం తగ్గలేదని, ఆమె తన క్రమశిక్షణతో మరోసారి నిరూపించారు. ఆ విశేషాలు చూద్దాం.. జిమ్ సెల్ఫీతో ప్రకంపనలు: జెన్నిఫర్ లోపెజ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలు చూసి నెటిజన్లు నోరెళ్లబెడుతున్నారు. ఈ వయసులో కూడా అంతటి బాడీని మెయింటైన్ చేయడం సామాన్యం కాదు. క్రాప్ టాప్ మరియు జిమ్ టైట్స్ ధరించిన ఆమె, తన కండలు తిరిగిన శరీరాన్ని ప్రదర్శించారు. ఈ ఫోటోకు పెద్దగా క్యాప్షన్లు కూడా పెట్టలేదు, కేవలం ఒక బైసెప్ ఎమోజీని పెట్టి తన పవర్ ఏంటో చూపించారు. జెన్నిఫర్ లోపెజ్ జీవితం చూస్తుంటే వయసు అనేది కేవలం మన మెదడులో ఉండే ఒక సంఖ్య మాత్రమే అనిపిస్తుంది. సరైన తిండి, క్రమం తప్పని వ్యాయామం ఉంటే 50 దాటిన తర్వాత కూడా 20 ఏళ్ల యువతిలా కనిపించవచ్చని ఆమె నిరూపిస్తున్నారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు ఆమె ఒక ఇన్స్పిరేషన్‌గా నిలుస్తున్నారు. మొత్తానికి జెన్నిఫర్ లోపెజ్ తన 'హ్యాపీ ఎరా'ను ఎంజాయ్ చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తూనే ఉన్నారు!

# కంటోన్మెంట్ లో ఎస్సీ జనాభా లెక్కల్లో భారీ వ్యత్యాసం



## జాతీయ కమిషన్ సీరియస్

## ఫిర్యాదు చేసిన సంకి రవీందర్ బాబు

కంటోన్మెంట్: మే 1(ప్రజా కలం ప్రతినిధి

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని షెడ్యూల్డ్ కులాల (SC) జనాభా గణాంకాల్లో తీవ్రమైన వ్యత్యాసం చోటు చేసుకున్న దని సంకి రవీందర్ బాబు జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో ఎస్సీ జనాభా అసాధారణంగా తగ్గినట్లు నమోదైన గణాంకాల పై సంకి రవీందర్ బాబు అందించిన ఫిర్యాదును కమిషన్ అధికారికంగా స్వీకరించింది. ఈ మేర కు తెలంగాణ జనగణన కార్యాలయం, జిహెచ్ఎంసి కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ, రాబోయే 10 రోజుల్లో పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఒకవేళ నిర్ణీత గడువు లోగా స్పందించని పక్షంలో సమన్లు జారీ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసు కుంటామని కమిషన్ హెచ్చరించింది. ఈ సందర్భంగా సంకి రవీందర్ బాబు మాట్లాడుతూ.. 2001 నుండి 2011 మధ్య కాలంలో నియోజ కవర్గ మొత్తం జనాభా 5.72 శాతం పెరిగినప్పటికీ, ఎస్సీ జనాభా మాత్రం ఏకంగా 25.39 శాతం తగ్గినట్లు రికార్డు ల్లో చూపడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు.

క్షేత్రస్థాయిలో మాల, మాదిగ, ఆర్వా మాల వంటి ఎస్సీ వర్గాలు నియోజక వర్గ జనాభాలో దాదాపు నాలుగో వంతు ఉన్నారని, అయిన ప్పటికీ అధికారిక లెక్కల్లో గణనీయమైన తగ్గుదల కనిపిం చడం గణన ప్రక్రియ లోని లోపాలను ఎత్తిచూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఇటువంటి తప్పుడు గణాంకాల వల్ల భవిష్యత్తులో ఈ వర్గా లకు అందాల్సిన సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రతిని ధిత్వం సామాజిక న్యాయంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన పేర్కొన్నారు. జనగణనలో జరిగిన ఈ తప్పిదాలపై తక్షణమే లోతైన దర్యాప్తు జరపాలని, రాబోయే జనగణన ప్రక్రియ లో డేటా తప్పులు దొర్లకుండా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయా లని రవీందర్ బాబు డిమాండ్ చేశారు.

గణాంకాలను ధృవీకరించడానికి క్రాస్ చెకింగ్ విధానాన్ని అమలు చేయా లని కోరారు. ఎస్సీ వర్గాల హక్కుల రక్షణ కోసం ఖచ్చితమైన జనగణన అవస రమని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మం లో జి. రమేష్,సాయి కుమార్, అం బాల శ్రీనివాస్, కనుకల మహేష్ కుమా ర్, నవీన్ కుమార్, సంతోష్, దామోదర్, కృష్ణ, మహమ్మద్ ఫసి తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కు శుభాకాంక్షలు తెలియచేసిన నీరుడి స్వామి

గజ్వేల్ :30ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

తెలంగాణ ఉద్యమకారుడు రథసారథి ఆచార్యులు ప్రొఫెసర్ కోదండరాం కు ఎమ్మెల్సీ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా హైదరాబాద్ లో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన సిద్దిపేట జిల్లా ఇన్చార్జి బైరి రమేష్ తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు నీరుడి స్వామి తెలంగాణ జన సమితి యువజన విభాగ అధ్యక్షులు కీసర స్వామి. ఈ సందర్భంగా టీజేఎస్ నాయకులు గజ్వేల్ లోని కొన్ని విషయాలను కోదండరాం వివరించడం జరిగింది,మరి ముఖ్యంగా మల్లన్న సాగర్ భూ నిర్వాసితుల నష్టపరిహారం ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరగాలని ప్రొఫెసర్ కోదండరాం ని కోరారు. ప్రాజెక్టుల పేరుతో మల్లన్న సాగర్ బాధితుల విషయంలో పూర్తిగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకుండా అనేక మందిని ఇబ్బందులకు గురిచేసిందని వారి ఆవేదన ను గత ప్రభుత్వం ఎప్పుడు కూడా పట్టించుకోలేదని ఇప్పటికి కూడా అనేకమందికి నష్టపరిహారం అందక ఇబ్బంది పడుతున్నారని మనం తెచ్చుకున్నటువంటి ఈ ప్రజా ప్రభుత్వం లో న్యాయం జరగాలని దాని గురించి ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

# సెల్ టవర్ ఏర్పాటు ప్రజల ప్రాణాలకు ముప్పు

## ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా సెల్ టవర్ నిర్మాణం

## తుక్కుగూడలో సెల్ టవర్ నిర్మాణం పట్ల ప్రజల వ్యతిరేకత

## తుక్కుగూడలో సెల్ టవర్ ఏర్పాటు చేయకుండా చూడాలి స్థానిక ప్రజల డిమాండ్









మహేశ్వరం ఏప్రిల్ 30,(ప్రజా కలం)

సెల్ టవర్ ఏర్పాటు ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని తుక్కుగూడ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఎలాంటి అనుమతులు లేకుండా శంషాబాద్ జోన్ తుక్కుగూడలో సాయి తేజస్ చల్లాస్ ఎలర్ట్ పక్కనే ఓ చిన్న గృహం పెద్ద సెల్ టవర్ వేయడానికి ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో స్థానిక ప్రజలు అప్రమత్తమయ్యారు. వెంటనే పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు,అలాగే శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ కు స్థానికులు ఫిర్యాదు చేశారు. అధికారులు వెంటనే స్పందించి సెల్ టవర్ ను జనావాసాల మధ్య నుండి నిర్మానుష్య ప్రదేశానికి తరలించాలని కోరారు.సెల్ టవర్ వేసే చుట్టూ ప్రాంతంలో సుమారు వెయ్యి మందికి పైగా కుటుంబాలు ఉన్నాయని అన్నారు.చిన్న పిల్లలు, వృద్ధులకు సెల్ టవర్ ను డి వచ్చే రేడియేషన్ వల్ల అనారోగ్యానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సెల్ టవర్ నిర్మించే ఇంటికి టవర్ వేయకముందే ప్రస్తుతం గోడలు పగుళ్లు వచ్చాయి సుమారు వెయ్యి కిలోలు బరువున్న సెల్ టవర్ నిర్మిస్తే ప్రమాద వశాత్తూ గాలి వానలకు కూలి పోతే ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది కాబట్టి దధికారులు తక్షణమే జనావాసాల మధ్య నిర్మాణం చేస్తున్న సెల్ టవర్ ను ఇక్కడ వేయడానికి అనుమతులు ఇవ్వకూడదని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సెల్ టవర్ ఏర్పాటు వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని ప్రజల ఆందోళన దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## రాజగోపాల్ రెడ్డి కవితక్కకు తక్షణమే క్షమాపణ చెప్పాలి :

### నూతన టీఆర్ఎస్ నేత కొట్టాల యాదగిరి

గజ్వేల్ :30 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కవితక్కపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నూతన



టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి తీవ్రంగా ఖండించారు.గజ్వేల్ నియోజకవర్గంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి రాకపోయిన నిరాశ, ఆవేదనతోనే మతిభ్రమించి ఇలాంటి అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.రాజకీయాల్లో విమర్శలు చేయడం సహజమే కానీ మహిళలపై వ్యక్తిగత దాడులు చేయడం నీచమైన మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు.తెలంగాణ ఆడబిడ్డపై నోరు పారేసే ముందు తన ఇంట్లో ఉన్న అక్కచెల్లెళ్లు,తోబుట్టువులు,సతీమణిని కూడా ఆడపడుచులుగా భావించి మాట్లాడే సంస్కారం నేర్చుకోవాలని హెచ్చరించారు. కవితక్కపై చేసిన వ్యాఖ్యలు తెలంగాణ మహిళలందరినీ అవమానించినట్లేనని కొట్టాల యాదగిరి స్పష్టం చేశారు.పూటకో పార్టీ. పూటకో మాట మాట్లాడే రాజగోపాల్ రెడ్డి రాజకీయ భవిష్యత్ కోసం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మహిళా నాయకురాలిపై చేసిన దుష్ప్రచారం వెంటనే ఆపాలని, రాజగోపాల్ రెడ్డి తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.లేదంటే తెలంగాణ మహిళలు, ప్రజాసంఘాలు తగిన రీతిలో గుణపాఠం చెబుతాయని హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో ఎడ్ల నర్సింలు, నరేందర్ రెడ్డి,రాజయ్య, శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల పునఃపరిశీలన..!

## ఐటీఆర్ ఫైల్ చేసిన లబ్ధిదారుల్లో ఆందోళన..! - చిరు వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, స్వయం ఉపాధి వర్గాల్లో అనిశ్చితి...!




హైదరాబాద్ : తెలంగాణలో రేషన్ కార్డుల పునఃపరిశీలన ప్రక్రియ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. క్షేత్రస్థాయి లో అధికారులు చేపడుతున్న తనిఖీలు, ఆదాయ ప్రమాణాల ఆధారంగా అర్హతల పరిశీలన, ఇప్పటికే గణనీయ సంఖ్యలో కార్డుల తొలగింపు పరిణామాలు లబ్ధిదారుల్లో ఆసక్తితో పాటు ఆందోళనను కూడా కలిగిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, స్వయం ఉపాధి వర్గాల్లో అనిశ్చితి కనిపిస్తోంది. రేషన్ కార్డు వ్యవస్థ పేద మరియు తక్కువ ఆదాయం గల కుటుంబాలకు ఆహార భద్రతను అందించే కీలక సంక్షేమ పథకం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 లక్షలకుపైగా కార్డులు అమలులో ఉన్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో అర్హతల పునఃపరిశీలన ప్రక్రియ ప్రారంభమవడం సహజంగానే పెద్ద చర్చకు దారితీసింది.ప్రభుత్వం దృష్టిలో ఈ చర్యల ఉద్దేశం సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజంగా అర్హులకే చేరేలా చూడడం. డూప్లికేట్ ఎంట్రీలు, ఆదాయ మార్పులు, అనర్హ కార్డులను గుర్తించడం ద్వారా వ్యవస్థలో పారదర్శ కత పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

ఈ క్రమంలో ఆదాయానికి సంబంధించిన సూచికలుగా ఐటీ రిటర్న్లు వంటి ఆధారాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం.అయితే, ఐటీ రిటర్న్ దాఖలు చేయడం ఒక్కటే అధిక ఆదాయం ఉన్నదనే సూచిక కాదన్న వాదన వినిపిస్తోంది. బ్యాంకు రుణాలు, ఉద్యోగ అవసరాలు, పన్ను రీఫండ్ వంటి కారణాలతో తక్కువ ఆదాయం గల వ్యక్తులు కూడా రిటర్న్లు దాఖలు చేస్తుంటారు. కాబట్టి ఒకే ప్రమాణం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటే కొన్ని సందర్భాల్లో నిజమైన అర్హులు జాబితా నుంచి తప్పిపోవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది.క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిశీలన విధానంపై కూడా కొన్ని ప్రశ్నలు లేవుతున్నాయి. గ్రామ లేదా వార్డు స్థాయిలో అధికారులు డిక్లరేషన్లు తీసుకోవడం, ఆదాయాన్ని అంచనా వేయడం వంటి ప్రక్రియల్లో ప్రాంతాను సారంగా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియ వేగంగా కొనసాగుతుం డటంతో ప్రజల్లో అనిశ్చితి పెరిగింది.ఇదే సమయంలో ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను కూడా చేపడతామని ప్రకటించింది. పాత కార్డుల పరిశుభ్రీకరణతో పాటు కొత్త అర్హుల చేర్పుఈ రెండు ప్రక్రియలు సమాంతరంగా కొనసాగుతున్నాయి.

దీనివల్ల వ్యవస్థను సమతుల్యంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని భావించ వచ్చు.సంక్షేమ పథకాల నిర్వహణలో మరో ముఖ్యమైన అంశం ఆర్థిక భారం. సబ్సిడీ వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో లీకేజీలను నియంత్రించడం ప్రభుత్వాల ముందున్న ప్రధాన సవాలు. ఈ దృష్టితో అర్హతల పునఃపరిశీలన అవసరమనే అభిప్రాయం కూడా ఉంది. అయితే, ఈ ప్రక్రియలో "ఎక్స్‌క్లూజన్ ఎరర్" అంటే అర్హుల తొలగింపు జరగకూడదన్నది నిపుణుల సూచన.

ఇలాంటి సందర్భాల్లో కొన్ని జాగ్రత్తలు అవసరం. కార్డు రద్దు ముందు లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడం, వివరణకు అవకాశం కల్పించడం, అప్పీల్ వ్యవస్థను అందుబాటులో ఉంచడం వంటి చర్యలు పారదర్శకతను పెంచుతాయి. అదేవిధంగా, అర్హతల నిర్ధారణలో ఆదాయం మాత్రమే కాకుండా జీవన ప్రమాణాలు, ఆస్తులు, సామాజిక పరిస్థితులు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.మొత్తానికి, రేషన్ కార్డు పునఃపరిశీలన ప్రక్రియ ఒక పరిపాలనా అవసరంగా కనిపించినప్పటికీ, దాని అమలు విధానం కీలకం. అనర్హులను గుర్తించడం ఎంత ముఖ్యమో, అర్హులకు నష్టం జరగకుండా చూడడం అంతే ముఖ్యమైనది. పారదర్శకత, స్పష్టత, సమగ్ర పరిశీలన ఈ మూడు అంశాలు సమతుల్యంగా అమలైతేనే ఈ ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

## హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నూతన అమరవీరుల స్మారక బ్యారక్ సిబ్బంది విశ్రాంతి భవనాన్ని ప్రారంభించిన పోలీసు కమిషనర్ గౌష్ ఆలం

కరీంనగర్ : హైదరాబాద్ పోలీస్ సిబ్బంది సంక్షేమం మరియు వారి వసతి సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం హుజూరాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన "అమరవీరుల స్మారక బ్యారక్ సిబ్బంది విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ,వారి గౌరవార్థం ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. నిరంతరం ప్రజల రక్షణ కోసం శ్రమించే పోలీస్ సిబ్బందికి మెరుగైన వసతి, మౌలిక సదుపాయాలు కల్పించడం వల్ల వారు మరింత ఉత్సాహంతో విధులు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం మరియు సౌకర్యాల విషయంలో రాజీ పడకుండా, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పని వాతావరణాన్ని ఆధునీకరిస్తామని సీపీ హామీ ఇచ్చారు. తగిన వసతి సౌకర్యాలు ఉన్నప్పుడే అధికారులు అత్యవసర సమయాల్లో మరియు ప్రజలకు సేవ చేయడంలో మరింత సమర్థవంతంగా పనిచేయగలరని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ వి.మాధవి, స్థానిక ఇన్స్పెక్టర్లు కరుణాకర్, శ్రీనివాస్, రామకృష్ణ, ఎస్సైలు ఆవుల తిరుపతి, స్వాతి, క్రాంతి లతో పాటు ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్.

సిద్దిపేట ప్రజాకలం ఏప్రిల్ 30.

రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త నామసని రాజనర్సింలు కుమారుని వివాహం బుధవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని జివిఎల్ఆర్ గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ వేర్వేరుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాయపోల్ మండల తాజా మాజీ జెడ్పిటిసి సభ్యులు లింగాయపల్లి యాదగిరి, బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు కర్నాల సత్యనారాయణ, కొత్తపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు రాజారాం మధు, బాల్ నర్సయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు రాజిరెడ్డి, చేగుంట మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సర్పంచులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





## మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం

### నూతన కోఆప్షన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్ చేరు ఏప్రిల్ 30 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు ఇంద్రేశం జిన్నారం మున్సిపాలిటీల పరిధిలో గురువారం నిర్వహించిన నూతన కోఆప్షన్ సభ్యుల ఎంపిక అనంతరం.. మున్సిపల్ పాలకవర్గం సభ్యులతో కలిసి నూతనకో ఆప్షన్స్ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమపై నమ్మకంతో కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికకు సంపూర్ణ సహకారం అందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎంతో నమ్మకంతో ఐదు మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారని.. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మున్సిపాలిటీల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్ ప్రమీల, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్లు హరీష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు అంతి రెడ్డి, రామచంద్రా రెడ్డి, వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## వరిధాన్యం దిగుమతిలో జాప్యం వద్దు

### జిల్లా కలెక్టర్ హైమావతి.

సిద్దిపేట ప్రజాకలం, ఏప్రిల్ 30

వరిధాన్యం దిగుమతిలో ఎలాంటి జాప్యం చేయకూడదని, మిల్లులో ఉన్న స్థలాన్ని అనుసరించి తగినంత ధాన్యం దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు. గురువారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని బాయిల్డ్ రైస్ మిల్లుల ప్రతినిధులు, సివిల్ సప్లై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జిల్లాలో 12,936 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు సివిల్ సప్లై అధికారి తనూజ తెలిపారు. జిల్లాలోని 419 కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం కొనుగోలు సజావుగా కొనసాగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ధాన్యంలో తేమ శాతం సరైన స్థాయికి వచ్చిన తర్వాత తప్పనిసరిగా తాలు తీసినప్పుడే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు తెలియజేశారు. మిల్లులకు చేరే లారీలను ఆలస్యం కాకుండా దిగుమతి చేయడానికి తగిన సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసి వేగవంతంగా పని చేయాలని మిల్లర్లకు సూచించారు. మిల్లులకు వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే వేరుగా నిల్వ చేసి అధికారులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం అధికారులు ధాన్యాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. తాలు తీసిన ధాన్యం మాత్రమే మిల్లులకు చేరేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, ఏవైనా సమస్యలు ఉంటే ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ధాన్యం గ్రేడ్ నిర్వహణను వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. అధికారులు, మిల్లర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి రైతులకు కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అలాగే అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా లారీలను అందుబాటులో ఉంచాలని, ఎక్కడా కొరత లేకుండా ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.

### కన్న తండ్రి బాధ గురించి మాట్లాడే

# "పెంపుడు బ్యాచ్"కు సూటి ప్రశ్నలు

### తెలంగాణ రాష్ట్రసేన అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి నిలదీత



మహేశ్వరం, ఏప్రిల్ 30, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా: "కన్న తండ్రి మనసు బాధపడుతుంది" అంటూ రాజకీయాల కోసం మొసలి కన్నీరు కారుస్తున్న బిఆర్ఎస్ నాయకులకు వారి అనుయాయులకు తెలంగాణ రాష్ట్రసేన అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి కొన్ని పదునైన ప్రశ్నలు సంధించారు. పెంపుడు జంతువుల్లా యజమానుల మెప్పు కోసం మొరిగే వారు, ఈ క్రింది వాస్తవాలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సస్పెన్షన్ వేటు వేసినప్పుడు తండ్రి ప్రేమ ఏమైంది?: సొంత బిడ్డ కవితమ్మను పార్టీ నుండి సస్పెండ్ చేసినప్పుడు, ఒక తండ్రిగా కేసీఆర్ కనీసం బాధ అనిపించలేదా ఆ నిర్ణయం తీసుకున్నప్పుడు తండ్రి మనసు ఎక్కడకు పోయింది.

దుబాయ్‌లో ఉండే కొందరు కేటుగాళ్లు కవితమ్మను అనరాని మాటలు అంటుంటే, సాక్షాత్తు తండ్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ గారికి బాధ కలగలేదా? ఎందుకు వారిపై చర్యలు తీసుకోలేదు కేవలం రాజకీయ కక్షతో కవితమ్మను 6 మాసాల పాటు తీహార్ జైల్లో పెట్టినప్పుడు, ఆ తండ్రి మనసు విలవిల లాడలేదెందుకు? కన్న కూతురు జైలు పాలవుతుంటే కనీసం స్పందించలేని నిస్సహాయతకు కారణమేంటి "నా మీద కుట్రలు జరుగుతున్నాయి" అని కవితమ్మ స్వయంగా బిఆర్ఎస్ భవన్‌లోనే ఆవేదన వ్యక్తం చేసినప్పుడు, ఆ మాటలు విన్న కేసీఆర్ గారికి బాధ కలగలేదా "అన్నకు రాఖీ కట్టడానికి వస్తున్నా" అని చెల్లెలు చెబుతుంటే, ఆమెను చూడకుండా పారిపోయిన కేటీఆర్‌ను చూసి ఒక తండ్రిగా కేసీఆర్ ఎందుకు బాధపడలేదు ఇది ఏ రకమైన కుటుంబ అనుబంధం సొంత ఇంటి అల్లుడి ఫోన్‌నే ట్యాపింగ్ చేయించినప్పుడు,

ఆ తండ్రికి లేదా ఆ మామకు అల్లుడిపై కనీస నైతిక బాధ అనిపించలేదా తీన్మార్ మల్లన్న లాంటి వ్యక్తులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నప్పుడు, తన బిడ్డ గౌరవానికి భంగం కలుగుతుంటే కేసీఆర్ గారు ఎందుకు మౌనంగా ఉన్నారు ఇన్ని అవమానాలు, ఇన్ని కుట్రలు కళ్ళముందే జరుగుతున్నా, కనీసం స్పందించలేకపోతున్నానని కేసీఆర్ గారు ఎప్పుడైనా బాధపడ్డారా "నిజమైన బాధ బిడ్డ జైలుకు వెళ్ళినప్పుడు ఉండాలి, సొంత పార్టీలోనే అవమానాలు ఎదురైనప్పుడు ఉండాలి. అంతేకానీ, రాజకీయ లబ్ధి కోసం ఇప్పుడు 'తండ్రి మనసు' అంటూ డ్రామాలు ఆడటం ఆపాలి. పైన అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం బిఆర్ఎస్ నాయకులకు ఉందా?" అని కప్పాటి పాండురంగా రెడ్డి సవాల్ విసిరారు.

## అంగడిపేట హనుమాన్ దేవాలయానికి విరాళం అందజేసిన కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్

### ఘనంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

గజ్వేల్ :30 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ అంగడిపేట హనుమాన్ దేవాలయంలో మరకత లింగేశ్వర సహిత శివ పంచాయతన నవగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలకు దాతలు విరాళాలు అందజేస్తున్నారు గురువారం హనుమాన్ స్వామిని



దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి 25వేల రూపాయల విరాళం అందజేసిన 20వ వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ హనుమాన్ స్వామి అనుగ్రహం ఉండాలని అంగడిపేట్ హనుమాన్ దేవాలయం పునరుద్ధరణలో భాగస్వామ్యం కావడం తన అదృష్టమని అన్నారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి సేవా భావం కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణశర్మ మోహన్ శర్మ నాయకులు గుడాల దామోదర్ దుబకుంట లక్ష్మణ్ కైలాస ప్రభాకర్, శ్రీనివాస్, బెజరామరాజు విజయ్, దూబకుంట ప్రభాకర్, గాలయ్య, కైలాస ప్రశాంత్ బైరి రవి, నర్సింలు, సూరజ్, లింగోజీ, హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

## మాజీ సైనికుల రావలసిన ఆర్థిక పరమైన విషయం పై మంత్రి బట్టి విక్రమార్కని కలిసిన సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ యన్ ఆర్ బాబు

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ , ఏప్రిల్ 30,(ప్రజా కలం)

తెలంగాణా సైనిక సంక్షేమ శాఖ నూతనంగా నియమించ బడిన డైరెక్టర్ బ్రిగేడియర్ యన్. ఆర్. బాబు, మాజీ సైనికుల రావలసిన



ఆర్థిక పరమైన అంశాల గురించి మొదటిసారిగా ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క గారితో వారి క్యాంపు కార్యాలయములో కలిసి వారికి పూల గుత్యాన్ని అందించి వారి తో మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణా సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ వారు రెండవ ప్రపంచ యుద్ధములో పనిచేసిన వారికి ఆర్థిక సహాయం కొన్ని బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని, యుద్ధవితంతువులకు మరియు గ్యాలంటరి అవార్డు సాధించిన వారికి ఇవ్వాల్సిన పారితోషికం త్వరగా ఇంపించాలని వారి దృష్టికి తేవడం జరిగింది. గౌరవ ఉపయోగం ముఖ్యమంత్రి వెంటనే స్పందించి వెంటనే వాటికి నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. అదేవిదంగా జిల్లా కార్యాలయాలకు రావలసిన బకాయిలను విడుదల చేయాలని కోరిన్నారు దానికి కూడా ఉప ముఖ్య మంత్రి వర్యులు వెంటనే సానుకూలంగా స్పందించిన్నారు. మాజీసైనిక కార్పొరేషన్ తెలంగాణా లో ఏర్పాటు చేయుటకు సహకరించాలని కోరిన్నారు మరియు తెలంగాణా సైనిక సంక్షేమ శాఖ లోని అధికారుల కాళీలను భర్తీ చేయుటకు ఫైనాన్స్ అనుమతి ఇప్పించాలని కోరిన్నారు. ఆర్థిక పరమైన అన్ని విషయాలలో ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతమని చెప్పినందుకు వారికి ధన్యవాదములు తెలిపారు. ఈ సమావేశంలో లో రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి కూడా పాల్గొన్నారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

### రేణుకా ఎల్లమ్మతల్లి అనుగ్రహం అందరిపై ఉండాలి - రవిగౌడ్

గజ్వేల్:30 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని క్యాసారంలో గౌడసంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కన్నుల పండుగగా నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంజాల రవి గౌడ్ మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుందని గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారని నిర్వాహకులను అభినందిస్తూ సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా అంగడిపేట హనుమాన్ దేవాలయంలో మరకత లింగేశ్వర విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

### శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ప్రవచనం

గజ్వేల్:30 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ లో ప్రసిద్ధిగాంచిన అంగడిపేట హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో భక్తుల సహకారంతో నూతనంగా మరకత లింగేశ్వర శివ పంచాయతన సహిత నవగ్రహ యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట మహోత్సవము నిర్వహిస్తున్నారు. గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు, వేద స్వస్తి, అవాహిత దేవతాపూజ, హోమం నిర్వహించారు. శ్రీ శ్రీ శ్రీ మాధవనంద సరస్వతి స్వామి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు మహా అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు విఠల మురళి మోహన్ శర్మ మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం శ్రీ సీతారామ, పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని. కావున ఎక్కువ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు, ఈ కార్యక్రమంలో కృష్ణ శర్మ, మోహన్ శర్మ, నాయకులు గుడాల దామోదర్, దుబకుంట లక్ష్మణ్, కైలాస శ్రీనివాస్, బెజుగామ రాజు, విజయ్, హరి,





ప్రభాకర్, శ్రీహరి, కాపర్తి వైకుంఠం, కైలాస ప్రశాంత్, షేర్ల నర్సింలు, బైరి రవి, సూరజ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు

## కౌలు రైతు కుటుంబానికి ఆర్థిక చేయూత

గజ్వేల్ :30 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ మండలం జలిగామ గ్రామానికి చెందిన కౌలు రైతు గుడిసె లక్ష్మణ్ కుటుంబానికి ఆర్థిక చేయూత సంస్థ సహాయం అందించింది. గత నెలలో మరణించిన లక్ష్మణ్ కుటుంబాన్ని పరామర్శిస్తూ, సంస్థ ప్రతినిధులు 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు మరియు నగదు ఆర్థిక సహాయం అందజేశారు. లక్ష్మణ్ సుమారు 10 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని జీవనం సాగించే వాడు.



గత సంవత్సరం పంట నష్టాలు, ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా ప్రభావితం చేయడంతో లక్ష్మణ్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆయన మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది. మృతుడికి భార్య, ఇద్దరు సీజన్న పిల్లలు ఉన్నారు. వారి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఆర్థిక చేయూత సంస్థ ముందుకు వచ్చి సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు స్వామి, సభ్యులు మంకిడి కరుణాకర్, దప్పు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# 44 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

## - కేసు నమోదు చేసిన ఎస్ఐ మహేష్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30 ప్రజా కలం : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న 44 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం...యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం కేకే తండా గ్రామానికి చెందిన లావుడియా శ్రీనివాస్ అనే వ్యక్తి ఉప్పల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రజల వద్ద నుండి తక్కువ ధరకు పిడిఎస్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, నిజామాబాద్, బోధన్ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడని పోలీసులకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు గురువారం ఉదయం సుమారు 7 గంటలకు ఎల్లారెడ్డి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, శివనగర్ ప్రాంతంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న శ్రీనివాస్‌ను పట్టుకున్నామన్నారు. అతనితో పాటు ఉన్న చరణ్ అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మరో వ్యక్తి నరేష్ అక్కడి నుండి పరారయ్యాడన్నారు. పిడిఎస్ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# సర్వే నిర్వాహణకు గ్రామస్తులు సహకరించాలి- ఆర్డీవో ప్రభాకర్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ గ్రామం అటవి ప్రాంతంతో అనుసంధానమై ఉన్నందున ప్రభుత్వం నిర్వహించే సర్వేకు గ్రామస్తులంతా



సహకరించాలని ఎల్లారెడ్డి ఆర్ డి ఓ ప్రభాకర్ అన్నారు. గురువారం వెంకటాపూర్ గ్రామంలో భూభారతి భూ సర్వే స్థానిక సర్పంచ్ అయ్యాల సాయిలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గ్రామస్తులు, రైతులు కలిసికట్టుగా ఉండి సరిహద్దులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం తాసిల్దార్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ... మారుమూల గ్రామమైన వెంకటాపూర్కు భూ సమస్యలపై ఉపయోగపడే మ్యాపు లేనందున ప్రభుత్వం నిర్వహించే సర్వేకు గ్రామస్తులందరూ సహకరించి గ్రామ శివారు హద్దులు గుర్తించి మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, డీటి శ్రీనివాస్, ఎం పి ఓ ప్రకాష్, జిల్లా, మండల సర్వేయర్లు గోపాల్, ఏపిఓ వినోద్, జిపిఓ గంగారం, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మినీ ట్యాంక్ బండ్ పరిసరాలను శుభ్రం చేయించిన ఇరిగేషన్ డి ఈఈ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువు కట్ట మినీ ట్యాంక్ బండ్ పరిసరాల్లో కలుపు మొక్కల పెరుగుదల నివారించడానికి, పారిశుధ్యం, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల నిర్వహణ కు ప్రాధాన్యత ఇస్తూ మినీ ట్యాంక్ బండ్ పరిసరాలను గురువారం ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... నిల్వ ఉన్న నీటిలో దోమలు గుడ్లు పెడతాయని , ట్యాంక్ బండ్ పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ కప్పులు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయకూడదని అన్నారు. చెత్త పేరుకుపోతే కీటకాలు, దోమలు పెరుగుతాయని, దీంతో రోజు చెరువు వద్దకు వచ్చే పర్యాటకులకు వీటి వల్ల అనారోగ్యానికి గురైయ్యే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని నిత్యం ట్యాంక్ బండ్ పరిసరాలను శుభ్ర పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏ ఈ రాజేష్ , సిబ్బంది పాల్గొన్నారు.



# పది ఫలితాలలో విజయ దుందుబి

## మోగించిన మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

## -కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల ఫలితాలు.

## -ఉత్తీర్ణత శాతం (99%) అభినందనీయం..

## -ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ కు ప్రశంసల జల్లులు

మేడిపల్లి ఎప్రిల్ 30(ప్రజాకలం న్యూస్)

ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో విజయ దుందుభి మ్రోగించి ఔరా అనిపించారు. వందకు 99% ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై,అందుకు కారణమైన ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు స్థానికులు. విద్య బోధన విధానం, క్రమశిక్షణ,మంచి నిర్ణయాలు నేటి పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు ప్రధానోపాధ్యాయులు మంచి పునాది వేశారనడంలో అతిశయోక్తి లేదు. స్కూల్ లో చదివే పిల్లల తల్లిదండ్రులు ఎప్పటికి మీకు రుణపడి ఉంటారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ



కార్పొరేటర్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు సత్య ప్రసాద్ ను ఉపాధ్యాయులను విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# కల్వకోల్‌లో ఇందిరమ్మ ఇల్లు మంజూరు

## కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ

మహేశ్వరం, ఏప్రిల్ 30,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామానికి



చెందిన జ్ఞానాది రమ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. ఇల్లు నిర్మాణ పనుల ప్రారంభానికి సంబంధించి గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ జనార్ధన్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి శుభారంభంగా ముగ్గు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు సాయిని గోపాల్ రెడ్డి, అరటి కుమార్, శ్రీనివాస్ చారి, వినయ్ చారి, పరమేష్ చారి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని ప్రజాప్రతినిధులు తెలిపారు.

# మీర్‌పేట్ ప్రభుత్వ మైదానాన్ని సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య

మహేశ్వరం, ఏప్రిల్ 30,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ సర్కిల్-16 పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య గురువారం నాడు మీర్‌పేట్ ప్రభుత్వ మైదానాన్ని సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. మైదానంలో ప్రజలకు



అందిస్తున్న సదుపాయాలపై వివరాలు తెలుసుకొని, అవసరమైన మెరుగుదలలపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం నాదర్‌గుల్ ప్రాంతంలో కొనసాగుతున్న డీసిల్టేషన్ పనులను పరిశీలించి, పనుల నాణ్యత, పురోగతి గురించి విచారించారు. పనులు సమయానికి పూర్తిచేయాలని, ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి కుర్మల్‌గూడలోని జేఎన్ఎన్‌యుఆర్ఎం భవనాలను సందర్శించి, అక్కడ నివసిస్తున్న ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నివాస సదుపాయాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను గమనించి, వెంటనే పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ అభినయ్ కుమార్, ఏఎంహెచ్ఓ డా. ప్రవీణ్, ఏఈ గంగాప్రసాద్, ఏఈ హరీష్ స్పోర్ట్స్ ఇన్స్పెక్టర్ సంతోష్ పాల్గొన్నారు.



# మేడేను విజయవంతం చేయండి

## భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలి భవన నిర్మాణ కార్మిక సంఘం

## రాష్ట్ర నాయకులు నర్రగిరి కార్మికులకు పిలుపు

మహేశ్వరం, ఏప్రిల్ 30,(ప్రజా కలం)

అంతర్జాతీయ కార్మిక దినం మేడేను విజయవంతం చేయాలని మేడే కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు నర్రగిరి పిలుపునిచ్చారు. గురువారం నాడు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు 141 వ మేడేను శంషాబాద్ మండలంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని గిరి తెలిపారు విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి జిలకర రాజు అధ్యక్షుడు నరేష్ నాయక్ మండల నాయకుడు శ్రీను పాల్గొన్నారు.

# శ్రీ ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవాలకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి ఆహ్వానం.

సిద్దిపేట ప్రజాకలం ఏప్రిల్ 30.

రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యులు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. గ్రామంలో మే 3వ తేదీ నుంచి గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ మహోత్సవం



సందర్భంగా ప్రత్యేక ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామ దేవత శ్రీ ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవాలను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈసారి మరింత వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కొత్తపల్లి గ్రామానికి చెందిన గౌడ కులస్తులు మంతూరి యాదగిరి, చుంచనకోట మహేష్ గౌడ్, నాగుల్ గౌడ్, వర్ధి గౌడ్, మాజీ జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, మంతూర్ సర్పంచ్ పర్వీజ్ హైమద్, టీఆర్ఎస్ నాయకులు, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల సంక్షేమానికి పెద్దపీట

## పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..

## అంగన్వాడి ఉపాధ్యాయులకు మొబైల్ ఫోన్ల పంపిణీ

పటాన్ చేరు ఏప్రిల్ 30 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్చెరు పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్చెరు లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 153 మంది. ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అంగన్వాడి కేంద్రాన్ని డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ప్రతి అంగన్వాడి ఉపాధ్యాయురాలికి మొబైల్స్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జయరాం నాయక్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, అంగన్వాడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీ ఓ ప్రకాష్...

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం స్థానిక ఎంపీ ఓ ప్రకాష్, ఈజీఎస్ ఏపిఓ వినోద్ గౌడ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్యలు పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ కు సూచించారు. కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు ధర వస్తుందన్నారు. పనులను ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు పూర్తిచేయాలని తెలిపారు . పనులు జరిగే చోటు త్రాగునీరు వసతి కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.




# 565 మార్కులు సాధించిన శ్రీజను సన్మానించిన ఎస్సై అనిల్ రెడ్డి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 30:

నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతిలో 565 మార్కులు సాధించిన ప్రతిభావంతురాలు శ్రీజను ఎస్సై అనిల్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థిని శ్రీజ సాధించిన విజయం పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. కష్టపడి చదివితే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా ఉన్నత ఫలితాలు సాధించగలరని శ్రీజ నిరూపించిందని అన్నారు. ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

## మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 30:

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి



ముఖ్య అతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని పేద ప్రజలకు కులమత భేదాలు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. ప్రతి పేదవాడికి సొంత ఇంటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే సొంత స్థలం లేని వారికి కూడా ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి ఇళ్లు మంజూరు చేసే దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి,కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్, నాయకులు బాలయ్య,తెడ్డు రమేష్,చౌట్‌పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 30:

మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో బుధవారం వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జైనాబ్ ఫాతిమా 526/600, ఆస్తా బేగం 489/600, అయాన్ బేగ్ 458/600 మరియు ఉత్తీర్ణులైన విద్యార్థులను పాలెం గ్రామ సర్పంచ్ రాధ రవి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు పల్లెపాటి వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు మహేష్ కుమార్,విడిసి సభ్యులు విద్యాసాగర్,నరసయ్య రమేష్, జహీర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు అభినందించినారు. ఈ సందర్భంగా పాలెం సర్పంచ్ రాధ మాట్లాడుతూ ఇంకా పై చదువులు చదివి జీవితంలో మంచిగా స్థిరపడాలని, గ్రామానికి పేరు తీసుకురావాలని అన్నారు .






# ఓబీసీలకు న్యాయం చేయాలి

## లేకపోతే నిరాహార దీక్ష: వి.హనుమంతు రావు బహిరంగ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ప్రజా కలం ప్రతినిధి)
కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతు రావు ప్రధాని నరేంద్ర మోదీకు బహిరంగ లేఖ రాశారు. దేశంలో జనగణన జరుగుతున్నప్పటికీ కుల గణన చేపట్టకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశంలో మెజారిటీగా ఉన్న ఓబీసీ వర్గాలకు న్యాయం చేయకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. మూడు సార్లు ప్రధాని అయిన మోదీ, ఓబీసీల సమస్యలను పట్టించుకోవడం లేదని హనుమంతు రావు విమర్శించారు. దేశాన్ని హిందూ దేశంగా మార్చాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో మే 10న తెలంగాణకు రానున్న మోదీ పర్యటనకు ముందు ఓబీసీల హక్కులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కుల గణన వెంటనే చేపట్టకపోతే తాను ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. ఓబీసీలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని, వారి సామాజిక-ఆర్థిక స్థితిగతులను వెలికి తీయాలంటే కుల గణన అవసరమని పేర్కొన్నారు.

ఇక దేశ ప్రజలకు న్యాయం జరగాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని తమ ఆకాంక్ష అని హనుమంతు రావు తెలిపారు. అప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## దేశంలోనే అగ్రగామి సంస్థ కోటా రాజస్థాన్

# మోషన్ కాలేజీలో ఉచిత విద్య

-మెరిట్ సాధించిన పేద విద్యార్థులను ప్రోత్సహించడమే మోషన్ కాలేజీ లక్ష్యం.

-మోషన్ కాలేజ్ చైర్మన్, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్.



హన్మకొండ ఏప్రిల్ 30 (ప్రజా కలం ప్రతినిధి)
2025-26 విద్యా సంవత్సరంలో ఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మంచి సువర్ణావకాశం. కోటా రాజస్థాన్ మోషన్ కాలేజ్ ఐఐటి, జేఈఈ, నీట్ జూనియర్ కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విద్యార్థినీ, విద్యార్థులకు శుభవార్త తెలిపారు. ఐఐటీ, మెడికల్ కోచింగ్ కు దేశంలోనే అగ్రగ్రామి సంస్థ అయినటువంటి కోటా రాజస్థాన్ మోషన్ ఐఐటి, జేఈఈ, నీట్ జూనియర్ కళాశాల హన్మకొండ నందు విద్యార్థులు అడ్మిషన్ పొంది, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ విద్యార్థినీ, విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన మోషన్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐఐటి, మెడికల్ సీట్లను సాధించడమే లక్ష్యంగా హన్మకొండలోని నయీమ్ నగర్ లో కోటా రాజస్థాన్ నుండి ఏర్పడ్డ మోషన్ కాలేజీలో నిష్ణాతులైన అధ్యాపక బృందంతో విద్యార్థినీ, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన జరుగుతుందన్నారు. అదేవిధంగా పదవ తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు మోషన్ కాలేజీలో ఉచితంగా అడ్మిషన్ ఇస్తామని తెలిపారు. పదవ తరగతిలో 570 మార్కులకు పైన సాధించిన విద్యార్థులకు 100 శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ, 560 మార్కులకు పైన సాధించిన విద్యార్థులకు 75 శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ, 550 మార్కులకు పైన సాధించిన విద్యార్థులకు 50 శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ, 500 మార్కులకు పైన సాధించిన విద్యార్థులకు 25 శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ ఉంటుందని, ఈ మంచి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తుకు బంగారు పునాదులు వేసుకోవాలని వేణుగోపాల్ గౌడ్ విద్యార్థినీ, విద్యార్థులకు పిలుపునిచ్చారు. మిగితా వివరాల కోసం హన్మకొండ, నయీమ్ నగర్, సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదురు లైన్ లోని మోషన్ కాలేజీ లో గాని, కాలేజీ సెల్ నెంబర్ 9703000850/851 లకు సంప్రదించగలరు

# పోలీసు అధికారుల సేవలు వెలకట్టలేనివి

## :సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్



శేర్లింగంపల్లి ప్రజా కలం న్యూస్ ప్రతినిధి: ఏప్రిల్ 30
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఏడు మంది పోలీసు సిబ్బందిని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ, రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పత్రాలు అందజేసి, పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భం గా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ,, యూనిఫాం పోలీస్‌కు రెండో చర్మంలాంటిదని, ప్రజల కన్నీరు తుడిచి, వారికి సేవలు అందించిన ప్రతి పోలీసు అధికారి పదవీ విరమణ సమయంలో గర్వపడాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి తన కుటుంబానికి రుణపడి ఉండాలన్నారు. పోలీసులు విధుల నిర్వహించే క్రమం లో వారి కుటుంబ సభ్యులు ఎన్నో త్యాగాలు చేస్తారని గుర్తు చేశారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, సమాజంలోని పౌరులతో సానుభూతితో, గౌరవంతో మెలగాలని సూచించారు. పదవీ విరమణ చేసిన పోలీసులు తమ అనుభవంతో పోలీస్ శాఖకు అవసరమైనప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ బీ ఏడీసీపీ రవికుమార్ డిసీపీగా ప్రమోషన్ పొందినందుకు సీపీ అభినందనలు తెలిపారు. తన పదవీ విరమణ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ. . ప్రజలకు చేరువయ్యేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఒక కానిస్టేబుల్ కుమారుడిగా కెరీర్‌ను ప్రారంభించి, నేడు డీసీపీ స్థాయికి ఎదగడం పట్ల గర్వంగా ఉందన్నారు. పోలీస్ శాఖలో శారీరక శ్రమతో పాటు 'హ్యూమన్ ఇంటెలిజెన్స్' మరియు మేధోపరమైన కృషి ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు. తన విజయ ప్రస్థానంలో కుటుంబ సభ్యుల తోడ్పాటు మరవలేనిదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. సైబరాబాద్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో ట్రాఫిక్ 2 డీసీపీ రంజన్ రతన్ కుమార్, ఎస్‌బీ ఎస్‌ఐ పి. వెంకట్ రెడ్డి, ఏఆర్‌ఎస్‌ఐ కె. మురళీధర్ సంగారెడ్డి జిల్లా అటాచ్‌మెంట్‌తో సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఆర్‌ఎస్‌ఐ ఎన్. కృష్ణ సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఎస్‌ఐ వి. వెంకట సూర్యనారాయణ రాజు ఈఓడబ్ల్యూ సైబరాబాద్‌లో, డి. రాములు మోకిల పోలీస్ స్టేషన్‌లో, అలాగే జి. అశోక్, బార్బర్, సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూ తమ పదవీ విరమణ పొందారు. వీరి సేవలను అధికారులు అభినందిస్తూ, భవిష్యత్తులో ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, ఎస్‌బి ఏడీసీపీ రవికుమార్, మరియు వివిధ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# అల్మాస్గూడలో ప్రభుత్వం పార్క్ స్థల కబ్జా

- రామిడి కళావతి కాలనీ, బిఎస్ఆర్ కాలనీవాసులకు
- యువ మోర్చారాష్ట్ర కార్యవర్గ సభ్యులు శూర కర్ణరెడ్డి అండ

మహేశ్వరం, ఏప్రిల్ 30, (ప్రజా కలం)
గ్రేటర్ హైదరాబాద్ జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్, బడంగ్పేట్ సర్కిల్ 16, నాదర్గుల్ డివిజన్ 57. బడంగ్పేట్ మున్సిపల్ సర్కిల్ నాదర్గుల్ డివిజన్ అల్మాస్గూడ గ్రామంలోని సర్వే నెంబర్ 31,32, 33,34,లో పార్కు స్థలం కబ్జా విషయంపై ఈరోజు బడంగ్పేట్ సర్కిల్



డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య గారిని కలిసి యువ మోర్చారాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామిడి శూరకర్ణ రెడ్డి కంప్లైంట్ చేయడం జరిగింది. రామిడి కళావతి కాలనీకి సంబంధించినటువంటి పార్కు స్థలం 294 గజాలు. బి ఎస్ ఆర్ నగర్ కాలనీ సంబంధించిన పార్కు ప్రభుత్వ స్థలం 1001 గజం మొత్తం 1295 గజాలు ప్రభుత్వ పార్క్ స్థలము కబ్జాకు గురి కావడం జరిగింది. కబ్జా గురి చేస్తున్నటువంటి బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి గారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలుతీసుకోవాలని రాత్రికి రాత్రిచుట్టు ప్రహరీ గోడ నిర్మించి పార్క్ స్థలాన్ని కబ్జా చేయడం జరిగింది . ఈ విషయంపై జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య గారికి విన్నవించగా వారు సానుకూలంగా స్పందించి తక్షణమే ఆ పార్కుని స్వాధీనం చేసుకుంటామని చెప్పి హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామిడి కళావతి కాలనీ,బి ఎస్ ఆర్ నగర్ కాలనీ వాసులుకు పార్క్ అందుబాటులో తేచ్చేంత వరకు రాజీ లేని పోరాటం చేస్తానని పార్కును కాపాడుతానని, ప్రజలకు అందుబాటులో తెస్తానని ఈ సందర్భంగా శూరకర్ణ రెడ్డి తెలియజేయడం జరిగింది.

# కవిత పార్టీ పేరులో మార్పు, ఐదు రోజుల్లోనే తెలంగాణ రక్షణ సేనగా మార్పు

## ఈసీ లేఖలో కనిపించని తేదీ, తెలంగాణ రాష్ట్ర సేన

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ప్రజా కలం ప్రతినిధి)
భారీ ఆశలతో, అనేక నెలల సన్నాహాల తర్వాత అట్టహాసంగా ప్రారంభమైన కల్వకుంట్ల కవిత రాజకీయ ప్రస్థానం తొలి అడుగులోనే గందరగోళానికి గురైంది. ఏప్రిల్ 25వ తేదీన బహిరంగ సభలో తన పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ పేరు ప్రకటించిన ఐదు రోజుల్లోనే పార్టీ పేరు మారిపోవడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. తాజాగా కేంద్ర ఎన్నికల కమిషన్ కవితకు ఒక లేఖ రాస్తూ, తెలంగాణ రక్షణ సేన అనే పేరుతో పత్రికల్లో పబ్లిక్ నోటీసు ప్రచురించుకోవచ్చని సూచించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అయితే ఇది పార్టీ పేరుకు ఇచ్చిన తుది అనుమతి కాదని, పబ్లిక్ నోటీసు ద్వారా వచ్చే అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని ఈసీ స్పష్టం చేసింది.?ఈ వ్యవహారంలో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, ఎన్నికల కమిషన్‌కు ఏప్రిల్ 23న కవిత ఐదు పేర్లతో కూడిన జాబితాను పంపి అందులో ఒకదానికి అనుమతి కోరారు. విచిత్రంగా ఆమె సభలో ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర సేన అనే పేరు ఆ జాబితాలోనే లేకపోవడం గమనించవచ్చు. ఈసీకి పంపని పేరును ఆమె బహిరంగ సభలో ఎందుకు అనౌన్స్ చేశారు, మళ్ళీ ఐదు రోజుల్లోనే పేరును ఎందుకు మార్చుకోవాల్సి వచ్చింది అనే ప్రశ్నలు ఇప్పుడు ఉత్పన్నమవుతున్నాయి. దీనికి తోడు కవిత పంపినట్లు చెబుతున్న లేఖపై తేదీ కూడా లేకపోవడంతో, అసలు ఆ లెటర్ ఎప్పుడు రాశారనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ స్థాపించిన ఐదు రోజులకే పేరు మార్చడాన్ని తప్పుబడుతూ, కనీసం నిలకడ లేదంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు. ఒకవైపు సెంటిమెంట్‌ను వాడుకోవాలని చూస్తూనే,మరోవైపు ఈ అస్పష్టతతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.


Telangana Praja Jagruti

Kalvakuntla Kavitha
President

To

The Secretary
Election Commission of India
Nirvachan Sadan
Ashoka Road
New Delhi – 110001

Subject: Submission of alternative names of the Party under Article I of the Constitution – Compliance with ECI guidelines

Sir/Madam,

I, on behalf of Telangana Praja Jagruti, respectfully submit that the General Body/Founding Members of the Party deliberated upon Article I: Name of the Party in strict conformity with the guidelines issued by the Election Commission of India, including the requirement that the name of a political party shall not contain any reference to religion or caste. After due deliberation, the following alternative names were placed before the members of the Party for consideration:

1. TELANGANA PRAJA JAGRUTI
2. TELANGANA JAGRUTI
3. TELANGANA RAKSHANA SENA
4. TELANGANA RASTRA JAGRUTI
5. TELANGANA PRAJA SHAKTI

The aforesaid alternative names were unanimously approved by the members as being secular, inclusive, and fully compliant with the constitutional and statutory requirements governing the registration of political parties. This submission is made for the kind consideration of the Election Commission of India and for such further action as may be deemed appropriate under the provisions of the Representation of the People Act, 1951, and the rules and guidelines framed thereunder, for the purpose of registration of the political party.

PRESIDENT
Telangana Praja Jagruti

Yours faithfully,

KALVAKUNTLA KAVITHA
PRESIDENT

040 – 2351 1111
8-2-316/6/H, Road No. 14, Near Asha Hospital, Banjarahills, Hyderabad – 500034, Telangana.

## అల్మాస్‌గూడలోని సర్వే నంబర్లు 31, 32, 33, 34

# ఎలాంటి కబ్జా జరగలేదు

### బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గోవర్ధన్ రెడ్డిలను రాజకీయంగా దెబ్బతీసే కుట్ర

### సర్వే నంబర్లు 30, 36 కు రెండింటికీ భౌగోళికంగా రికార్డుల పరంగా సంబంధం లేదు

### బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గోవర్ధన్ రెడ్డి



మహేశ్వరం, ఏప్రిల్ 30,(ప్రజా కలం): సర్వే నంబర్లు 30, 36 కు రెండింటికీ భౌగోళికంగా రికార్డుల పరంగా సంబంధం లేదని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గోవర్ధన్ రెడ్డిలను రాజకీయంగా దెబ్బతీసే కుట్ర జరుగుతుందని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గోవర్ధన్ రెడ్డి అన్నారు. రామిడి శూరకర్ణ రెడ్డి అల్మాస్‌గూడలోని సర్వే నంబర్లు 31, 32, 33, 34 లలో పార్కు స్థలం కబ్జాకు గురైందని ఆరోపించారు. అయితే, మీరు అందించిన 1982 నాటి అధికారిక లేఅవుట్ ప్లాన్లు సర్వే నంబర్లు 30 మరియు 36 కు సంబంధించినవి. ఈ రెండింటికీ భౌగోళికంగా గానీ, రికార్డుల పరంగా గానీ సంబంధం లేదని అర్థమవుతోందని అన్నారు. లేఅవుట్ ప్లాన్ (1982) ప్రకారం ఆ స్థలం బి. రామ్ రెడ్డి మరియు బి. పోచి రెడ్డిలకు చెందినదిగా ఉంది. శూరకర్ణ రెడ్డి ఆరోపిస్తున్న 1295 గజాల వివాదాస్పద స్థలం ఈ లేఅవుట్ పరిధిలోకి రాదు. పాత రికార్డుల ప్రకారం బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గోవర్ధన్ రెడ్డిలకు కేటాయించిన లేదా వారికి సంబంధించిన స్థలాలు స్పష్టంగా ఉన్నాయి, అందులో ఎటువంటి ఆక్రమణలు కనిపించడం లేదు అని అన్నారు.శూరకర్ణ రెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్న సర్వే నంబర్లు స్థల వివరాలు, ఈ లేఅవుట్ ప్లాన్లలోని వాస్తవాలతో ఏమాత్రం సరిపోలడం లేదు. స్థానిక ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో, అధికార పార్టీ నాయకులైన బోయపల్లి రాఘవేందర్ రెడ్డి మరియు గోవర్ధన్ రెడ్డిల ప్రతిష్టను దెబ్బతీయడానికి, ప్రజల్లో వారిపై వ్యతిరేకత పెంచడానికి ఈ "భూకబ్జా" అంశాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటున్నారని స్పష్టంగా తెలుస్తోందని అన్నారు.నిజమైన ఆధారాలు లేకుండా, పాత లేఅవుట్ నిబంధనలను పక్కన పెట్టి, కేవలం రాజకీయ లబ్ధి కోసమే అధికారులకు ఫిర్యాదులు చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నట్లు కనిపిస్తోంది.మొత్తంగా చూస్తే, శూరకర్ణ రెడ్డి చేస్తున్న ఆరోపణలు కేవలం "రాజకీయ బురదజల్లే ప్రయత్నం" (క్యారెక్టర్ అస్సస్సినేషన్) మాత్రమే. చట్టబద్ధమైన లేఅవుట్ ప్లాన్లు మరియు రికార్డులు బోయపల్లి సోదరుల వైపు ఉన్నాయని, వారు ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని విశ్లేషణలో తేలింది. అందుకే ఈ అసత్య ప్రచారాలపై చట్టపరంగా మరియు రాజకీయంగా గట్టిగా స్పందించాల్సిన అవసరం ఉంది.




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com